ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 31.08.2025 | సంపుటి :12 సంచిక : 42 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## స్థానిక సంస్థల్లో.. 42% బీసీ రిజర్వేషన్‌తోనే ఎన్నికలు

### రిజర్వేషన్‌లపై 50% పరిమితిని ఎత్తివేయాలని కేబినెట్ నిర్ణయం

**సెప్టెంబర్‌లోనే స్థానిక ఎన్నికలు**



- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం
- మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం రికవరీ కోసం వ్యాపారులపై పీడీ యాక్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం 2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు మిగతా 2లో..

## తెలంగాణ అసెంబ్లీ ప్రారంభం



### నేడు సభలో బీసీ రిజర్వేషన్‌పై చట్టసవరణ బిల్లు

దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం • మండలిలో దివంతగత సభ్యులకు సంతాప తీర్మానం



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై- శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేం దర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన మండలి మాజీ సభ్యులు మాగం రంగారెడ్డికి సభ నివాళి అర్పించిన అనంతరం సోమవారానికి వాయిదే పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది. గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపా త్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నా రు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మా తగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మం చి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని మిగతా 2లో..

## వరదలపై చర్చిద్దామంటే బురద రాజకీయాలా?

సభ రెండు రోజులంటే ఎలా?
కాళేశ్వరంతో చర్చకే ప్రాధాన్యం
అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం
పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు భయమెందుకు?: హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):** రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం అంటోందని, ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని మిగతా 2లో..

## పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

గతంలో మేం అడిగితే ఎందుకు ఇవ్వలేదు
: డిప్యూటీ సీఎం భట్టి 2లో..

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

### మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం





**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌ను ఎంపిక చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో సిఫార్సు చేసిన అమేర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్‌కు చోటు లభించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు కేబినెట్‌లో తీర్మానించి గవర్నర్‌కు పంపింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు ఎదురు చూస్తున్న అజారుద్దీన్‌ను అనూహ్యంగా ప్రభుత్వం.. ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది.

## ప్రతిపక్షనేత అంటే నమోషీ ఎందుకు?

- ప్రజల తరపున సురవరం పోరాడలేదా
- పేదల కోసం తపించిన మహానేత సురవరం
- ఆయన ఆశయాలు కొనసాగించేందకు కృషి చేస్తాం
- సురవరం సంస్మరణ సభలో : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):**పేదల జీవితాలలో మార్పు రావాలని.. వారి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని కొనియాడారు. సమాజంలో అనాగరికాలు రూపుమాపేలా ఆయన ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టారన్నారు. మిగతా 2లో..

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ నేడే



### ప్రకటించిన శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):**అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై రేపు నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభ వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందన్నారు. "బీసీ రిజర్వేషన్ల మిగతా 2లో..

## చైనాలో మోదీకి భారతీయుల ఘనస్వాగతం



ఏడేళ్ల తర్వాత చైనాకు భారత ప్రధాని
ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు తియాంజిన్‌కు చేరుకున్న మోదీ

**బీజింగ్(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో అడుగుపెట్టారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన తియాంజిన్‌కు చేరుకున్నారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణల అనంతరం ప్రధాని మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి. చైనాలో చివరిసారి 2018లో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతున్న వేళ.. ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. జపాన్‌లో రెండు రోజుల పర్యటన అనంతరం ప్రధాని మోదీ చైనాకు చేరుకున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా నిర్వహించనున్న ఎస్‌సీవో సదస్సులో పాల్గొననున్నారు. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్ సహా ఆయా దేశాధినేతలతో సమావేశం కానున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం తీసుకువచ్చేందుకు భారత్-చైనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అంతకు ముందు ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయం తెలిసిందే. మిగతా 2లో..

## మహిళల భద్రతలో హైదరాబాద్‌కు 8వ స్థానం

### జాతీయ వార్షిక నివేదిక వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలోని 31 నగరాల్లో మహిళల భద్రతపై చేపట్టిన ఈ సర్వే - తొలి రెండు స్థానాల్లో దేశంలో కోహిమా, విశాఖపట్నం నగరాలు - హైదరాబాద్‌లో అన్ని విషయాల్లో 69.9శాతం మంది సంతృప్తి వ్యక్తం మహిళల భద్రతపై నిర్వహించిన జాతీయ వార్షిక నివేదిక సూచి (నారీ) - 2025లో హైదరాబాద్ 8వ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 31 నగరాల్లో సమగ్ర భద్రత, ప్రజా రవాణా, పార్కులు, పౌర ప్రదేశాలు, పని ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య మిగతా 2లో..

## సమర్థతకు పట్టంకట్టండి



### దేశానికి ఏది అవసరమో ఆలోచించండి • అవకాశమిస్తే బీజేపీ అగ్రనేతలనూ కలుస్తా

- మద్దతు కోసం లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు పంపించా..
- ఉపరాష్ట్రపతి ఎన్నిక దేశంలోనే న్యాయంగా నిలవాలన్నదే నా ఆకాంక్ష
- మెజారిటీ ఉన్నంతమాత్రన ఇష్టమొచ్చినట్టు వ్యవహరించడం కాదు
- రాంచీలో పర్యటించిన ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బిఎస్ రెడ్డి

**రాంచీ (జనంసాక్షి) :** పార్టీలకు అతీతంగా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తన ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని, ప్రధానంగా యోగ్యత, సమర్థతను దృష్టిలో పెట్టుకోవాలని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి కోరారు. ఇప్పటికే అందరు ఎంపీలకు లేఖలు పంపినట్టు వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో పర్యటించిన సందర్భంగా ఆయనకు స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ క్యాంప్ కార్యాలయంలో ఆయన భేటీ అయ్యారు. మిగతా 2లో..





## పీసీ ఘోష్ కాదు.. పీసీసీ ఘోష్

గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నిరసన • ఎరువుల కొరతపై విమర్శలు
కాళేశ్వరం మొదలు అన్ని అంశాలపైచర్చకు సిద్ధం: కేటీఆర్
యూరియా కొరతపై బిఆర్ఎస్ సచివాలయం ఎదుట ధర్నా
కేటీఆర్, హరీశ్ తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్(జనంసాక్షి):**శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన చేపట్టింది. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి అసెంబ్లీకి వచ్చారు. అమరుల స్థూపం వద్ద కాసేపునిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన మిగతా 2లో..

## 50 ఆయుధాలకే పాక్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చింది

### ఐఏఎఫ్ అధికారి




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడికి గట్టి బదులిస్తూ భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దానికి సంబంధించిన సరికొత్త వివరాలను ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ వెల్లడించారు. ఈమేరకు ఓ జాతీయ మీడియా సదస్సులో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు అత్యంత మిగతా 2లో..

## ప్రసాదం ఎక్కువ పెట్టనందుకు సేవకుడి దారుణ హత్య

- కర్రలతో దుండగుల మూకుమ్మడి దాడి
- దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన
- ఢిల్లీలో ప్రజలు సురక్షితంగా లేరు: కేజ్రీవాల్

2లో..

## ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం



### ఇది అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయం
### దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తాం: ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్ట విరుద్ధమని అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు నిచ్చింది. టారిఫ్‌లను విధించేందుకు అధ్యక్షుడికి విస్తత అధికారాలు లేవని స్పష్టం చేస్తూ, ఓ ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సంచలన వాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయమని, దీనిపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేస్తామని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. ఈ తీర్పు ఇలాగే కొనసాగితే, అది అమెరికాను నాశనం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్ సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా ఈ తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు కోర్టు నిలిపివేసింది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లు యథావిధిగా అమల్లో ఉంటాయి. ఈ తీర్పు సుప్రీంకోర్టులో కూడా నిలబడితే, భారత్‌పై విధించిన 25 శాతం ప్రతిస్పందన సుంకం రద్దవుతుంది. టారిఫ్‌లను విధించేందుకు అధ్యక్షుడికి విస్తత అధికారాలు లేవని స్పష్టం చేస్తూ, ఓ ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సంచలన వాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయమని, దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. కాగా ట్రంప్ సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా ఈ తీర్పు అమలును అక్టోబర్ 14 మిగతా 2లో..

## ఆదుకోండి మహాప్రభూ..

### సర్వం కోల్పోయాం • నిజామాబాద్,నిర్మల్ వరదబాధితుల వేడుకోలు

**నిర్మల్,నిజామాబాద్(జనంసాక్షి):**ఎగువ నుంచి వస్తున్న వరదతో నిజామాబాద్, నిర్మల్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం చూపిస్తోంది. గోదావరి నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఇతర ఆలయాలు, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు నీటమునిగాయి. వరదలో చిక్కుకున్న వారిని ఎస్డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు బృందాలు రక్షించాయి. మరోవైపు శ్రీరాంసాగర్ , మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టుల నుంచి వచ్చిన భారీ వరద నిర్మల్ జిల్లాలోని సోన్ గ్రామాన్ని చుట్టుముట్టింది. సమీప గ్రామాల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. అక్షర కాలనీలో చిక్కుకున్న వారిని స్థానికులు ట్రాక్టర్ సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అమ్మవారి ఆలయ సమీపంలోని ఆర్యవైశ్య సత్రంలో చిక్కుకున్న గర్భిణిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, బాసర ఎస్ఐ బయటకు తీసుకువచ్చారు. మిగతా 2లో..





### బీజేపీ, ఆర్ఎస్ఎస్,ఈసీలు కలిసి
## దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయ్

### బీహార్ ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్ గాంధీ

**పాట్నా(జనంసాక్షి):**బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా బిహార్‌లోని ఆరాలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి రాహుల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ బీజేపీపై మిగతా 2లో..

# స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్‌తోనే ఎన్నికలు

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయిం చింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ- హాలులో జరిగిన ఈ మం త్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్డు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమీర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం

## ప్రతిపక్షనేత అంటే నమోషీ ఎందుకు?

రవీంద్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం హాజరయి మాట్లాడారు. మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యువ ఎంపీగా ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు. అదే కోవలో సురవరం సుధాకర్‌రెడ్డి కూడా గుర్తింపు తెచ్చుకున్ననేత అన్నారు. సిపిఐ కార్యార్శిగా, ఎంపిగా ఆయన చిరస్మరణీయ సేవలు అందించారని అన్నారు. ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదని పరోక్షంగా బిఆర్‌ఎస్‌పై విసుర్లు విసిరారు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. ప్రజల తరపున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరఫున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం దిగిపోయినా కమ్యూనిస్టులే కారణమని తన నమ్మకం తనదని సిఎం అన్నారు. రవీంద్ర భారతిలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యారు రేవంత్. సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు. కమ్యునిస్టులంటేనే ప్రతిపక్షమని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం,ఆలోచన ఇంకా పెరగాలన్నారు రేవంత్. కమ్యునిజం అంటే లైబ్రరీలో దొరికే పుస్తకం కాదని.. కమ్యూనిస్టులంటేనే ప్రజల కోసం కొట్లాడే వాళ్లని అన్నారు. కమ్యూనిస్టులంటే ప్రజలకు ఓ భరోసా,నమ్మకం ఉందన్నారు. సురవరం ఉంటే ఓట్ చోరీపై మరింతగా పోరాడే వారరన్నారు. మహారాష్ట్రలో నాలుగు నెలల్లో కొత్తగా కోటి మంది ఓటర్లు పుట్టుకొచ్చారని ఆరోపించారు సీఎం రేవంత్. బీహార్ లో 65 లక్షల కొత్త ఓట్లు- వచ్చాయని చెప్పారు. ఓట్ల తొలగింపుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. సురవరం చివరి శ్వాస వరకు సీపీఐతోనే ఉన్నారని.. 65 సంవత్సరాల పాటు- ఎర్రజెండా నీడనే ఉన్నారని కొనియాడారు రేవంత్. సురవరం సామాజిక చైతన్యం ఉన్నవారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సూచనతోనే తెలుగు యూనివర్శిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### 50 ఆయుధాలకే..
### పాక్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చింది

కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేదించాయి. దాంతో దాయాది కాళ్లబేరానికి వచ్చింది. అందుకోసం వైమానిక దళం 50 కంటే తక్కువ ఆయుధాలనే ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. "యుద్ధాన్ని ప్రారంభించడం సులభమే. ముగించడం అంత సులువైన పని కాదు. దానిని దృష్టిలోపెట్టుకొని మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మోహరింపులు చేపట్టాం" అని ఆయన వెల్లడించారు.

## ప్రసాదం ఎక్కువ పెట్టనందుకు సేవకుడి దారుణ హత్య

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు.. ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యారు. ప్రస్తుతం వైరల్‌గా మారాయి.ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. సందర్శన తర్వాత ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. అడగ్గానే ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలు తీసుకుని ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒక్కడిని చేసి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అక్కడికక్కడే యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలోని ఫత్తేపూర్ ప్రాంతానికి చెందిన యోగేంద్ర సింగ్ (35)గా పోలీసులు గుర్తించారు. గత 14 నుంచి 15 సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. కానీ కొందరు దుండగులు అకారణంగా కొట్టి చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. దక్షిణపురి నివాసి అయిన 30 ఏళ్ల అతుల్ పాండే అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు- పోలీసులు పేర్కొన్నారు.ఢిల్లీలోని కల్కాజీ ఆలయంలోని సేవకుడు దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అధికార బిజెపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. అసలు ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఆలయంలో సేవకుడిని హత్య చేసేముందు ఆ దుర్మార్గుల చేతుల వణకలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఇది శాంతి భద్రతల వైఫల్యం కాకపోతే మరేమటి అని ఆయన ఎక్స్ లో బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశారు. బిజెపి నాలుగు ఇంజన్లు ఢిల్లీని ఇంతటి స్థితికి తీసుకువచ్చాయి. ఇప్పుడు దేవాలయాల్లో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా? లేదా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

## పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు- వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు.

## తెలంగాణ అసెంబ్లీ ప్రారంభం

ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. 1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- డైరెక్టర్‌గా 1988-93లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు. గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్ని-కై- ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు- పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ గోపీనాథ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌తో తనకు చిరకాల మిత్రుత్వం ఉందని శ్రీధర్ బాబు అన్నారు. తరవాత కెటిఆర్, ఇతర సభ్యులుఉమాట్లాడుతూ గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సభ సోమవారానికి వాయిదా పడింది.

## బీజేపీ, ఆర్ఎస్ఎస్,ఈసీలు కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయ్

తీవ్ర విమర్శలు గుప్పించారు.బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిపిన దాడిపైగా రాహుల్ అభివర్ణించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్?డీఏ ప్రభుత్వం విజయవంతమైందని ఆరోపించారు. కానీ బిహార్‌లో మాత్రం బీజేపీ, ఈసీ ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని చెప్పారు. ఓటు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలకు ఒక హక్కు అని రాహుల్ గాంధీ అన్నారు. కానీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వారి ఓట్లను చోరీ చేస్తోందని ఆరోపించారు.భారత రాజ్యాంగం ఓటు హక్కును హామీని ఇస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుని ప్రజల ఓటు హక్కును తొలగించడం ద్వారా బీజేపీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని విమర్శించారు.

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ నేడే

బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలి" అని శ్రీధర్‌బాబు తెలిపారు.బీఏసీ నుంచి భారత రాష్ట్రసమితి వాకౌట్‌బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై రేపు చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

## ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం

వరకు కోర్టు నిలిపివేసింది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లు యథావిధిగా అమల్లో ఉంటాయి. ఈ తీర్పు సుప్రీంకోర్టులో కూడా నిలబడితే, భారత్‌పై విధించిన 25 శాతం ప్రతిస్పందన సుంకం రద్దవుతుంది.

## ఆదుకోండి మహాప్రభూ

నాగభూషన్ విద్యాలయం చుట్టూ నీరు చేరడంతో వెనుకాల గేటు ద్వారా పైఅంతస్తులోని విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు పంపించారు. ఎస్?బీఐలోని సిబ్బందిని సైతం బోట్లతో బయటకు తీసుకువచ్చారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి వరద నీరు బాసరలోని ఈవో కార్యాలయం ప్రధాన ద్వారం వద్దకు రావడంతో అర్చకులు గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బాసర వరద కారణంగా భక్తులు రాకపోవడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం వెలవెలబోతుంది. సుమారు 40 ఏళ్లలో ఈ స్థాయి వరదలు ఎప్పుడూ రాలేదని స్థానికులు చెబుతున్నారు. బాసర మండల కేంద్రంతో పాటు 10 గ్రామాలు నీటమునిగాయి. వేల ఎకరాల్లో పంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాసర మండలంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యటించారు. బిద్రెల్లి వంతెన వద్ద నీట మునిగిన పంటలను పరిశీలించారు. అక్కడే రైతులు, గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాసరలో గోదావరి వరద ఉద్ధృతిని పరిశీలించారు. గోదావరికి ఆనుకొని మంచినీళ్ల పంప్‌హౌస్ ఉండడంతో నీటిని పరీక్షించిన తర్వాతే మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు పంపాలని సూచించారు. పంట నష్టం వివరాలను సమగ్రంగా సేకరించి ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ అభిలాష తెలిపారు.మరోవైపు ఎగువనుంచి వస్తున్న వరదతో నిర్మల్ జిల్లాలోని సోన్ గ్రామం వరదలో చిక్కుకుపోయింది. మాధాపూర్, సోన్, లక్ష్మణచాందా మండలంలోని పుష్కర ఘాట్లు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్ బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొప్పారం గ్రామానికి వెళ్లే రహదారి నీట మునిగింది. ముంపు ప్రాంతాల్లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పర్యటించి స్థానికులకు భరోసా కల్పించారు. వరదతో తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఏడేళ్ల తర్వాత చైనాకు మోదీ

భారత ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా తన జపాన్ పర్యటన కొనసాగిందని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. ఈ పర్యటన సందర్భంగా భారత్-జపాన్‌ల మధ్య దాదాపు 13 ఒప్పందాలు ఖరారయినట్లు తెలుస్తోంది. భారత్‌లో వచ్చే దశాబ్దకాలంలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేం దుకు జపాన్ సుముఖత వ్యక్తంచేసింది. సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, టెలికాం సహా కీలకమైన ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వంటి వ్యూహాత్మక రంగాల్లో సహకారం పెంచుకునేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి.

## చొరబాట్ల స్పెషలిస్ట్.. 'మానవ జీపీఎస్' బాగూఖాన్ హతం..!

**శ్రీనగర్(జనంసాక్షి):**జమ్మూకశ్మీర్‌లోని నౌషెరా సెక్టార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక ఉగ్రవాది హతమయ్యాడు. 100పైగా ఉగ్రవాద చొరబాట్లకు కారకుడు, హ్యూమన్ జీపీఎస్‌గా పిలవబడే బాగూఖాన్‌ను కాల్చిచంపినట్లు ఆర్మీవర్గాలు వెల్లడించాయి.అతడు మరో ఉగ్రవాదితో కలిసి దేశంలోకి చొరబడేందుకు యత్నిస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. 1995 నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి బాగూఖాన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గురెజ్ సెక్టార్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 100కు పైగా చొరబాట్లకు సూత్రధారిగా వ్యవహరించాడని వెల్లడించాయి. ఎలాంటి కఠిన మార్గాల్లోనైనా ఉగ్రమూకలు భారత్‌లోకి చొరబడేందుకు ఇతడు సహాయం చేసేవాడని, అందులో ఎక్కువభాగం విజయవంతం అయ్యాయని పేర్కొన్నాయి. అతడు హిజ్బుల్ కమాండర్‌గా ఉన్ననప్పటికీ.. ఈ టాలెంట్ వల్ల అన్ని ఉగ్రసంస్థలకు అతడు కీలకంగా మారాడు. కొన్నేళ్లుగా భద్రతా బలగాల కన్నుగప్పుతున్న అతడు.. తాజాగా మాత్రం తప్పించుకోలేకపోయాడు. ఇక గురువారం గురెజ్ సెక్టార్ నుంచి నియంత్రణ రేఖ వెంబడి దేశంలోకి చొరబడుతోన్న ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చింది.

## మహిళల భద్రతలో హైదరాబాద్‌కు 8వ స్థానం

కేంద్రాల్లో మహిళల భద్రతపై చేపట్టిన ఈ సర్వే నివేదిక విడుదలైంది. కోహిమా, విశాఖపట్నం నగరాలు దేశంలో తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్ నగరంలో మహిళలకు సురక్షత, భద్రతల్లో అర్థవంతమైన పురోగతి వాతావరణం నెలకొందని నివేదిక అభిప్రాయపడింది. అన్ని విషయాల్లో 69.9 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో భద్రతాపరమైన చర్యలు మరింత మెరుగుపడ్డాయి. అయినప్పటికీ కొన్ని విషయాల్లో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం నిరంతర అప్రమత్తత అవసరమని నివేదిక పేర్కొంది. 67 శాతం మంది నగరంలో భద్రత ఉందని చెప్పగా, 9 శాతం మంది సరైన భద్రత లేదని వెల్లడించారు.మహిళలకు సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాల్లో 59 శాతం, ప్రభుత్వ, పోలీసు యంత్రాంగంపై 78 శాతం, భద్రతా చర్యలపై 75 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.వేధింపుల్లో ఎక్కువగా సూటిపోటి మాటలు ఉంటున్నట్లు 65 శాతం మంది మహిళలు పేర్కొన్నారు. 23 శాతం మంది భౌతిక వేధింపులు, 5 శాతం మంది లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో వెల్లడైంది.

# సమర్థతకు పట్టంకట్టండి



ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యక్తిగత సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీ శ్రేణులతో సంబంధం లేకుండా తనకు మద్దతు ఇవ్వాలని రాజ్యసభ, లోకసభ సభ్యులందర్ని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తనను అనుమతిస్తే.. భాజపా అగ్రనేతల మద్దతు కోరేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. బిహార్ లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన.. మెజార్టీ ఉన్నంత మాత్రాన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడానికి అధికారం కల్పించినట్లు కాదన్నారు. అధికారంలో ఉంటే ఏ రాజకీయ శక్తికి కూడా ఏకపక్షంగా వ్యవహరించే అధికారం లేదన్నారు. ఈ సవరణలు పారదర్శకంగా, న్యాయంగా జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

**అందరికీ లేఖ రాశా.. : జస్టిస్ బీఎస్ రెడ్డి**

"సమర్థత ఆధారంగా నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ రాజ్యసభ, లోక్సభ సభ్యులందరికీ లేఖలు రాశా. ఒకవేళ అనుమతిస్తే.. భాజపా అగ్రనేతలను కలిసి వారి మద్దతు కోరేందుకు సిద్ధంగా ఉన్నా" అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రాంచీలో విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం హేమంత్ సోరెన్‌ను కేంద్రం ఇబ్బందులకు గురిచేసిందని, ఆయన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసిందని ఆరోపించారు. రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించినందుకు దీనికి బాధ్యత వహించాలని అన్నారు. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది రాజకీయ పార్టీలు కాదని.. గౌరవ పార్లమెంటు సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీ అని చెప్పారు. దేశంలోనే ఉప రాష్ట్రపతి ఎన్నిక న్యాయమైనదిగా నిలిచిపోవాలని కాంక్షిస్తున్నట్టు చెప్పారు.

## వరదలపై చర్చిద్దామంటే బురదరాజకీయాలా?

మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదల గురించి చర్చిద్దామంటే బురద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు- నిర్వహించాలని బీఏసీలో కోరాం. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకుపైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరాం అని హరీశ్‌రావు తెలిపారు. వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు- గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు- రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటి పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటు-ంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీ-ఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు భయమెందుకు?**

మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టకుండా చూడాలన్నారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది. తప్పులు చేశారో.. లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీశ్‌రావు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వట్లేదంటే.. అధికార పక్షం భయపడుతున్నట్లే అని పేర్కొన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు.

## పిసి ఘోష్ కాదు..పీసీసీ ఘోష్

గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు- పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు- వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతాం. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోంది. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చింది? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వండి అని అన్నారు.

# ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

## ములుగు జిల్లా ఎస్పీ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి..




**ములుగు ప్రతినిధి, ఆగస్టు 30(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాల గురించి తెలుసుకొని, నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశ్యంతో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హోదాలలో పనిచేస్తున్న ఏడుగురు సభ్యులు (ఇందులో నలుగురు మహిళలు) శనివారంములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ సమక్షంలో లొంగిపోయారు. వీరిలో ఒకరు ఏరియా కమిటి సభ్యుడు (ఏసీఎం), ముగ్గురు పార్టీ సభ్యులు, ఒకరి పూజారికాంకర్ ఆర్పీసి అధ్యక్షుడు, ఒకరు పూజారికాంకర్ ఆర్పీసి మిలిషియా సభ్యుడు, ఒకరు చైతన్య నాట్య మండలి సభ్యురాలు (సిఎన్ఎం) గా ఉన్నారు. ఈ సంవత్సరం జనవరి 2025 నుండి నేటి వరకు వీరితో కలిపి, ములుగు జిల్లాలో మొత్తం 80 మంది మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హోదాల్లోని సభ్యులు జనజీవన స్రవంతిలో కలిశారు. వీరిలో డివిజనల్ కమిటి సభ్యులు డివిసిఎం లు ముగ్గురు,ఏరియా కమిటి సభ్యులు(ఏసీఎం లు)11 మంది, పార్టీ సభ్యులు 25 మంది,మిలిషియా సభ్యులు 29 మంది,ఆర్టీసీ ముగ్గురు సభ్యులు, డిఎకేఎంఎస్/కేఎకేఎంఎస్ ఇద్దరు సభ్యులు, సిఎన్ఎం ఏడుగురు, వీరికి తగిన సదుపాయాలు ప్రభుత్వం ద్వారా అందించబడుతున్నాయి.

మావోయిస్టు పార్టీ రోజు రోజుకూ క్షీణిస్తున్న పరిస్థితిని చూస్తూ కింది స్థాయి క్యాడర్లు పై స్థాయి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ, రహస్య ఉద్యమ జీవితాన్ని వదిలి తాము కూడా కుటుంబాల వెంట శాంతియుత జీవితాన్ని గడపాలని భావిస్తున్నారు. ఇదే కారణంగా ఇప్పటి వరకు ములుగు జిల్లాలోనే 80 మంది సాయుధ మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు జనజీవన స్రవంతిలో కలిశారు. అడవుల్లో ఉన్న ఆదివాసీ గ్రామాల ప్రజలు మావోయిస్టు లకు సహకరించడం మానేయడంతో, ఆహారపదార్థాలు కూడా అందక, క్యాడర్ల ఆరోగ్యం క్షీణించిందని తెలుస్తోంది. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి నడవడానికి కూడా శక్తి లేనంతగా శారీరక పరిస్థితి దిగజారినట్టు తెలుస్తుంది. వీరిలో 90% పైగా క్యాడర్లు నిరుపేద ఆదివాసీలు, తమ కుటుంబాల అభివృద్ధి కోసం మావోయిస్టు పార్టీని వీడి ప్రజాస్వామ్య ప్రభుత్వాల మార్గంలో అభివృద్ధికి భాగస్వాములవుతున్నారు.

మావోయిస్టు పార్టీలో ఇంకా ఉన్న సభ్యులకు విజ్ఞప్తి- మీరు కూడా 'పోరు కన్నా ఊరు మిన్న – మన ఊరికి తిరిగి రండి' అనే నినాదాన్ని నమ్మి జనజీవన స్రవంతిలో కలవండి. ఇప్పటివరకు లొంగుబాటు చేసిన 80 మంది సాయుధ సభ్యులకు లక్షల రూపాయల నగదు రివార్డులు,తక్షణ సహాయం మరియు పునరావాస సదుపాయాలు అందించబడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి పట్ల బలమైన నిబద్ధతను కలిగి ఉన్నది.పోలీసు శాఖ కూడా తన వంతు బాధ్యతగా కృషి చేస్తున్నది. ఆదివాసీ ప్రజలకు విజ్ఞప్తి మీరు నమ్మకంతో కానీ,భయంతో కానీ మావోయిస్టులకు సహకరిస్తే,మీ ప్రాంతాలు అభివృద్ధి చెందవు. అభివృద్ధి కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.ప్రజల శాంతియుత జీవనం, అభివృద్ధి – మా పోలీసు శాఖ ధ్యేయం. శనివారం లొంగిపోయిన ఏడుగురు మంది మావోయిస్టు సభ్యులకు తక్షణంగా ప్రతి ఒక్కరికి రూ. 25,000 చొప్పున మొత్తం రూ. 1,75,000/- ఇవ్వబడింది. తదుపరి వారి హోదాల ఆధారంగా మిగిలిన మొత్తం రూ. 7,00,000/- రూ.లను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు అందిన అనంతరం వారి ఖాతాల్లో చెక్కుల రూపంలో జమ చేయబడుతుందనీ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు.

# సిఎం రేవంత్‌తో సిఎస్ భేటీ



**హైదరాబాద్, ఆగస్ట్30 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు శాసనసభ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణా రావు సర్వీసును 7 నెలలు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ని కలిశారు. తన సర్వీసును పొడగించినందుకు ఆయన సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# నీట మునిగిన బాసర సరస్వతి ఆలయ పరిసరాలు



**బాసర (జనంసాక్షి) :** బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం చూపిస్తోంది. గోదావరి నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఇతర ఆలయాలు, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు నీటమునిగాయి. ఇటీవల కురిసిన వర్షాలు, ఎగువన మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో నిర్మల్ జిల్లా అతలాకుతలం అవుతోంది. బాసరలో రెండు రోజులుగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. అంతకంతకూ పెరుగుతున్న వరదతో గోదావరి నుంచి ఆలయం వరకు వెళ్లే ప్రధాన రహదారి జలమయం అయింది. సమీప ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వ్యాస మహర్షి ఆలయం, టీటీడీ అతిథి గృహాల వరకు వరద చేరుకొంది. దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలు అన్ని వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. మొదటి ఘాట్, గంగామాత, సూర్యేశ్వర శివాలయం, గోదావరి నుంచి ఆలయానికి వెళ్లే మార్గంతో పాటు అక్షర కాలనీ, టెంపుల్ కామన్ రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లు నీట మునిగాయి. అక్షర కాలనీలో చిక్కుకున్న వారిని స్థానికులు ట్రాక్టర్ సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అమ్మవారి ఆలయ సమీపంలోని ఆర్యవైశ్య సత్రంలో చిక్కుకున్న గర్భిణిని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, బాసర ఎస్ఐ బయటకు తీసుకువచ్చారు. నాగభూషన్ విద్యాలయం చుట్టూ నీరు చేరడంతో వెనుకాల గేటు ద్వారా పైఅంతస్తులోని విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు పంపించారు. ఎస్‌బీఐలోని సిబ్బందిని సైతం బోట్లతో బయటకు తీసుకువచ్చారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి వరద నీరు బాసరలోని ఈవో కార్యాలయం ప్రధాన ద్వారం వద్దకు రావడంతో అర్చకులు గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బాసర వరద కారణంగా భక్తులు రాకపోవడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం వెలవెలబోతుంది. సుమారు 40 ఏళ్లలో ఈ స్థాయి వరదలు ఎప్పుడూ రాలేదని స్థానికులు చెబుతున్నారు. బాసర మండల కేంద్రంతో పాటు 10 గ్రామాలు నీటమునిగాయి. వేల ఎకరాల్లో పంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గుత్తా అధ్యక్షతన మండలి బీఏసీ సమావేశం

**చర్చించాల్సిన అంశాలపై ఎజెండా ఖరారు**




**హైదరాబాద్, ఆగస్ట్30 (జనంసాక్షి) :** తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన, ఆయన ఛాంబర్ లో బిజినెస్ అడ్వైసరి కమిటీ, సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు , డిప్యూటీ– చైర్మన్ బండ ప్రకాష్ , శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం , తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండలిలో చర్చించాల్సిన ఎజెండాను ఖరారు చేశారు. మండలికి సంబంధించి ప్రత్యేకంగా బిఎసి సమావేశం నిర్ణయం తీసుకోవడం విశేషం.

# వరద నేపథ్యంలో ప్రజల రక్షణకు చర్యలు

- వరదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల నుండి 27 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలింపు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్ట్ 30 (జనంసాక్షి) :** భారీ వర్షాల మూలంగా ఏర్పడుతున్న వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీరంలో, మాతా శిశు ఆసుపత్రి, రామ్ నగర్ ప్రాంతాలలో వరద పరిస్థితిని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంపత్, ఎ.సి.పి. ప్రకాష్, మండల తహసిల్దార్ రఫతుల్లా లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు లోనికి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిందని తెలిపారు. నది తీర ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎగువన ఉన్న ఎస్.ఆర్.ఎస్.పి., కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో, జిల్లాలోని వాగులు, చెరువుల నుండి అదనంగా వరద నీటిని కలుపుకొని 8 లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనికి ఇన్ ఫ్లో అవుతుందని తెలిపారు. వరద నీటి కారణంగా మొదట ప్రభావితమయ్యే మాత శిశు ఆసుపత్రి నుండి గర్భిణీలు, బాలింతలు, పిల్లలను ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల నుండి 27 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. వాగులు, నది ఉధృతంగా ప్రవహిస్తున్న అందడం సమీప ప్రాంతాలకు ఎవరు వెళ్లకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్/పంచాయితీ శాఖల సమన్వయంతో ప్రజా రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం, సమాచారం అందించేందుకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటూ తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నప్రసాద వితరణలో 'ఉప్పల'

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఎంఎస్ కాలనీ హయత్ నగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తామే నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ విఘ్నేశ్వరుడు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందంతో జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల సాయి కిరణ్, ఉప్పల సాయి తేజ ,శ్రీనివాస్ యాదవ్, సతీష్, కిరణ్, శ్రీనాథ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు సత్వర సేవలు అందాలి

- కలెక్టర్ సత్య శారదా దేవి
- వైద్య ఆరోగ్య సేవలపై సమీక్ష



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఈ వర్షాకాలం సీజన్లో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద నిరుపేదలకు వైద్య సేవలు త్వరితగతిన అందించి రోగులు ఇబ్బంది పడకుండా సంబంధిత అధికారులు తక్షణమే వైద్య సేవలు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. శనివారం వరంగల్ జిల్లాలోనీ ప్రభుత్వ ఆసుపత్రులు సీకేఎం , ఎంజీఎం వరంగల్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సంపేట, ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేట, సూపరింటెండెంట్, ఆర్ ఎం ఓ లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం వరంగల్ కలెక్టరేట్ చాంబర్లో డాక్టర్ సత్య శారద కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ అధ్యక్షతలో జరిగినది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలు తెలుసుకొని వాటిలో ఉన్న సమస్యలను అధిగమించడానికి పరిష్కార మార్గాలను తెలిపారు. సికేఎం ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవల్లో అంతరాయాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రేడియాలజిస్ట్, మత్తు డాక్టర్లు ,కొరత ఉండటం వలన సేవలు అందించడానికి అంతరాయం జరుగుతున్నది అందువలన వెంటనే స్పందించి ఎంజిఎం నుండి రేడియాలజిస్టను, మత్తు డాక్టర్లను డిప్యూటీషన్ పైన సీకేఎం లో పనిచేయడానికి ఆదేశాలు జారీ చేశారు. ఎంజీఎం ఆసుపత్రికి రెగ్యులర్ సూపరింటెండెంట్ ఏర్పాటుకు డీఎంఈ హైదరాబాద్ వారి తో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందులో పని చేసే డాక్టర్లు సమయపాలన పాటించాలని, ప్రతి రోజు డాక్టర్ల పేర్లు ,డిపార్ట్మెంట్ ,సెల్ నెంబర్ డిస్ప్లే చేయాలని ఆదేశించినారు. ఎవరైనా సమయపాలన పాటించకుంటే వారి పైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంజీఎం లో ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరం ఉన్నందున ఆ ఇన్ఫారాస్ట్రక్చర్ కొరకు మంత్రులను లేదా డిఎంఈని సంప్రదించి తగిన సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రజలు వారి ఆరోగ్య అవసరాల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చినప్పుడు వారికి తగిన వైద్య సేవలు అందించాలని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది సమన్వయముతో పనిచేసి సమయపాలన పాటించి ఉన్నతమైన సేవలు అందించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగులు కార్యస్థానంలో ఉంటూ సమయపాలన పాటించి సేవలందించాలని, ఎవరైనా నిర్లక్ష్యం చేసినట్లయితే వారి పైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ కిషోర్, డిప్యూటీ డాక్టర్ మురళి , సీకేఎం హాస్పిటల్ ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ ఆర్ ఎం ఓ డాక్టర్ మురళిప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సంపేట సూపర్డెంట్ డాక్టర్ కిషన్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనదాస్, ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేట సూపర్డెంట్ డాక్టర్ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితునికి 20 ఏండ్ల కారాగార శిక్ష



**ములుగు బ్యూరో, ఆగస్ట్30(జనం సాక్షి) :** ములుగు జిల్లా కోర్టులో ఏటూరు నాగారానికి చెందిన పోక్సో కేసులో నిందితునిపై నేరం నిరూపణ అయినందున ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి.సూర్య చంద్రకళ నిందితునికి జీవిత ఖైదు 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 3,000 రూ.లు జరిమానా విధించినట్టు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఒక ప్రకటనలో తెలిపారు. దర్యాప్తు అధికారి జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, ఏపీపీ సిహెచ్.సత్యనారాయణ, సీడీఓ కే.మౌనిక, నిందితుడు ఎండి.గౌస్ పాషా, తండ్రి వలి హైదర్, వయస్సు 32సం.రాలు,వృత్తి కిరాణం షాప్,గ్రామం ఎలిశెట్టిపల్లి ఏటూరు నాగారం మండలం, ములుగు జిల్లా.నిందితునికి విధించబడిన శిక్ష జీవిత ఖైదు 20 సంవత్సరాల కారాగార శిక్ష మరియు 3,000 రూపాయల జరిమానా విధించారు.ఈ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా కృషి చేసిన అప్పటి దర్యాప్తు అధికారి అశోక్ కుమార్ ని,ఇతర పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు కానిస్టేబుల్ లను అభినందించారు.

# వేలాల ముంపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



**జైపూర్ ఆగస్టు 30 (జనంసాక్షి) :** సుందిళ్ల ప్రాజెక్టు ద్వారా స్థానిక రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని ఇక్కడి నుండి నీళ్లు ఇతర ప్రాంతాలకు తరలి పోతున్నాయి. భారీగా వస్తున్న వరద నీటితో వేసుకున్న పంటలు ముంపు గురై ఇక్కడి రైతులకు కన్నీళ్లు తప్ప మరేమీ మిగలలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా సుందిళ్ల ప్రాజెక్టు ద్వారా ముంపు గురైన వేలాల గ్రామ రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కాసుల కోసమే ప్రాజెక్టు కట్టి రైతులను నిండా ముంచింది మరియు రైతులు ఎకరాన 15 వేల నుండి 20వేల వరకు కౌలు పైసలు ముందే కట్టి అప్పుచేసి ఎకరాన 50 వేల నుంచి 60 వేల వరకు ఖర్చు చేసి చేతికచ్చే పంట కళ్ళముందే నీళ్లపాలు కావడం చాలా బాధాకరం మరియు ఇలాంటి నష్టాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చేయాలి చెన్నూరు శాసన సభ్యులు మంత్రి వివేక్ వెంకటస్వామి సెప్టెంబర్ 30 తారీఖున జరిగే అసెంబ్లీ సమావేశాల్లో వేలాల ముప్పు గ్రామాల రైతుల కోసం అసెంబ్లీలో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని, ప్రత్యేకమైన బడ్జెట్ ఏర్పాటు చేసి కరకట్ట కట్టాలని వేలాల గ్రామ ప్రజలుగా డిమాండ్ చేశారు.

# సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- మానుకోట జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**గూడూరు, ఆగస్టు30 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం, దామరవంచ గ్రామంలోనీ గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం వసతి గృహంలోనీ డైనింగ్ హాల్, కిచెన్ షెడ్,మరుగుదొడ్లు,తరగతి గదులు, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు, స్టడీ అవర్ లో ఉన్న పిల్లలతో స్వయంగా మాట్లాడి వారి యొక్క విద్యాసామర్థ్యాలను పరిశీలించారు, ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నూతన డిజిటల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతుల ద్వారా పిల్లల మేధస్సును వెలికితీయడానికి ఉపాధ్యాయులు పక్కాగా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతీ సబ్జెక్టుల వారిగా బోధనలు అందించాలని,షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి,ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను సేకరించి,వారికి అవసరం ఉన్న వైద్య సేవలు అందించాలన్నారు.టైం టేబుల్ ప్రకారం తరగతులు,పరీక్షలు నిర్వహించాలని, డైట్ మెనో పక్కాగా అమలు చేయాలని, స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, పరిసరాలను నిత్యం సానిటేషన్ నిర్వహించాలన్నారు.ప్రస్తుతం వానకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,మానసిక ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. విద్యాతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని, స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని,విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు తమ పర్యటన షెడ్యూల్లో వసతి గృహాలలో తనిఖీలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ఉదయం,సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. నిత్యం వసతి గృహంలో ఏఎన్ఎం అందుబాటులో ఉండాలని సూచించారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం
31 ఆగస్ట్ 2025

# ఫుడ్ పాయిజన్‌తో పరేషాన్

మనం తరచూ చూస్తూ ఉంటాం. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్‌మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై నిత్యం ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ, టాస్క్‌ఫోర్స్ ఎన్నిసార్లు తనిఖీలు నిర్వహించిన వారిలో మార్పు రావడం లేదు.వారు నిబంధనలు ఉల్లంఘిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదు.ఇటీవల కాలంలో రాష్ట్రంలోని పెద్ద పెద్ద నగరాలలో ప్రసిద్ధిగాంచిన హోటల్లో తనిఖీలు చేపట్టాగ వంటగది అపరిశుభ్రత మొదలు,నాణ్యత లేని ఆహార పదార్థాలు, కుళ్లిపోయిన మాంసం, పురుగులు పట్టిన బిర్యానీ వంటివి అందిస్తున్న అనేక మంది వ్యాపారస్తులకు జరిమానాలతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేసిన,హెచ్చరిక నోటీసులు ఇచ్చిన అప్పటి వరకు మాత్రమే బయటపడవేసి,తర్వాత రోజు నుండి ఎప్పటి లాగానే వ్యవహరిస్తున్నారు. ఎంతో నమ్మకంతో వారి హోటళ్లు,రెస్టారెంట్లకు వచ్చినటువంటి ప్రజలు పాడైనటువంటి ఆహారాన్ని తీసుకొని అనారోగ్యం పాలవుతున్నారు.తిన్న ఆహారానికి డబ్బులు కూడా ఎక్కువగానే తీసుకొని,ఆ డబ్బులకు సరిపడా ఆహారాన్ని యాజమాన్యం అందించడం లేదు.బిజీ లైఫ్ లో ఉద్యోగస్తులు మొదలు పెద్దల వరకు నిత్యం వివిధ రకాల హోటల్లకు వెళ్లి, ఏదో ఒక పదార్థాన్ని తింటూనే ఉన్నారు.ఖర్చుకు వెనకాడడం లేదు కానీ బయట తయారు చేసినటువంటి ఫుడ్ ను తీసుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుంద నేటువంటి విషయాన్ని ప్రజలు గ్రహించలేకపోతున్నారు. చిన్నపిల్లలకు సైతం విదేశీ సంస్కృతిని అలవారుస్తూ, ఫాస్ట్ ఫుడ్ ని ఎక్కువగా తినిపించడం జరుగుతుంది.తద్వారా చిన్న వయస్సు గల పిల్లలు పెద్ద వయస్సు గల వారి మాదిరిగా తయారవుతున్నారు. కొత్త కొత్త వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.

మనిషి జీవించటానికి ఆహారం తీసుకోవటం తప్పనిసరి. అయితే ఆరోగ్యంగా జీవించాలంటే మాత్రం తగిన ఆహారం తీసుకోవాలి.మనిషి శరీరానికి ఇంధనం ఆహారం, ఆ ఆహారమే కలుషితమైతే శరీరంలో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే ప్రస్తుతం మారిన జీవనశైలి, పర్యావరణం మరియు ఆహారం సమస్యల వల్ల చాలా మంది ఫుడ్ పాయిజనింగ్ సమస్య బారిన పడుతున్నారు. వీకెండ్ వస్తే సరదాగా ఫ్యామిలీతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లడం,ఇంట్లో భోజనంపై ఆసక్తి తగ్గి హోటల్ భోజనం వైపు మళ్లడం లాంటివి కాలంలో బాగా పెరిగిపోయాయి. కారణం ఏదైనా ఇంట్లో వండిన రుచి,శుచి కలిగిన ఆహారాలను కాదని చాలామంది బయటి ఆహారాలకు అలవాటు పడుతున్నారు.అయితే బయట ఉన్న ఆహారాలు శుభ్రంగా లేకపోవడం,నీరు కలుషితం అవ్వడం,వండే ఆహారాలు సరిగ్గా లేకపోవడం లాంటి కారణాల వల్ల ఫుడ్ పాయిజన్ అవుతుంది.సాధారణంగా ఎక్కువగా నిల్వ ఉన్న,కలుషితమైన మరియు అపరిశుభ్రమైన ఆహారం తీసుకున్నప్పుడు ఆహారం పాయిజన్ సమస్య ఎదురవుతుంది.శుభ్రంగా లేని ఫుడ్‌ని తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్య ఎదురవుతుంది.ఫుడ్ పాయిజనింగ్ వల్ల మొదట దెబ్బతినేది జీర్ణ వ్యవస్థ,ఆ తరువాత కలుషిత తీవ్రతను బట్టి మిగిలిన శరీర వ్యవస్థలు కూడా దెబ్బతింటాయి.మనం తీసుకునే ఆహారం, పానీయాలు శరీరానికి పడనివి అయినప్పుడు,అవి కలుషితమైనవి అయినప్పుడు,అందులో విషపూరిత రసాయనాలు ఉన్నప్పుడు ఫుడ్ పాయిజనింగ్ అయ్యే



అవకాశం ఎక్కువ.ఈ సమస్య చిన్న పిల్లల్లో మరియు గర్భవతులలో, వయస్సు పైబడిన వారిలో, డయాబెటిక్ పేషెంట్లు,క్యాన్సర్ రోగులలో, అలాగే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో,జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారిలో ఎక్కువగా ఉండి తరువాత పెరిగే అవకాశం ఉంటుంది.కలుషిత ఆహారం తినడం వల్ల ఫుడ్ విషంగా మారుతుంది.శక్తినివ్వాల్సిన ఆహారమే ప్రాణాలు తీసేంతలా ప్రభావం చూపిస్తుంది.ఫుడ్ పాయిజన్ అవడానికి ఎన్నో కారణాలున్నాయి.ఇలా జరిగినప్పుడు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

ఫుడ్ పాయిజన్ కాకుండా పరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.ఏ పూట ఆహారం ఆ పూటనే వండుకొని తినేలా ఉండాలి.ఏమైనా మిగిలిన ఆహారం వుంటే వెంటనే బయట పడేయాలి.ఇంట్లో తయారు చేసుకున్నటువంటి ఆహార పదార్థాల కన్నా మేలైనవి బయట ఏవి కూడా దొరకవు.ఎల్లప్పుడూ ఇంట్లో భోజనమే శ్రేయస్కరం.అది మీ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.



**డాక్టర్ మోటె చిరంజీవి,**
**సామాజిక వేత్త, విశ్లేషకులు**
**సెల్ : 9949194327**

## ఏఐ శాస్త్ర,సాంకేతిక ప్రగతికి చిహ్నమా!

# మానవ జీవితానికి ప్రశ్నార్థకమా !?

**కృత్రిమ మేధ (ఏఐ) అనేది ఇటీవలి కాలంలో మానవ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తున్న ఒక శక్తివంతమైన సాధనం. ఇది కొందరికి అద్భుతమైన అవకాశాలను తెరిచినట్లు కనిపిస్తుంది. కానీ మరికొందరికి భయానకమైన విపత్తుగా మారుతోంది. ఒక చిన్న సమూహానికి మాత్రమే ఇది లాభదాయకమైన వరంగా ఉంటూ, మిగిలిన అధిక శాతం మంది సామాన్యుల జీవనోపాదిని అస్తవ్యస్తం చేస్తూ...ఒక విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణగా ఆదరణ పొందగలదా ! అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.**




ఏఐ రాకతో అన్ని పరిశ్రమలు,ఐటీ కంపెనీలు ఏఐ ఆటోమేషన్ కు ఉపయోగిస్తున్నారు.దానితో ఇటీవల కొంత కాలంగా అనేక ప్రముఖ ఐటీ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి.దీనితో మొన్నటి వరకు అధిక వేతనం, విలాస వంతం అయిన సౌకర్యాలు , సామాజిక గౌరవం అనూహ్యంగా పొందిన ఐటీ ఉద్యోగులు ఈ ఏఐ రాకతో ఆందోళనలకు గురి చేస్తుంది .వారి జీవనోపాధినే కూల్చి వేస్తుంది. ఈ ఏఐ ప్రభావంతో ఐటీ రంగంలో ఏర్పడిన మార్పులు తాత్కాలికమా? లేక ఇక ముందు కూడా కొనసాగుతుందా? అనేది ప్రశ్నార్థకం అయింది. ఈ విషయాలను విశ్లేషించి, విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, ఏఐను సమాజం ఎలా స్వీకరించాలో అర్థమవుతుంది.

గత పాతిక ఏండ్లుగా ఐటీ రంగం మెరుగైన జీవనోపాధికి కేంద్రంగా వెలుగొందుతోంది. కానీ ఏఐ రాకతో ఈ రంగంలో చీకటి ముసురుకుంటోందా? 2025లో ఏఐ ఐటీ ఉద్యోగాలపై పడుతున్న ప్రభావం ఆందోళనకరంగా ఉంది. స్టాన్‌ఫర్డ్ అధ్యయనం ప్రకారం, ఏఐకు అత్యంత ఎక్స్‌పోజర్ ఉన్న రంగాల్లో ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలు 6 శాతం తగ్గాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కస్టమర్ సర్వీస్ వంటి ఫీల్డ్‌లలో ఎక్కువగా ఈ విపత్తు కన్పిస్తుంది. ఈ సమస్య కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఉద్యోగ ఉద్వాసనకు కారణమవుతోంది. మరోవైపు, ఏఐ-సంబంధిత ఉద్యోగాలు పెరుగుతున్నాయి. కానీ అవి అధిక నైపుణ్యాలు కలిగినవారికి మాత్రమే పరిమితం గా అందుబాటులో ఉంటున్నాయి. ఇది సమాజంలో అసమానతలను మరింతగా పెంచుతుంది. ఒక చిన్న ఎలైట్ గ్రూప్ ఏఐ ద్వారా భారీ లాభాలు ఆర్జిస్తుండగా, 99 శాతం మంది సామాన్యులు ఉద్యోగాలు కోల్పోయి, ఆర్థిక అస్థిరతలో పడుతున్నారు. ఈ సందర్భంగా ఏఐను శాస్త్ర, సాంకేతిక ప్రగతి గా ఆదరించడం సరైనదేనా ? అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. విమర్శనాత్మకంగా చూస్తే, ఏఐ సమాజానికి ఉపకరించాలి. కానీ, ప్రస్తుతం అది కార్పొరేట్ లాభాలకు మాత్రమే సేవ చేస్తోంది అనేక లక్షల కుటుంబాల ఉనికినే కల్లోలపరుస్తుంది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల బ్రతుకులు ఏఐ చేత బుగ్గి చేయబడుతున్నాయా? లేదా అది వారి మేధను మరింత పదును పెట్టి పోటీలో ముందుకు నడిపిస్తుందా? ఇక్కడే విశ్లేషణ అవసరం. ఒకవైపు, ఏఐ సాధనాలు డెవలపర్లు సమస్యలను పరిష్కరించడంలో 19 శాతం ఎక్కువ సమయం తీసుకుంటున్నారని 2025 అధ్యయనాలు చూపిస్తున్నాయి. ఇది వారి ఉత్పాదకతను తగ్గిస్తుంది. కానీ మరోవైపు చూస్తే ఏఐ డేటా సైంటిస్ట్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంటి ఉద్యోగాల డిమాండ్‌ను పెంచుతోంది, ఇండీడ్ రిపోర్ట్ ప్రకారం. ఐటీ ఉద్యోగులు ఏఐను శత్రువుగా చూడకుండా, దాన్ని సహాయకుడిగా స్వీకరించాలి. నిరంతరం ఈ రంగం లో నేర్చుకుంటూ, ఏఐ టూల్స్‌తో కలిసి పని చేయడం ద్వారా ఐటీ నిపుణులు స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలి.అది ఒక్కటే మార్గం . లేకపోతే, ఉద్యోగ నష్టాలు అనివార్యం. అదే సమయంలో, భరోసా ఏమిటంటే మరి కొంత కాలం అయినా ఏఐ కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది, ముఖ్యంగా ఏఐ-డ్రివెన్ ఇన్నోవేషన్‌లలో. ఇప్పుడు ఏఐను పాత ఆధునికీకరణలతో పోల్చవచ్చా? పాత వస్తువులు, పరికరాలు, సౌకర్యాలు కాల ప్రవాహంలో అవుట్ డేట్ కావటం అత్యంత సహజం.ఈ పరికరాల అప్ డేట్ వర్షన్లు మానవ జీవితాన్ని మరింత గుణాత్మకంగా మెరుగుపరిచాయి. కానీ ఇప్పుడు మానవ జీవితంలో ఏఐ గుణాత్మకంగా భిన్నమా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇప్పటి వరకు చారిత్రక ఇన్నోవేషన్లు ఉత్పాదకతను పెంచాయి. కానీ ఏఐ మానవ మేధను రీప్లేస్ చేస్తుంది. ఇండస్ట్రియల్ రెవల్యూషన్ లాగా ఏఐ కూడా ఉద్యోగాలను సృష్టిస్తుందని కొందరు వాదిస్తున్నారు, కానీ అది మరిన్ని ఉద్యోగాలను సమూలంగా నాశనం చేస్తుందని మరికొందరు భయపడుతున్నారు.

విమర్శనాత్మకంగా పరిశీలించి చూస్తే, పాత టెక్నాలజీలు పరికరాలు అన్నీ మానవ నియంత్రణలో ఉండేవి. కానీ ఏఐ అలా కాదు. స్వయం ప్రేరితంగా నిర్ణయాలు తనకు తానే తీసుకుంటుంది, ఇది నియంత్రణ సమస్యలను సృష్టిస్తుంది. ఏఐను సాధారణ టెక్నాలజీగా చూడటం తప్పు. అది మానవ సమాజాన్ని ఊహాలకు అతీతంగా సమూలంగా మార్చేస్తుంది. ఇప్పుడు ఏఐను అదుపు చేయాలనడం, సాధ్యమా? ఈ భావన సైన్స్ లక్ష్యాలకు, ఉనికికే కే వ్యతిరేకం కాదా? ఈ ఆలొచన మానవ పురోగతికి మంచిదా?అనే చర్చ సర్వత్రా జరుగుతుది. యూరోపియన్ యూనియన్ ఏఐ యాక్ట్ లాగా నియంత్రణలు అవసరం అని అంటున్నాయి.కానీ మరోవైపు అవి ఇన్నోవేషన్‌ను అడ్డుకుంటాయని విమర్శలు వస్తున్నాయి.

కాలిఫోర్నియా ఎస్‌బీ-1047 బిల్ లాగా చట్టాలు ప్రమాదాలను తగ్గిస్తాయి. కానీ అవి సంక్లిష్టంగా ఉండి ఇన్నోవేషన్‌ను నిరోధిస్తాయి. స్థూలంగా ఏఐ నియంత్రణ అవసరం, అది విజ్ఞాన శాస్త్ర ప్రగతికి వ్యతిరేకం కాదు. అది మానవ మనుగడను, హక్కులను కాపాడుతుంది. లేకపోతే, ఏఐ దుర్వినియోగం పెరిగి సమాజం అస్థిరమవుతుంది. నేచురల్ సైన్స్‌కు సోషల్ సైన్స్ కట్టుబడి ఉండాలా? లేదా సోషల్ సైన్స్‌కు నేచురల్ సైన్స్ లోబడి ఉండాలా? అనే వాదనలు, ప్రతి వాదనలు జరుగుతున్నాయి. ఏఐ అభివృద్ధి విషయంలో ఈ రెండు రంగాల మధ్య సమతుల్యత సాధించటం కీలకం. సోషల్ సైన్స్ ఏఐను సమాజ దృక్కోణంలో ఉపయోగించటం అవసరం.

మానవ మేధకు ఏఐ సహకరిస్తుందా? లేక అపకారం చేస్తుందా అనే సందేహాలను తీర్చే బాధ్యత ఏఐ నిపుణులదే.ఎందుకంటే ఆవిషయం పూర్తిగా సాంకేతికం, సంక్లిష్టం అయిన విషయం.అది తన సృష్టికర్తను అధిగమించి అతన్ని తన దారిలోకి తెచ్చుకుంటుందా? మనిషి ఆలోచించకుండా సోమరిగా మారి ఏఐ పై పూర్తిగా ఆధారపడతాడా... అనే దానిపై ఆధారపడి ఉంటుంది. మానవుని చేతిలో ఉన్నప్పుడే అన్ని విషయాలను సమగ్రంగా ఆలోచించాలి. మానవ నిర్లక్ష్యాన్ని ఏఐ పై నెట్టడం సరికాదు.అందుకు బదులుగా, మానవ మేధకు పదును పెట్టి ఏఐను నియంత్రించాలి. ఇది మానవ జాతి పురోగతికి ఏ మేరకు అవసరమో అంత వరకు దాన్ని ఉపయోగించాలి. ఏ విజ్ఞానం, ఉత్పత్తు లైనా మానవ సౌకర్యం, సౌలభ్యం కోసమే ఇంత వరకు వాటి సృష్టి జరిగింది.కాలంతో పాటు మనం కూడా మారాలి. పాత విధానాలు,మూసపోసిన పరికరాలు, స్కిల్స్ ఎల్లకాలం కొనసాగవు. కాలానికి తగిన, కొన్ని సార్లు మించిన విజ్ఞాన ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు. ఇటీవలి ఎక్స్ పోస్ట్‌లలో, ఈ నేపథ్యంలో నే ఐటీ ఉద్యోగులను తొలగించటం అనే నష్టాన్ని చూడాలి. అన్ని చోట్లా ఆటోమేషన్ అవుతున్న క్రమంలో ఆందోళనలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధిలో వృత్తి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మార్పు చెందడం. అనేకులు తరతరాలుగా జీవనోపాధి కల్పించే వృత్తి, ఉద్యోగాలు,మానవ నైపుణ్యం కోల్పోవడం సహజం గతంలో కూడా ఇలాంటివి మన అనుభవంలో చూశాం.ఇప్పుడు ముఖ్యంగా ఐటీలో ఉన్నవారికి ఇతరులకు హెచ్చరిక ఏమిటంటే ఏఐని అంగీకరించండి.అది అనివార్యం. కానీ, దానితో వచ్చే ప్రమాదాలను కూడా అర్థం చేసుకోండి. “విద్యుత్తు” “అణుశక్తి” మొదలైనవి మానవ సృష్టేకదా.వాటితో ఉపయోగాలు ,ప్రమాదాలు సహజంగా ఉంటాయి. వాటివలే ...ఏఐని కూడా సరైన నియంత్రణతో, విచక్షణతో దాన్ని ఉపయోగించుకోవాలి. ఏఐ కూడా మనం సరిగ్గా ఉపయోగించుకుంటే మానవాళికి అనంతంగా, అనేక రంగాల్లో అనేక విధాలుగా మేలు చేస్తుంది. లేకపోతే ప్రళయాంతకం అవుతుంది.అంతా మన విచక్షణ,మానవ మేధస్సు పై ఆధారపడి ఉంటుంది. మానవుని చేతిలో ఉన్నప్పుడే ఏఐ నియంత్రణ పై దృష్టి సారించాలి. ఏఐ ఇతర వస్తువులు,పరికరాలు వంటిది కాదు.అవి అన్ని మానవుని చెప్పుచేతల్లో ఉండేవి. కానీ ఏఐ అలాకాదు. ఏఐ తనకు తాను స్వయంగా కొత్త విషయాలను నేర్చుకొని, తనకుతానే ఆలోచించి నిర్ణయాలు తీసుకునే ప్రజ్ఞా పాఠవాలను కలిగిన ఏఐతో మనం సరితూగగలగాలి.నిరంతరం ఏఐతో అప్రమత్తంగా ఉండక తప్పదు.ఏఐ సృష్టికి ప్రతి సృష్టి చేయగలదు.ప్రళయాంతకం కాగలదు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# ఆదర్శ కమ్యూనిస్టు - ఉదయించే సూర్యుడు

అసాధారణ మేధస్సు, నిరంతర అధ్యయనం, విస్తృత విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి, రచనా కౌశలం, ఆత్మీయత, ఆచరణశీలత, నిబద్ధత, నిమగ్నత, కార్యదీక్ష, అంకితభావం మరియు మానవీయతా సుగుణం మొదలైన లక్షణాలన్నింటిని తనలో మూర్తీభవింపజేసుకున్న అపురూప మార్క్సిస్ట్ మేధావి, ఆదర్శ కమ్యూనిస్ట్ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి. సాధారణ కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదిగి భారత కమ్యూనిస్ట్ ఉద్యమంలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై నవచరిత్రని సృష్టించి మేరు శిఖరంగా ఎదిగారు. మార్క్సిజం వెలుగులో ఎర్రజెండా నీడలో అంతిమ శ్వాస వరకు ఎత్తిన జెండా దించకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఒకే పార్టీలో కొనసాగి ఎందరికో ఆదర్శప్రాయుడుగా నిలిచారు. భారత కమ్యూనిస్ట్ ఉద్యమంలోనే కాకుండా అంతర్జాతీయం గాను కూడా ఆయన అనేక ప్రజా పోరాటాలలో గొంతులేనివారి గొంతుకగా ఉద్యమించారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కోడేరు మండలంలో గల కొండ్రావుపల్లి గ్రామంలో సురవరం వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు 1942 మార్చి 25 నాడు ప్రథమ సంతానంగా జన్మించిన సురవరం సుధాకర్‌రెడ్డి తండ్రి నుండి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్నారు. గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు, పెదనాన్న అయిన సురవరం ప్రతాపరెడ్డి కొనసాగించిన సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను ఆయన అనుసరించారు. స్వగ్రామమైన జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండలం కంచుపాడుపై ఉన్న మమకారంతో ఆయన తన తండ్రి వెంకట్రామిరెడ్డి పేరు మీద విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎందరినో విజ్ఞానవంతులుగాను మరియు ఆదర్శవంతులుగాను తీర్చిదిద్దారు.

సురవరం సుధాకర్‌రెడ్డి చిన్ననాటి నుండి ఆదర్శ భావాలతో నడుచుకునేవారు. విద్యార్థి - యువజన నాయకుడిగా ఆయన అనేక సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించి క్రమంగా భారత కమ్యునిస్టు పార్టీలో చేరి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి రెండుసార్లు నల్గొండ నుండి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారాల కోసం ప్రజాగొంతుకగా నినదించారు.

సురవరం సుధాకర్‌రెడ్డి సాధారణ కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ సి.పి.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడుసార్లు ఎన్నికై సరికొత్త చరిత్రను సృష్టించారు. చంద్రరాజేశ్వర రావు తరువాత సి.పి.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం సుధాకర్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. ఆయన పార్లమెంట్ సభ్యులుగా కొనసాగిననూ మరియు జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిననూ కూడా తనను అతి సామాన్యమైన వ్యక్తిగానే భావించుకున్నారు.

భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సురవరం సుధాకర్‌రెడ్డి తొలిసారిగా కర్నూలు జిల్లా మొలగవల్లి గ్రామంలో మిగులు భూములపై భూపోరాటంలో పాల్గొన్నారు. క్రమంగా ఆయన అనేక జిల్లాలో అనేక భూపోరాటాలలో పాల్గొని పేదలకు అండగా నిలిచారు. విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద విధానాలను సురవరం సుధాకర్‌రెడ్డి తీవ్రంగా ప్రతిఘటించారు. అలాగే మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఆయన లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా తీవ్రంగా నిరసించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్యంతో ఉన్నా కూడా అంతిమ శ్వాస దాకా పార్టీ ఆశయాల కోసం ఆయన పరితపించారు.



ఆదర్శాలు చెప్పడం వేరు. ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి ఆదర్శంగా నిలవడం వేరు. ముఖ్యంగా ‘తాము ఆదర్శ కమ్యూనిస్టులం’ అని గొప్పలు చెప్పుకుంటూనే పెట్టుబడిదారీ లక్షణాలను ప్రదర్శిస్తూ ప్రజలను మభ్యపెడుతున్న వారెందరో ఉన్నారు. కాని వారిలో ఆదర్శ కమ్యూనిస్ట్ లక్షణాలు ఏ ఒక్కటి కూడా లేకపోవడం చాలా స్పష్టంగా తేటతెల్లం అవుతూనే ఉంటుంది. కాని కొందరు కమ్యూనిస్టులు మాత్రమే ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి భావి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారు. ఆ కోవలోనే ‘సురవరం సుధాకర్‌రెడ్డి ఆదర్శ కమ్యూనిస్ట్ గాను నిలిచారు’ అని ఘంటాపథంగా చెప్పవచ్చు.


సురవరం సుధాకర్‌రెడ్డి జీవితంలో ఏ ఒక్క ఫిర్యాదు గాను, ఏ ఒక్క ఆరోపణ గాని వెలుగు చూడలేదు. ఆయన ఏ విధమైన ఒత్తిడులకు లోను కాలేదు. ఆయనలో గర్వం ఏ కోశానా లేదు. ఆయన ఏ వయసు వారితోనైననూ సమప్రాధాన్యంతో వ్యవహరించేవారు. నటనలు, బోడు మాటలకు ఆయన జీవితంలో ఏమాత్రం స్థానం లేదు. సురవరం సుధాకర్‌రెడ్డి రాగద్వేషాలకు అతీతంగా జీవించారు. ఆయన ప్రామాణిక జీవనాన్ని ఎంచుకొని జీవించిన పరిపూర్ణ మానవుడు. మంచి సుగుణాలున్న మంచి మనిషి. శ్రమశక్తిపై అపార నమ్మకాన్ని కలిగి ఉండి ఇతరులకు ఏమాత్రం భారం పడకుండా వ్యవహరించేవారు. నిరాడంబరంగా ఉండడాన్ని ఆయన ఒక పద్ధతిగా పెట్టుకొని జీవించారు. ఆడంబరత్వాన్ని, విలాసవంత జీవితాన్ని ఆయన చైతన్యపూర్వకంగా తృణీకరించారు. సౌమ్యత, మృధుస్వభావం, శాంతి - సామరస్యం, గౌరవం మొదలైన వాటన్నింటిని ఆయన తనలో మూర్తీభవించుకుని అజాతశత్రువుగా వెలుగొందారు.

సురవరం సుధాకర్‌రెడ్డి తన జీవితాన్ని మొత్తం కష్టజీవులకు అంకితం చేసి వారి కష్టాలతో సహవాసం చేశారు. ‘అసమానతలు లేని సమాజం ఆవిష్కరింపబడాలి’ అని ఆయన బలంగా ఆకాంక్షించారు. ఆ ఆశయ సాధన కోసమే ఆయన అనుక్షణం ఆరాటపడేవారు. ఆయన అనేక సవాళ్లను అధిగమించి సాధారణ స్థాయి నుండి ఉన్నత స్థానానికి ఎదిగిననూ కూడా అతి సాధారణ జీవితాన్ని గడిపి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు.

పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్రవేసిన భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఈ నెల 22 నాడు మరణించడం కడు విషాదకరం. ఆయన మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. నేను సురవరం సుధాకర్‌రెడ్డి గారిని నా చిన్ననాటి నుండి అనేక సార్లు ప్రత్యక్షంగా చూసి కమ్యూనిజం పట్ల ఆసక్తి పెంచుకున్నాను. నాకు ఆయన అంటే ప్రత్యేక అభిమానం ఉండేది. నేను ఆయనతో ఆయా రాజకీయ అంశాలపై అనేక సంభాషణలు చేశాను. ‘ఆయనను ఆదర్శ కమ్యూనిస్ట్ గాను భావించి కమ్యూనిస్ట్ గాను తీర్చిదిద్దబడ్డాను’ అని నేను సగర్వంగా చెప్పగలను. నేడు ఆయన మరణించిననూ నిప్పురవ్వలై ఎగిసే ప్రతి ప్రజా పోరాటంలోనూ ఆయన ‘ఉదయించే సూర్యుడు’లా వెలుగుచూస్తూనే ఉంటారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కష్టజీవులకు మరియు భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. ఆయన కోరిక మేరకు పరిశోధనల నిమిత్తం పార్థీవ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి దానం చేయడం తద్వారా ఆయన చావు అనంతరం కూడా ప్రజాసేవకు అంకితం చేయడాన్ని సమున్నతంగా ఎత్తిపడుతుంది. ఇటీవలి కాలంలో కమ్యూనిస్టులు తమ మరణానంతరం పార్థీవ దేహాలను వైద్య పరిశోధనల నిమిత్తం దానం చేస్తూ వైద్యరంగ ఆవిష్కరణలకు దోహదపడుతుండడం శుభపరిణామం.

చివరి క్షణం వరకు తాను నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగిన సురవరం సుధాకర్‌రెడ్డి ఎందరికో ఆదర్శప్రాయుడుగా నిలిచి భారత కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించుకున్నారు. చంద్ర రాజేశ్వరరావు అడుగుజాడలలో పురోగమించిన సురవరం సుధాకర్‌రెడ్డి భావితరాలకు ‘ఆదర్శ కమ్యూనిస్ట్’ గాను వెలుగొందుతూనే ఉంటారు. అంతిమంగా సురవరం సుధాకర్‌రెడ్డి రాజకీయ వారసత్వాన్ని సమున్నతంగా ఎత్తిపడుతూ అదే పోరాట స్ఫూర్తితో ఆయన ఆశయాలను సాధించే దిశగా ‘వర్గ దోపిడీలేని సమసమాజ స్థాపన’ కోసం నిరంతర పోరాటాలు కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు.



**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్: 94933 19690**

## ఊరిబయట బ్రతుకులు


ఎటు చూసినా ఆకలి కేకలే,
బతుకు బండిలో బాధల బరువులే
ఊరు బయట, కలలు కన్నీళ్లై,
జీవన గీతం రోధనల రాగమై.
ఎవరు వినరు ఈ గుండె గోడును,
కష్టం తప్పిన కన్ను కలలు కనదు
చీకటి రాత్రిలో చుక్కలు లేవయ్యా,
ఊరు బయట బ్రతుకు కఠిన యాత్రయ్యా

**రాము కోలా దెందుకూరు**
**ఖమ్మం, 9849001201**

# నా పుస్తకం నా కథ

మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులలో పఠన శక్తిని పెంచేందుకు “నా పుస్తకం- నా కథ “అనే నినాదంతో పాఠశాల విద్యాశాఖ రీడింగ్ క్యాంపెయిన్ కు ఇటీవల శ్రీకారం చుట్టింది. విద్య అనేది మనిషిని ఆలోచించడానికీ, అభివృద్ధి చెందడానికీ దోహదపడే అస్త్రం. అందులోను పఠనం అనేది విద్యార్థుల ఆంతరంగిక అభివృద్ధికి బలమైన పునాది. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం “నా పుస్తకం - నా కథ” అనే అంశంతో ఒక విశిష్టమైన రీడింగ్ ప్రోగ్రామ్ను ప్రారంభించింది.

ఈ క్యాంపెయిన్ ప్రధానంగా విద్యార్థుల్లో పుస్తకాల పఠనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రూపొందించబడింది. ఆధునిక డిజిటల్ యుగంలో పిల్లలు మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్స్, సోషల్ మీడియా వైపు ఆకర్షితులవుతుండగా, పఠనపు అలవాట్లు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు మళ్లీ పుస్తకాల వైపు మళ్లేందుకు ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక ప్రయత్నంగా నిలుస్తోంది.



**“నా పుస్తకం - నా కథ” అంటే ఏమిటి?**

“నా పుస్తకం - నా కథ” కార్యక్రమం ద్వారా పిల్లలు స్వతంత్రంగా చదవడమే కాక, సృజనాత్మకంగా ఆలోచించటం, తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం నేర్చుకుంటున్నారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన అస్త్రంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమకు ఇష్టమైన ఒక పుస్తకాన్ని ఎంచుకుని చదవాలి. ఆ తరువాత వారు ఆ పుస్తకం గురించి, ఆ పుస్తకం తమ జీవితంపై చూపిన ప్రభావం గురించి, లేదా దాని కథలోని పాత్రలతో తమ అనుభూతులను కలిపి ఒక చిన్న కథ, వ్యాసం లేదా అభిప్రాయాన్ని వ్రాయాలి. దీని ద్వారా వారు పఠనంతోపాటు రచనాసామర్థ్యంనూ పెంపొందించుకుంటారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడేలా పుస్తకాలతో స్నేహం పెంచుకుంటారు. గ్రంథ పాలకులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. పాఠశాలల్లో పఠన మేళాలు, కథా ప్రదర్శనలు, పుస్తక సమీక్షల వర్క్షాప్లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నారు.

**కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం :** ఈ కార్యక్రమం ప్రధానంగా విద్యార్థుల్లో పఠనపట్ల ఆసక్తిని కలిగించడం, పుస్తకాల పట్ల ప్రేమను పెంపొందించడం, వారి సృజనాత్మకతను వెలికితీసే దిశగా రూపొందించబడింది. ఇది విద్యార్థులకు తాము చదివిన పుస్తకాలపై తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచేందుకు అవకాశాన్ని కల్పిస్తుంది. “నా పుస్తకం” ద్వారా వారు చదివిన పుస్తకాన్ని పరిచయం చేస్తారు. “నా కథ” ద్వారా ఆ పుస్తకం తమపై వేసిన ప్రభావాన్ని, తన భావోద్వేగాలను, తన కల్పనలను ఒక కథ రూపంలో ప్రజెంట్ చేస్తారు.

**పాఠశాలలలో కార్యక్రమ నిర్వహణ :** ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో రాష్ట్ర విద్యా శాఖ అమలు పరుస్తోంది. విద్యార్థులందరికీ తమకు నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. వారు చదివిన తర్వాత, ఒక రచన (రిపోర్ట్, వ్యాసం, కథ లేదా అభిప్రాయం) రూపంలో తమ ఆలోచనలను వ్యక్తపరచాలి. కొన్నిచోట్ల పాఠశాలలు పుస్తక ప్రదర్శనలు, కథా పోటీలు, రీడింగ్ మేళాలు, వర్క్షాప్లు కూడా నిర్వహిస్తున్నాయి. గురువులు, గ్రంథ పాలకులు,పాఠశాల గ్రంథాలయాల సిబ్బంది విద్యార్థులకు పఠనానికి మార్గనిర్దేశకులుగా వ్యవహరిస్తున్నారు. పిల్లల ఎంపిక చేసిన పుస్తకాల ఎంపిక, పఠన పద్ధతులు, భావప్రకటనలకు తగిన మార్గదర్శనం అందిస్తున్నారు.

**ప్రయోజనాలు :** పఠనపు అలవాట్ల పెంపు: విద్యార్థుల్లో పుస్తకాల పట్ల ఆసక్తి పెరిగి, ప్రతిరోజూ కొంత సమయం చదవడానికి కేటాయించడానికి ప్రేరణ కలుగుతుంది.

సృజనాత్మకత వికాసం: కథల ద్వారా తమ భావోద్వేగాలను వెలిబుచ్చే అవకాశం లభిస్తుంది. ఇది వారి భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.

**ఆత్మవిశ్వాసం పెంపు:** తాము చదివిన పుస్తకాన్ని ఇతరులముందు వివరించ గలగడం ద్వారా సామూహిక నైపుణ్యాలు పెరుగుతాయి.

**సామాజిక చైతన్యం :** మంచి పుస్తకాలు మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. విద్యార్థులు విలువలతో కూడిన పాఠ్యేతర జ్ఞానాన్ని అలవర్చుకుంటారు.

**విద్యార్థుల స్పందన :** ఈ కార్యక్రమం విద్యార్థులలో మంచి స్పందన పొందుతోంది. చాలా మంది విద్యార్థులు తమకు నచ్చిన కథా పుస్తకాలు, బాల సాహిత్య రచనలు, జీవిత చరిత్రలు, స్ఫూర్తిదాయక వ్యక్తుల పుస్తకాలను చదివి, వాటిపై గొప్పగా రచనలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం వారు చదివే ప్రతి పుస్తకాన్ని ఒక అనుభవంగా మార్చుతోంది.

“నా పుస్తకం - నా కథ” వంటి కార్యక్రమాలు విద్యార్థుల జీవితాలలో ఒక మైలురాయిగా నిలుస్తాయి. ఇది చదువులో నిమగ్నత, భాష పట్ల ప్రేమ, రచనా నైపుణ్యం, మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పుస్తకాలు చదవడం ఒక అలవాటు కాకుండా, ఒక ఆనందదాయక ప్రయాణంగా మారితే - విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగుగా మారుతుంది. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే పాఠశాల తరగతి టైం టేబుల్ లో ఒక పిరియడ్ కేటాయించి ఈ బాధ్యతను గ్రంథపాలకులకు కేటాయిస్తే మంచి ఫలితాలు ఇస్తుంది. ఈ ఉద్యమాన్ని ప్రతి పాఠశాల, ప్రతి గ్రంథ పాలకుడు, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి తల్లి-తండ్రి ప్రోత్సహించాలి. ఎందుకంటే ఒక మంచి పుస్తకం, ఒక మంచి ఆలోచన, ఒక మంచి రచన - ఒక్క విద్యార్థి జీవితాన్ని మారుస్తుంది.



**డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి,**
**కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్,**
వరంగల్, 9849375829

# జిల్లా కోర్టు సముదాయాలకు జిల్లా కేంద్రంలోనే స్థలం కేటాయించాలి

- పౌర స్పందన సదస్సులో అఖిలపక్షం నాయకులు డిమాండ్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 30 (జనం సాక్షి) :** జోగులాంబ జిల్లా కేంద్రంలోని హరిత హోటల్ లో శనివారము అఖిలపక్ష, న్యాయవాదులు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, కార్మిక విద్యార్థి సంఘాలు జరిపిన పౌర స్పందన సదస్సుకు అనూహ్యంగా న్యాయవాదులు అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఏకగ్రీవంగా జిల్లా కోర్టు సముదాయం పి జె పి క్యాంపు లోనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.గతంలో రెవెన్యూ శాఖ నీటిపారుదల శాఖ నుండి 30 ఎకరాలు మాత్రమే స్వాధీనం చేసుకుందని నీటి శాఖకు ఉన్న ఇంకా కొంత మిగిలే ఉందని ఇందులోనే రెవెన్యూ ఇతర శాఖలు ఇష్టం వచ్చినట్టు భవనాలు నిర్మించుకొని న్యాయ శాఖకు కేటాయించడం లేదని అనేక శాఖలో జరుగుతున్న అవినీతిని న్యాయశాఖ భయపెడుతుందన్న ఉద్దేశంతోనే న్యాయ శాఖను ఊరు అవుతల పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతపురం గుట్టల్లో నిర్మించాలని కుట్రలు పన్నుతున్నారని గతంలోనే ఈ కుట్రలను భగ్నం చేసే విధంగా నిరాహార దీక్షలు చేశామని, ప్రభుత్వ హామీతో గద్వాల టౌన్ లోనే నిర్మిస్తామని ఒప్పుకున్నందుకు దీక్షల విరమించామని, కలెక్టర్ గద్వాలలోనే కేటాయిస్తామని ఆరు నెలలు న్యాయవాదులను కాళ్లు అరిగేలా తిప్పి చివరకు అనంతపురం గుట్టల్లో ఇస్తున్నట్టు లెటర్ ఇవ్వడం దారుణమని అనంతపురం గుట్టల్లో ఎటువంటి పరిస్థితుల్లో ఒప్పుకునే సమస్య లేదని గద్వాల పట్టణంలోని బిజెపి క్యాంపు లోనే న్యాయశాఖ కూడా కేటాయించేదాకా న్యాయపోరాటం, ప్రజా పోరాటం చేస్తామని ఇందుకోసం ప్రజల మద్దతు కూడగట్టడానికి అవసరమైతే న్యాయం కోసం పల్లెబాట అనే కార్యక్రమాన్ని కూడా తీసుకుంటామని ప్రభుత్వాన్ని ఒప్పించి కుట్ర దారుల కుట్రాలను భగ్నం చేస్తామని న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఈ ప్రజా పోరాటానికి న్యాయపోరాటానికి గద్వాల పట్టణం, గద్వాల జిల్లా ప్రజలు మద్దతు నివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పేరు మీద జరుగుతున్న ఈ దాడిని ఖండించాలని అభివృద్ధి అనేది కేవలము వ్యాపారం కాదని అది ప్రజలకు సంబంధించిన అంశం అని కోర్టుకు వచ్చిన అమాయకుల జీవితాల మీద కష్టాల మీద వారి శ్రమ మీద వారి ఆవేదన మీద నిర్మించే అభివృద్ధి కాదని కేవలం కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం జరుగుతున్న ఈ అభివృద్ధి అనే నాటకాన్ని ప్రజలు గమనించాలని ఇప్పటికే మెడికల్ కళాశాల ప్రజలకు అందుబాటులో లేకుండా జరిగిందని ఇది కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా చేయాలని పెద్ద ఎత్తున ధన దాహంతో కొంతమంది పెద్దల ప్రోత్బలంతో కలెక్టర్ పదేపదే అదే స్థలాన్ని చూయించి సిద్ధాంతులకు ఉంటాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని చూస్తున్నారని వందల ఎకరాలు ఉన్న గద్వాలలో జిల్లా కోర్టు సముదాయాలకు స్థలము లేదంటే ఎలా నమ్మాలి సాక్షాత్తు కలెక్టరే ప్రజలను మోసం చేస్తే ఎవరు కాపాడాలి కలెక్టర్ ఎవరి ప్రయోజనాల కోసం తన దగ్గర మిగత పి జె పి స్థలాన్ని ఉంచుకున్నారని ప్రతి సెంటు భవిష్యత్తులో ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి రాకముందే జిల్లా కోర్టు సముదాయాన్ని గద్వాల పట్టణంలోన స్థలం కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించి భవిష్యత్తు పోరాటానికి సిద్ధమవుతామని అవసరమైతే ముఖ్యమంత్రి ని కలిసి తమ ప్రతిపాదన నెరవేరే దాకా పోరాటాన్ని విరమించేదే లేదని ఏకగ్రీవంగా తీర్మానించారు. భవిష్యత్తు పోరాటాన్ని త్వరలోనే ప్రకటిస్తామని వారు అన్నారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున స్పందన రావడం అందరూ ఏకగ్రీవంగా ఒకే తాటిపై కొచ్చి భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. నర్సింలు, కార్యదర్శి జయసింహారెడ్డి, అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రకటించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**కొడంగల్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.శనివారం కొడంగల్ మున్సిపల్ పరిధిలో చేపడుతున్న వివిధ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించిన క్రమంలో భవన , టాయిలెట్స్ మరమ్మత్తు పనులతో పాటు కంప్యూటర్ గదికి సంబంధించి ఎర్తింగ్ పనులను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. భవన గదుల్లో లీకేజీలు, విరిగిపోయిన తలుపులు, కిటికీల పనులను కూడా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. తదనంతరం నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనంలో పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్ని పనులు నాణ్యతతో కూడుకొని ఉండాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కలెక్టర్ తో పాటు మండల తహసిల్దార్ దీపక్ శ్యామ్సన్ , మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌లు ఉన్నారు.

## భూ సర్వే సక్రమంగా చేయండి




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** భూ సర్వే ప్రక్రియను సక్రమంగా చేపట్టేందుకు ఖచ్చితమైన అవగాహనకై శిక్షణను పొందాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. శనివారం మద్గుల్ చిట్టంపల్లి లోని డిపిఆర్సి భవనంలో ఆగస్టు 18 నుండీ రెండవ విడత 50 రోజుల పని దినాల్లో లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణనిచ్చే కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ విచ్చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టానికి అనుగుణంగా భూముల సర్వే నిమిత్తం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవికతను పరిశీలించి సర్వే నివేదికను అందజేయాల్సి ఉంటుందని దీనికి కచ్చితమైన శిక్షణను పొందాలని ఆయన తెలిపారు.రెండవ విడతలో వికారాబాద్ జిల్లాలో 107 మంది లైసెన్స్ సర్వేయర్లకు భూ భారతి చట్టంలో సర్వే నంబర్ల వారిగా సర్వేలు నిర్వహించి రైతుల ఇబ్బందిని తొలగించేందుకు గాను లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో కార్యక్రమంలో డిఆర్ఓ మంగీలాల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామిరెడ్డి, డివిజన్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు సిద్ధమవుతున్న ఆశావహులు

- గ్రామాల్లో మొదలైన ఎన్నికల హడావిడి
- సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు
- పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు

**నంగునూర్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో లోకల్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆశావహులకు మరింత ఉత్సాహం పెరిగింది పార్టీల గుర్తుల ప్రమేయం లేకపోయినా మద్దతు ఉంటే బలం పెరగడం, ఎన్నికల ప్రచారంలో క్యాడర్ కూడా కలిసి వస్తుందని ఆశావహులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల్లో పోటీ పడడానికి అన్ని వర్గాలను పలకరిస్తూ ఆశావహులు తిరుగుతున్న తీరుతో నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో సందడి మొదలైంది.సెప్టెంబర్ లో పంచాయతీ నోటిఫికేషన్ వస్తుందని పలువురు నేతలు వెల్లడించడంతో రాజకీయ పార్టీలు అభ్యర్థుల పై దృష్టి సారించాయి బీసీ రిజర్వేషన్ల ఖరారుతోనే ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుందా అనేది చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఇప్పటికే అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీల్లో గ్రామాల ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 2019 గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించింది. ఈసారి కూడా మొదట్లో మూడు విడతలుగా ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

**ఎన్నికల వైపు పార్టీల దృష్టి..**




గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగంగా ఏర్పాట్లు పూర్తిచేస్తుండడంతో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను సన్నద్ధం చేయడానికి దృష్టి సారించాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు సవాల్‌గానే మారనున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రైతు భరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహాలక్ష్మీ పథకాలపై ఆశలు పెట్టుకున్నారు. గ్రామాల్లో రైతులు, మహిళలు, కాంగ్రెస్ మద్దతు ఇచ్చే అభ్యర్థులు ఓట్లు వేస్తారని భావిస్తున్నారు. 90 శాతానికి పైగా స్థానాలు గెలుచుకోవాలనే దానిపై దృష్టి సారించారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సత్తా చాటాలని భావిస్తున్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందినవారే స్థానిక సంస్థల్లో గెలుపొందారు. తిరిగి మళ్లీ స్థానాలను కైవసం చేసుకోవాలని గ్రామస్థాయి నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నారు.నంగునూరు మండలంలో ఫలితాలు ఎలా రాబోతాయనే ఆసక్తి గ్రామీణ ఓటర్లలో నెలకొంది.

## జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగల అరెస్ట్..

- 22 బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు..



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** వరుసగా బైకు దొంగతనాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ముఠాను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన శనివారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట సీఐ నరసింహ, డి ఐ నరేందర్ రెడ్డి లు శనివారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన జగద్గిరిగుట్టలోని ఓ వైన్ షాప్ వద్ద పార్కు చేసి ఉండగా తన 250 డ్యూక్ బైక్ దొంగతనానికి గురైందని గఫూర్ రాజా అనే వ్యక్తి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మెరుగు కేసు నమోదు చేసుకున్న పోలీసులు జగద్గిరిగుట్ట క్రైమ్ టీం దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీధర్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా నెంబర్ ప్లేట్ లేని వాహనం కెటిఎమ్ బైక్ పై ప్రయాణిస్తుండగా అనుమానంతో అతని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తనతోపాటు తన సహచరులు కౌశిక్ గౌడ్, కట్టా మణికంఠ, గుత్తుల శ్రీనివాస్ లతో కలిసి పలు దొంగతనాలకు పాల్పడినట్లు (బైకు చోరీలు) అంగీకరించాడు. దొంగిలించిన వాహనాలను షేక్ నాగూర్ వలి అనే వ్యక్తికి తెలిపారు. నిందితుడి సమాచారంతో మిగతా నిందితులను పట్టుకొని అరెస్ట్ చేశారు. వద్దనుండి 22 బైకులను స్వాధీన పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు అధికారులను బాలనగర్ ఏసిపి నరేష్ రెడ్డి ప్రశంసించారు.

## స్థానిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

- రాజకీయ పార్టీలకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపు



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** రాబోతున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వత తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయితీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగిందని, వీటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31 వరకు సరిచేసుకోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ బూత్ ల జాబితా, పోలింగ్ కేంద్రాల విషయం ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లు అయితే తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 31 న ఆయా మండలాల్లో ఎంపీడీఓలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో కూడా అభ్యంతరాలు తెలుపవచ్చని అన్నారు. దీని ఆధారంగా ఈ నెల 31న ఆయా అభ్యంతరాలను జిల్లాలోని జిల్లా పంచాయితీ అధికారులు పరిష్కరిస్తారని అన్నారు. ఈ నెల 2న గ్రామ పంచాయితీలలో వార్డుల వారిగా ఫోటోలతో కూడిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డీపీఓ యాదయ్య వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పనిచేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** అంకిత భావంతో, మానవత్వ కోనంలో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.శనివారం ప్రభుత్వ కళాశాలు, పాఠశాల భవనాల మరమ్మత్తు పనుల పురోగతిపై కళాశాల ప్రిన్సిపాల్ లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెప్టెంబర్ 30 తేదీ లోపు మరమత్తు పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు అనే ఉద్దేశంతో భవనాల మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేసినప్పటికీ, పనులు వేగవంతం కాకపోవడం గల కారణాలను కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు కళాశాలల్లో మరమ్మత్తు పనులతో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో పూర్తిగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల మరమ్మత్తులకు అంచనాలతో నివేదిక రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అధికారులు పాఠశాల తనిఖీలకు వెళ్ళినప్పుడు భవనాల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించి తదనుగుణంగా పనులకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**బొంరాస్‌పేట, ఆగస్టు 30 (జనం సాక్షి) :** పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని లింగన్ పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి అన్నారు.మండల విద్యాధికారి హరిలాల్ ఆదేశాల మేరకు శనివారము విద్యార్థులతో కలిసి పొగాకు,బీడీ,గుట్కా, సిగరెట్ వంటి అనర్ధాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించేలా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొగాకు,బీడీ,గుట్కా,తంబాకు, సిగరెట్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమూల్య,నరేష్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాగుకు వంతెన నిర్మించండి

- ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం..



**షాబాద్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ప్రభుత్వాలు ఎన్నో మారుతున్నాయి గానీ మా గ్రామ వాగు వంతెన జరగడంలేదని గ్రామస్తులు వాపోయారు. శనివారం చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి చేవెళ్ల అసెంబ్లీ ఇన్చార్జి కేఎస్ రత్నం, షాబాద్ మండల బిజెపి అధ్యక్షులు మద్దూరి మానయ్య తో కలిసి వంతెన నిర్మాణం కోసం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... మండల పరిధిలోని బొబ్బిలిగామ, కొమరబండ వాగుకు వంతెన లేక వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి, రైతులు సరైన సమయంలో పంటను తరలించలేకపోతున్నారు అని వాపోయారు. వంతెన నిర్మాణంతో ఐదు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని అన్నారు. ఇట్టి విషయంపై సానుకూలంగా స్పందించి తగు చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల ఎన్నికల ఇన్చార్జి ప్రభాకర్, షాబాద్ మండల బిజెపి సెక్రటరీ హరీష్, శక్తి కేంద్రం ఇంచార్జి గంధం రమేష్, కొమరబండ బూత్ అధ్యక్షులు మల్కాపురం భవదీష్, అనిల్ రెడ్డి, సుధాకర్, శేఖర్, తరుణ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సవాళ్లను ఎదుర్కొని సమర్థవంతంగా పనిచేశారు

- నిబద్ధత నిజాయితీగా పనిచేసి పోలీసులకు ఆదర్శంగా నిలిచారు
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ డీటీసీ ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘకాలం పాటు జిల్లాకు సేవలు అందిస్తూ పదవీ విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ మురళీధర్ కోర్ట్ లైసానింగ్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తూ ఈ రోజు పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐ బి. వీరన్నకి ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై వారిని సన్మానించారు.అదనపు ఎస్పీ మురళీధర్ ఎస్ఐ ర్యాంక్ నుండి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించడం జరిగింది. ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ అదనపు ఎస్పీగా పదోన్నతి పొందడం జరిగింది. 38 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సేవలు అందించడం జరిగింది..వీరన్న పోలీస్ శాఖలో తన ప్రస్థానాన్ని ఒక కానిస్టేబుల్‌గా ప్రారంభించారు. అంచెలంచెలుగా హెడ్ కానిస్టేబుల్‌గా, ఏ.ఎస్.ఐ.గా, ఆపై ఎస్ఐగా పదోన్నతులు పొంది, మొత్తం 41 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు అంకితభావంతో సేవలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న మురళీధర్ వీరన్న పోలీస్ శాఖకు చేసిన సేవలను కొనియాడారు. వారి అంకితభావం, నిబద్ధత నిజాయితీ యువ పోలీస్ అధికారులకు స్ఫూర్తి అని అన్నారు. పోలీసులంటేే ప్రజలకు భరోసా కల్పించే విధంగా వారిద్దరూ తమ విధులు నిర్వహించారని తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారి జీవితం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.పదవీ విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ఈ వీడ్కోలు సభను ఏర్పాటు చేసినందుకు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డికి ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తన 38 ఏళ్ల పోలీస్ ప్రస్థానంలో ఎంతో మంది సహచరుల సహకారం లభించిందని, ఈ ప్రయాణంలో ఎదురైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇది ఎంతగానో సహాయపడిందని చెప్పారు. పోలీస్ శాఖలో పనిచేయడం ఒక గౌరవం అని, ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తన సర్వీసులో తాను చేసిన మంచి పనులను, తన సహచరులు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ పదవీ విరమణ పొందుతున్నా అదనపు ఎస్పీ మురళీధర్ ఎస్ఐ బి. వీరన్న లకు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డిఎస్పి బాల కృష్ణ రెడ్డి ,వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి పరిగి డిఎస్పి శ్రీనివాస్ ,ఏఓ జోతిర్మని జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ ఇతర పోలీస్ అధికారులు, డి.పి.ఓ. సిబ్బంది పదవీ విరమణ పొందుతున్నా వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | ఆదివారం 31 ఆగస్టు 2025

# సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**● జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :** సహకార బ్యాంకు సేవలను, ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి సూచించారు.వనపర్తి జిల్లా కేంద్రంలో పునర్నిర్మించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ మహబూబ్‌నగర్ వనపర్తి బ్రాంచ్‌ను శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో ఏర్పాటుచేసిన శిలా పలకాన్ని ఆవిష్కరించి నూతన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి బ్యాంకులో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా



వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్ నగర్ వనపర్తి బ్రాంచ్ లో ఆధునిక కాలానికి అనుగుణంగా కంప్యూటర్ సెక్షన్లు, ఏటీఎం మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యవసాయ పంట రుణాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక, రుణాలు తీసుకొని తద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. వనపర్తి నియోజకవర్గ రైతులు ప్రజలు నూతన బ్యాంకులో ఖాతాను తీసుకొని సద్వినియోగం చేసుకోగలరని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సీఈఓ డి. పురుషోత్తం రావు, వనపర్తి డిసిసిబి బ్యాంక్ మేనేజర్ సత్య ప్రకాష్ రెడ్డి, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ చైర్మన్ ప్రమోదీని, డిసిఓబి రాణి, సింగిల్ విండో చైర్మన్లు వనపర్తి వెంకట్రావు, నాగవరం మధు సూధన్ రెడ్డి, రాజనగరం రఘు వర్ధన్ రెడ్డి, పెబ్బేర్ కోదండరామిరెడ్డి, ఘనపూర్ మురళీధర్ రెడ్డి, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మానవ హక్కులపై అవగాహన ర్యాలీ

**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలో హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ ఫోరం (మానవ హక్కులు, అవినీతి నిరోధక సంస్థ) ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ గాంధీ నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ ఫోరం జాతీయ అధ్యక్షులు డాక్టర్



మోహన్ రావు నల్వాడే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు గృహహింస మాదకద్రవ్యాలపై ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించడంతోపాటు రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన మానవ హక్కుల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా మానవ హక్కులపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తంగిడి నాగరాజు, ఉపాధ్యక్షులు గవినోల్ల జయపాల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీరామ్, సెక్రటరీలు సూర్య ఆంజనేయులు, కేశవరెడ్డి, కట్టా వెంకటేష్, శరణప్ప, సాదిక్, నదియా, అరుణ, స్వప్న, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**● బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్**



**జడ్చర్ల, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం మరోమారు బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ప్రత్యేక జీవో ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు చట్టబద్ధత కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో శనివారం నిర్వహించిన బీసీ జాగృతి సేన ముఖ్య నాయకుల సమావేశంలో కృష్ణ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు అంశంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన పలుమార్లు మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రయోజనం శూన్యమని, 42 శాతం రిజర్వేషన్ల అమలుకై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదని, ఆర్టికల్ 243 డి (6) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని, అందుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు నరసింహులు, కార్మిక విభాగ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శేఖర్, బాలస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బీమ్ రాజు, బీసీ జాగృతి సేన మండల సహాయ కార్యదర్శి చెన్నయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాంబు స్క్వాడ్ పోలీసుల తనిఖీలు

**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ఉట్కూర్ మండల కేంద్రంలో బాంబు డిస్పోజల్ పోలీస్ బృందం, డాగ్ స్కార్డ్ పోలీసులు మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా గణేష్ మండపాల దగ్గర, ప్రార్థన మందిరాల వద్ద, గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే పెద్ద చెరువు వద్ద, ప్రధాన చౌరస్తాలలో, మండలంలోని పులిమామిడి, మగ్ధుంపూర్, బిజ్వార్ గ్రామాలలోని వినాయక విగ్రహ, వంటపాలను తనిఖీలు నిర్వహించడం జరిగింది అని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా లేదా రెండు మూడు రోజులు ఒకే చోట వాహనాల నిలిపి ఉంచిన బ్యాగులు కనపడిన, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించిన అట్టి సమాచారము సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని



ఎస్పీ తెలిపారు. నవరాత్రి ఉత్సవాలుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయులు సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలంతా శాంతియుతంగా పండుగలు జరుపుకోనీ ఎస్పీ కోరారు.

## డీఎస్పీకి జన జాగరణ సమితి వినతి



**న్యాల్‌కల్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలానికి చెందిన "జన జాగరణ సమితి" సభ్యులు శనివారం జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ కు వినతి పత్రం అందజేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వినాయక శరన్నవరాత్రి వేడుకల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్, పోలీస్ ఉన్నతాధికారులు సమన్వయంతో కలిసి వినాయక ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ పాటిల్, న్యాల్ కల్ మండలానికి చెందిన సమితి సభ్యులు బాలకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, మణిధర్ ఉన్నారు.

## భూ నిర్వాసితులకు అండగా బీజేపీ

**● బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ**



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** నారాయణపేట బికొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు బిజెపి అండగా ఉంటుందని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ భరోసా ఇచ్చారు.శనివారం నారాయణపేట మున్సిపల్ పార్క్ వద్ద చేపట్టిన భునిర్వాసితుల దీక్షలను మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు భూమిని నమ్ముకుని జీవిస్తున్నారని అలాంటి భూమిని నిస్వార్థంగా జిల్లా రైతులకు జీవనం కల్పించేందుకు సిద్దంగా ఉన్నా ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించి భూములు లాక్కోవాలని చూడడం దారుణమని అన్నారు.ఎకరాకు కేవలం14 లక్షలు ఇవ్వడం అన్యాయం అన్నారు.ఉమ్మడి జిల్లాలోని లగచర్లలో ఎకరాకు 23 లక్షలు ఇచ్చి ఇక్కడ శాశ్వత సాగునీటి కోసం సేకరిస్తున్న భూములకు మాత్రం కేవలం 14 లక్షలు ఇవ్వడం సరికాదని అన్నారు.ఎకరాకు 25 లక్షలు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు చేసే పోరాటానికి బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకు లు,రైతులు పాల్గొన్నారు.

## గణేష్ రూట్ మార్గాన్ని పరిశీలించిన ఎస్పీ



**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ఉట్కూర్ మండల కేంద్రంలోని భవాని టెంపుల్ లోని భవాని మాతను, వినాయక భగవాన్‌నీ దర్శించుకుని ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి గణేష్ రూట్ మార్గాన్ని శనివారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ పరిశీలించారు. మొదటగా వివేకానంద చౌరస్తా నుండి పంచ మసీద్, మాగ్ధుం పూర్ చౌరస్తా, భవాని మందిర్, బస్టాండ్, దేవినగర్, కార్గిల్ చౌరస్తా మీదుగా ఉట్కూరు చెరువును పరిశీలించారు. గణేష్ మార్గ్ రోడ్డు పై ఉన్న కరెంటు, కేబుల్ వైర్లను తొలగించాలని, రోడ్డుకు ఇరువైపు ఉన్న చెట్లను, ముళ్ళ కంచెను తొలగించాలని, రోడ్డు మార్గంలో గుంతలు ఉన్నచోట ప్యాచ్ వర్క్ చేయించాలని అధికారులకు సూచించారు. అలాగే ఉట్కూరు చెరువు వద్ద లైటింగ్, చెరువులోకి ప్రజలు వెళ్లకుండా బ్యారికేట్స్ వేయించాలని చెరువు పరిసరాలను క్లీన్ చేయించాలని తెలిపారు. ఉత్సవ కమిటీ వాళ్లు మండల కేంద్రంలో వినాయక విగ్రహాలు పెద్దగా ఉన్నందున క్రేన్ ఏర్పాటు చేయాలని ఎస్పీ నీ కోరారు. ఎస్పీ కలెక్టర్ మేడమ్ తో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉట్కూరు మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనం నాలుగో తేదీన ఉన్నందున గణేష్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలంతా సంతోషంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్పీ తెలిపారు. శోభాయాత్ర సమయంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్ ముందు ఉండి యువతకు దిశ నిర్దేశం చేయాలని, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని డీజే లకు అనుమతి లేదని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఎస్పీ తో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, ఉట్కూరు ఎస్సై రమేష్, మండల అదికారులు, ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్, అరవింద్ భరత్, సూర్య ప్రకాష్ రెడ్డి, విగ్నేశ్వర రెడ్డి, అనిల్ మహేశ్వర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం వివక్ష వల్లే రాష్టంలో ఎరువుల కొరత

**● సిపిఐ డివిజన్ నాయకుడు వలబోజు నర్సింహాచారి**



**చేర్యాల/ధూల్మిట్ట, ఆగస్టు 30 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ తెలంగాణపై చూపిస్తున్న వివక్ష వల్లనే రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడ్డదని చేర్యాల డివిజన్ సిపిఐ నాయకుడు వలబోజు నర్సింహాచారి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. బీజేపేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. బీజేపి ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు దేశసంపదను పంచుతూ ఇతర రాష్ట్రాలను చిన్నచూపు చూస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలకు గెలిపించి పార్లమెంటుకు పంపితే వారు రాష్ట్రానికి ఎరువులను కూడా సకాలంలో రైతులకు అందించలేని చేతకాని దద్దమ్మల్లా చోద్యం చూస్తున్నరని,ఇద్దరు కేంద్ర మంత్రులుగా బండి సంజయ్, కిషన్ రెడ్డి పొంతన లేని అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేయడం దుర్మాగమన్నారు. వీరి ఊసరవెల్లి వేశాలను తెలంగాన సమాజం గమనిస్తోందని, ఇప్పటికైన రైతులకు సరిపడా ఎరువులను అందించుటకు తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే బీజేపి అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సిపిఐ ఆధ్వర్యంలో దర్నాలు, రాస్తారోకోలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆయనతో పార్టీ నాయకులు యాసరేణి బాలరాజు, చొప్పరి మైసయ్య, నర్మేట కనకయ్య, బందారం రమేష్, పోతిరెడ్డి భూమయ్య, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

## గణేష్ మందిర్‌లో ఎస్పి ప్రత్యేక పూజలు

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని దూల్ పేట గణేష్ మందిరంలో శనివారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్,బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూల్‌పేట యువజన సంఘం నిర్వాహ కులు ఈ సందర్భంగా ఎస్పీని శాలువా తో సత్కరించింది తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆధ్వర్యంలో నిర్వ హించిన అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ ప్రజలంతా వినాయక చవితి ఉత్సవాలను సంతో షంగా జరుపుకో వాలని అందరూ సుఖశాంతో షలతో సంతోషంగా ఉండాలని ప్రజలకు, పోలీసులకు అంతా మంచి జరగాలని ఆ దేవుని పార్థించడం జరిగిందని తెలిపారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నారాయణపేట జిల్లా ప్రతి వినాయకునికి జియో ట్యాగ్ చేయడం జరుగుతుందని ఏక్కడ ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసులు తెలుసుకొని సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.



వినా యక మండపాల దగ్గర వాలం టీర్లు తప్పకుండా ఉండాలని పోలీసు వారు తనిఖీకి వచ్చిన సమయంలో వారికి సహక రించాలని కోరారు. ఉత్సవాలకు జిల్లా పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయ డం జరుగుతుందని, సోషల్ మీడియాపై పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరి గిందని అన్నారు.ఈ కార్యక్ర మంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, విఎచ్‌పి, ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకుంటే ఆందోళన తప్పదు



**కొల్చారం, ఆగస్టు 30 (జనం సాక్షి) :** రంగంపేట సహకార సంఘం గత 15 రోజులుగా ఒక్క లారీ యూరియా కూడా సరఫరా కాలేదని దీంతో సహకార సంఘం పరిధిలోని 10 గ్రామాల ప్రజలు యూరియా కోసం ధర్నా చేసినట్లు డిసిఎంఎస్ ఉపాధ్యక్షులు అరిగే రమేష్ తెలిపారు.

రైతులకు ఆదివారం ఉదయానికి రెండు లారీల యూరియా సరఫరా జరిగేటట్లు చూస్తామని తాను కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారని ఆదివారం ఉదయానికి యూరియా రెండు లారీలు రంగంపేట సహకార సంఘానికి సరఫరా కాకపోతే రైతులతో కలిసి ఆందోళన చేయనున్నట్లు డిసిఎంఎస్ ఉపాధ్యక్షులు అడిగి రమేష్ తెలిపారు. రంగంపేట సహకార సంఘానికి మొదటినుండి యూరియా సరఫరా చేయడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రతి అలాట్మెంట్లో రంగంపేట సహకార సంఘానికి కనీసం ఒక లారీ యూరియా సరఫరా జార్గేట్లు చూడాలని ఈ సందర్భంగా జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించండి

**● చేర్యాల ఎంపీడీవో చిలుముల శ్రీనివాస్**

**చేర్యాల, ఆగస్టు 30 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని చేర్యాల ఎంపీడీవో చిలుముల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టు, ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషను విడుదల చేసినట్లు తెలిపారు. అందులో ఏమైన అభ్యంతరాలు ఉంటే 30న శనివారం సాయంత్రం లోపు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఎంపీడీఓగా వాటిని పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ కోసం జిల్లా పంచాయతీ అధికారికి సమర్పిస్తామన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన వార్డు వారీగా తుది ఫొటోతో కూడిన ఓటర్ జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఒక వార్డులోని ఓటు మరో వార్డులో ఉంటే వాటిని వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితా షెడ్యూల్ పై గ్రామ పంచాయతీలోని



వార్డులు వారీగా తయారు చేసిన జాబితాపై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ముంజె మల్లేశం (కాంగ్రెస్), ఆనంతుల మల్లేశం (బీఆర్ఎస్), బూరుగు సురేష్ (బీజేపీ), అందే అశోక్ (సీపీఐ), కొంగరి వెంకట్ మావో సీపీఐ (ఎం), ఒగ్గు రాజు (టీడీపీ) అఖిలపక్షాల నాయకులు బండకింది అరుణ్ కుమార్, ఈరి భూమయ్య, వడ్లకొండ సంజీవులు, అందే నాని బాబు, రంగు శివ శంకర్, కాశెట్టి పాండు, ఆరుట్ల వినీత్, నంగి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

**● తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జే అనిల్ కుమార్ జూకంటి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :** చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జే అనిల్ కుమార్ జూకంటి అన్నారు.శనివారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జే అనిల్ కుమార్ జూకంటికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో సాదరంగా ఆహ్వానం పలికారు. కలెక్టర్‌తో న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి తో కలిసి నాగవరం శివారులో సర్వే నెంబర్ 200 లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత ఆత్మకూరు - పెబ్బేరు బైపాస్ రోడ్డును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి బైపాస్ రోడ్డు అలైన్ మెంట్ ను కొంత మార్చాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను సూచించారు.వనపర్తి జిల్లా జడ్జి యం.ఆర్. సునీత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు



కళార్చన, రజనీ, అశ్విని, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, రోడ్లు భవనాల ఇంజనీరు దేశ్యా నాయక్ తదితరులు హైకోర్టు న్యాయమూర్తి వెంట ఉన్నారు.

# తండావాసులకు తప్పని తిప్పలు

- ఒకవైపు బురద.. మరోవైపు జంతువుల కాళేబరాలు
- పట్టించుకోని అధికారులు





మరిపెడ ఆగస్టు 30 (జనంసాక్షి) : మరిపెడ మండల కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలోని కొత్త తండా మరియు ఉల్లేపల్లి గ్రామపంచాయతీ శివారు బోడ తండా కు వెళ్లడానికి తండావాసులకు తిప్పలు తప్పడం లేదు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం నుండి మార్కెట్ రోడ్ మీదుగా కొండ సముద్రం కట్టపై వెళ్లే మార్గం లో చినుకు పడితే కనీసం కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా రోడ్డు తయారవుతుంది ఎప్పుడు రద్దీగా వాహనాలు తండాల నుండి రాకపోకలు ఎల్లప్పుడు వస్తూనే ఉన్నా ఆ బురద నుండి విముక్తి మాత్రం కావడం లేదని అదే విధంగా స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలో చిత్త మొత్తం మార్గం కి ఇరువైపులా జంతు కళేబరాలు చికెన్ చేపలు వాటి నుంచి వచ్చే వ్యర్థం మొత్తం డంపు చేస్తున్నడంతో ఇటు బురదతో అటు వ్యర్థాలతో అనేక ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఎవరికి చెప్పిన ఈ రోడ్డును పట్టించుకునే వారే లేరని అధికారులు కూడా పట్టించుకోకుండా ఉన్నారని ఈ రోడ్డు అసలు ఉందా లేదా అనే దానిపై మాకే నమ్మకం లేదని మేము స్థానికంగా మున్సిపాలిటీ పరిధిలోనే ఉంటూ మున్సిపాలిటీ పరిధి ప్రకారమే ఇంటి పనులు కడుతూ ఉన్నా కూడా అభివృద్ధికి నోచుకోకుండా దూరం అవుతున్నామని స్థానికంగా మాకు మున్సిపాలిటీ నుండి పారిశుధ్యం చేసేవారే లేరని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మాకు ఎటువంటి లబ్ధి లేదని విద్యార్థులు రోజు స్కూల్ కి రావడం కూడా కష్టమవుతుందని ఒకవేళ స్కూలుకు వెళ్లాలంటే వర్షం వస్తే 12 కిలోమీటర్లు తిరిగి మళ్లీ మరిపెడ కు రావాల్సి వస్తుంది మూడు కిలోమీటర్లు ఉన్న కిలోమీటర్ రోడ్డు కొండ సముద్రం చెరువు పై కిలోమీటర్ మాత్రం చినుకు పడితే బురద మయంగా పొలాలను తలపించేలా తయారవుతుందని కొన్ని సంవత్సరాలుగా ఇలానే ఇబ్బంది పడుతూ ఉన్నామని రాత్రి అయితే చాలు కారు చీకట్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది కనీసం లైటింగ్ కూడా లేకుండా వెళ్ళవలసి వస్తుంది అని మొత్తం మున్సిపాలిటీ పరిధిలోని ఉంది కానీ మున్సిపాలిటీలో చేయాల్సిన అభివృద్ధి పనులు మాత్రం మాకు లేవని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులు మమ్ములను గుర్తించి మాకు సరైన రోడ్డు సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికైనా ఎమ్మెల్యే, సంబంధిత ప్రభుత్వ అధికారులైనా మాకు మా తండాలకు వెళ్లడానికి రోడ్డు మరమ్మత్తులు చేయించి ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తూ మున్సిపాలిటీ అంటే కేంద్రంలో ఉన్న వ్యాపార సంస్థలే కాదు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ప్రజలను అందులో ఉన్న మమ్ములను మరవకండి మేము ఓటర్లమే మేము మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వారమే మాకు కొంచెం విలువనియ్యండి అన్నారు.

# యూరియా కోసం రైతన్నకు తప్పని తిప్పలు!

- చెన్నారావుపేటలో బారులు తీరిన రైతన్నలు



చెన్నారావుపేట, ఆగస్టు 30 (జనం సాక్షి): యూరియా కోసం రైతన్నకు తిప్పలు తప్పడం లేదు. చెన్నారావుపేట సొసైటీ గోదాం వద్దకు యూరియా బస్తాలతో కూడిన లారీ వస్తుందని తెలియడంతో చుట్టుప్రక్కల గ్రామాల రైతులు శనివారం తెల్లవారుజామున నుండే చెన్నారావుపేటలో బారులు తీరి నిలబడ్డారు. 444 బస్తాల యూరియా రావడంతో ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున సొసైటీ సిబ్బంది పోలీస్ బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. క్యూ లైన్ లో నిలబడ్డ కూడా రైతులకు యూరియా బస్తాలు దొరకకపోవడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. యూరియా బస్తాలను సరిపడా తెప్పించి అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



కడెం, ఆగస్ట్ 30 (జనంసాక్షి) : కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురవడంతో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుండి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం తో గోదావరి నిండుగా ప్రవహించి రైతుల పొలాల్లోకి నీళ్ళు చేరి పంట నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే కడెం మండలంలోని లింగాపూర్, సారంగాపూర్ గ్రామంలో గోదావరి ఉదృతంగా ప్రవహించడంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరి సుమారుగా 200 ఎకరాలకు పై వరకు పంట నష్టం వాటిల్లింది అని గ్రామ రైతులు ఎమ్మార్వో ప్రభాకర్ కు తెలుపగా శనివారం ఎమ్మార్వో ప్రభాకర్, ఆర్ఐ శారద లింగాపూర్ గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతానికి వెళ్లి, నష్టపోయిన పంటలను రైతులతో కలిసి పర్యవేక్షించారు. వరద ఉధృతి తగ్గగానే పంట నష్టాన్ని అంచనావేసి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఎమ్మార్వో తెలిపారు. ఇందులో రైతులు ఆకుల లచ్చన్న, మదాసు నాగేష్, బొంగు గంగన్న, ముస్కు రాజు, గోస్కుల మల్లేష్, కుమ్మరి రంజిత్, మాదాసు రాజేశ్వర్ తదితర నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధులు,దివ్యాంగులకు సమస్యలను
# సత్వరంగా పరిష్కరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 30(జనంసాక్షి): వృద్ధులు, దివ్యాంగులు ప్రత్యేక ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారులు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు.గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, పెండింగ్ దరఖాస్తులు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టరేట్‌లో నిరసన



నిర్మల్ బ్యూరో, ఆగస్టు29,(జనంసాక్షి) : నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు తమ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు, రైల్వే పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య మాట్లాడుతూ, సమాజంలోని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. 24 గంటలూ శ్రమిస్తున్నప్పటికీ, సొంత ఇల్లు లేకపోవడంతో జర్నలిస్టుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, అదే విధంగా నిర్మల్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, అలాగే నిర్మల్ పట్టణంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు

జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సమస్యతో పాటుగా సరైన గుర్తింపు కార్డులు, రైల్వే పాసులు, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు లేక ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బం దులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. అనం తరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పరిపాలనా అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యులు గాండ్ల రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి. రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి సట్ల హనుమాన్లు, జల్దా మనోజ్, చావణ్ ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు డిఎస్ మధు, రాహుల్, జై కుమార్, సవీణ్, చంద్ర మోహన్ గౌడ్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, రమణ, లింగేశ్వర్, నవీన్, నరేష్ గౌడ్, సట్ల శంకర్, జి అశోక్, కే రమేష్, కే రాజు, సంకేత్ వర్ధన్, కైసర్ సాజిద్, జిల్లాలోని పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.



# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 30(జనంసాక్షి): ఖిలా వరంగల్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుటలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి, సుందరీ కరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కుడా వైస్ చైర్పర్సన్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కుడా అధికారులతో కలిసి ఖిలా వరంగల్ లోని తూర్పు, పడమర, పశ్చిమ, ఉత్తర కోటలలో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ గుండు చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. గుండు చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా చేపడుతున్న అడ్వెంచర్స్ స్పోర్ట్స్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్ట్ పనులను పరిశీలించారు. కోట చుట్టూ మోట్ జీవ పునరుద్ధరణ (బయో డైవర్సిటీ) పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, డీఈ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పాఠశాలలో బస్సుల కొరత తీర్చిన
## ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి





భూపాలపల్లి, ఆగస్టు 30 (జనం సాక్షి): సింగరేణి పాఠశాలలో భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి నూతన బస్సులను ప్రారంభించి బస్సుల్లో కొరత తీర్చారు. భూపాలపల్లి పట్టణంలో కృష్ణ కాలనీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో బస్సుల ప్రారంభోత్సవానికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతనంగా పాఠశాలకు నియమింపబడిన 2 బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఈ స్కూలు బస్సులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, విద్యార్థులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా, ఉపయోగకరంగా ఉంటుందని వారి విలువైన సమయమును కోల్పోకుండా త్వరగా పాఠశాలకు వస్తారు. సింగరేణి పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో గత సంవత్సరం మంచి ర్యాంకులను కైవసం చేసుకున్నారని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు అయ్యారని అదేవిధంగా ఈ సంవత్సరం కూడా 10వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయి ర్యాంకులను తీసుకువచ్చి పాఠశాలకు సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు, ఈ కార్యక్రమంలో, ఏరియా పర్సనల్ మేనేజర్, పాఠశాల కరస్పాండెంట్ కావూరి మారుతి, పాఠశాల ప్రిన్సిపల్, ఝాన్సీ రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలం

- రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందించాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- చెన్నారావుపేటలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



చెన్నారావుపేట, ఆగస్టు 30( జనం సాక్షి): రైతుల సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.శనివారం

మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట చెన్నారావుపేట నర్సంపేట ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గత రెండు నెలలుగా రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పంటలకు సరైన సమయంలో అందించవలసిన యూరియా దొరకక పోవడంతో రైతులు క్యూ లైన్ లలో కుటుంబాలతో సహా నిలబడడం చూస్తుంటే చాలా బాధగా ఉందన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అని చెప్పి కాంగ్రెస్ ఘోరమైన మోసం చేసిందన్నారు. 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని రూ. 2 లక్షలకు పైబడి బాకి ఉన్న రైతులు బ్యాంకులలో పుస్తెలు కూదవపెట్టి అప్పులను కట్టారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ వెంటనే చెల్లించాలని సన్న ధాన్యం క్వింటాల్ కు రూ. 500 బోనస్ అని చెప్పి మూడు నెలలు అవుతుందన్నారు. అన్యం అమ్ముకున్న కాంగ్రెస్ నాయకులు కమిషన్ లు తీసుకొని పత్తా లేకుండా పోయారని మూడు నెలలు అయినా ఇప్పటివరకు రూ. 500 బోనస్ ఇవ్వలేదని విమర్శించారు. చెన్నారావుపేట మండలంలో 2 వేల 3 వందల 11 మంది రైతులకు రూ. 5 కోట్ల 96 లక్షల బోనస్ బాకీ ఉందని నర్సంపేట నియోజకవర్గం లో 28 వేల 500 మంది రైతులకు రూ. 29 కోట్ల 50 లక్షల రూపాయలు బోనస్ డబ్బులు బాకీ ఉన్నట్లు తెలిపారు. యురియాకు దిక్కులేదని యూరియా గురించి సమీక్షించే నాధుడే లేడన్నారు. రైతుల పట్ల అవగాహన ఉన్నవాడు ప్రజా ప్రతినిధి కాలేదని ఎద్దేవా చేశారు. గెలిచిన ఎమ్మెల్యే కాని, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే మంత్రులు గాని ముఖ్యమంత్రి గాని ఏ ఒక్కరు కూడా రైతుల పక్షాన ఆలోచించే పరిస్థితుల్లో లేరన్నారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు సకాలంలో రైతన్నలు యూరియా వాడాల్సి ఉంటుందన్నారు. కాని అదను దాటిన తర్వాత యూరియాకు ఉపయోగం లేదని సరైన సమయానికి యూరియా దొరకకపోవడంతో రైతులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పర్వతగిరి మండలంలోని ఓ తండాలో బాలు నాయక్ అనే గిరిజన బిడ్డ యూరియా దొరకక తన మూడెకరాల పత్తి పంటను పీకేసుకునే దుస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, మంత్రులు, సిగ్గుపడాలన్నారు. వెంటనే రైతుల సమస్యలను నెరవేర్చి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఎక్కడైతే యూరియా కొరత ఉందో అక్కడికి వెంటనే సరిపడ యురియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మాజీ జెడ్పిటిసి జున్నుతుల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జక్క అశోక్, సొసైటీ చైర్మన్ లు చింతకింది వంశీ, మురహరి రవి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ గఫార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అమ్మ రాజేష్, కొండవీటి ప్రదీప్ కుమార్, అనుముల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి భూక్య రవీందర్, మాజీ సర్పంచులు కుండె మల్లయ్య, బోడ సమ్మ నాయక్, హంస విజయరామరాజు, పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు చెరుకుపల్లి విజేందర్ రెడ్డి, ధారావత్ శ్రీనివాస్, కడారి సునీత సాయిలు, గుండాల మహేందర్, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్, బోడ బద్దు నాయక్, నమిండ్ల సురేష్, భూక్య శ్రీనివాస్, బోడ రవి, ములుక సాంబయ్య, కుసుమ నరేందర్, గట్ల రాంబాబు, కందకట్ల సాంబయ్య, సాదు నరసింగరావు, గుర్రం రవి, మంతుర్తి అన్వేష్, బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్చార్జి బోడ మురళి నాయక్, బాదావత్ వీరన్న, పరకాల రాజన్న, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద ముంపుకు గురైన కుటుంబానికి
# 25 వేల నష్టపరిహారం చెల్లించాలి

- కరకట్ట నిర్మించాలని డిమాండ్
- మంచిర్యాల బీజేపీ నాయకులు రఘునాథ్



మంచిర్యాల ప్రతినిధి , ఆగస్ట్ 30 (జనంసాక్షి) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరామ్ సాగర్ , ఎల్లంపల్లి డామ్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో వరద నీటితో మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ , రామ్ నగర్ లో వరద నీరు ఇండ్లలోకి చేరడంతో శనివారం నాడు ఆ ప్రాంతాలను బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు సందర్శించి వరద నీటిలో మునిగిన ఇండ్లను పరిశీలించి బాధిత ప్రజలను పరామర్శించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ వరదతో ఇండ్లలోకి నీరు వచ్చి నష్ట పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే 25 వేల రూపాయలు సహాయం, వారికి శాశ్వత ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, ఎనగందుల కృష్ణ మూర్తి, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీష్ రావు, మేడికొండ శ్రీనివాస్, బింగి ప్రవీణ్, సత్యనారాయణ, బియ్యాల సతీష్ రావు, జయ రామ రావు, అవిడపు రాజా బాబు, కంకణాల సతీష్, రాజబాబు, చిరంజీవి, దీపక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం

- బాసర గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



బాసర, ఆగస్టు 30 (జనం సాక్షి) : జిల్లాలో పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో ఇటీవల భారీ వర్షాలు కురిసి,వరదల వల్ల నష్టపోయిన పంటలను కలెక్టర్ పరిశీలించారు. స్థానిక రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన ప్రతి ఎకరాకు సంబంధించిన పంట వివరాలను పకడ్బందీగా నమోదు చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం బాసర గోదావరి నది ప్రవాహాన్ని బ్రిడ్జ్ సమీపంలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎగువ ప్రాంతం నుంచి నీటిని వదిలి నందున గోదావరి నది మునుపెన్నడూ లేని విధంగా ఉధృతంగా ప్రవహిస్తుందని, లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రజలు ఎవరు నీటి ప్రవాహం వైపుకు వెళ్లకుండా ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్థానికంగా ఎస్డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవాహం వైపునకు వెళ్లకుండా నియంత్రించేలా పోలీసు వారు పటిష్ట పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఆయా ప్రాంతాలలో పికెటింగ్ కేంద్రాలు నిరంతరం నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏర్పడిన ఆస్తి, పంట నష్టానికి సంబంధించిన వివరాలు ఆయా శాఖల అధికారులు సేకరిస్తున్నారని, త్వరలోనే ఈ వివరాలన్నింటినీ ప్రభుత్వానికి పంపి, నష్టపరిహారం, దెబ్బతిన్న వసతులకు సంబంధించి మరమ్మత్తులు చేపడతామని తెలిపారు. ఆ తర్వాత ఆలయం సమీపంలో వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి
# ముఖ్యమంత్రి హామీ

ఖానాపూర్ ఆగస్టు 30 (జనం సాక్షి) : శాసనసభ సమావేశాల సందర్భంగా సహచర శాసనసభ్యులతో కలిసి ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. అలాగే ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని బీఈడీ కళాశాలలో అధ్యాపక సిబ్బందిని నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## కుక్కలకు నూరు శాతం వ్యాక్సిన్ వేయించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండ, ఆగస్టు 30 (జనం సాక్షి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే కుక్కల బారిన పడకుండా ఉంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా,దేవరకొండ మున్సిపాలిటిలో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఏర్పాటు చేసిన స్టెరిలైజేషన్, కుక్కల దత్తత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త, చెదారం వేయడం, ప్రత్యేకించి ఆహార పదార్థాలను రోడ్ల పై వేయడం వల్ల వీధి కుక్కలు,కోతులు,పిల్లుల వంటివి పెరిగిపోయేందుకు అవకాశం ఉందని అన్నారు.అందువల్ల రోడ్ల పై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు.ఇటీవల కాలంలో వీధి కుక్కల కాటుకు అనేక మంది గురవుతున్నారని,దీనిని దృష్టిలో ఉంచుకొని కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పెంపుడు కుక్కలు,వీధికుక్కల కు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని దేవరకొండ నుండి ప్రారంభించడం సంతోషమని అన్నారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయించినప్పటికి పెంపుడు కుక్కల యజమానులు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు.కుక్క కరిస్తే తప్పనిసరిగా దగ్గరలోని పి హెచ్ సి లో యాంటీ రేబిస్ ఇంజక్షన్ తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పెంపుడుకుక్కల యజమానులను సన్మానించారు.దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి,మున్సిపల్ కమిషనర్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది

- సమాజసేవ చేసే జర్నలిస్టులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి
- పేటలో జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 (జనం సాక్షి) : జర్నలిస్టు వృత్తి సమాజంలో ఎంతో బాధ్యత యుతమైనదని, ప్రజల సమ స్యలను పరిష్కరింప చేయ డంలో వారి పాత్ర ఎంతో కీల కమని, అలాంటి జర్నలిస్టులు ప్రజలకు సేవ చేయాలంటే ఆరోగ్యం ముఖ్యమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్,ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( ఐజేయూ) ఆధ్వ ర్యంలో నారాయణపేట లైన్స్ క్లబ్, హైదరాబాద్ మలక్ పేట్ యశోద హాస్పిటల్, శ్రీ నేత్రా సనత్ నగర్ వారి సహకా రంతో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్ లో శనివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నలుగు రు వైద్య నిపుణులతో కూడిన 12 మంది మలక్ పేట్ యశో ద ఆస్పత్రి వైద్య బృందం ఇక్కడికి వచ్చి జర్నలిస్టులకు, వారి కుటుంబీకులకు వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఇదో అద్భుత కార్యక్రమమని ఐజేయూ యూని యన్ సభ్యులను ఆమె అభి నందించారు. జర్నలిజం అనేది ఒత్తిడితో కూడుకున్న వృత్తి అని, వార్తా సేకరణలో నిమగ్నమై సమయానికి తిన కుండా జర్నలిస్టులు పని చేస్తారని, ఇలాంటి శిబిరాల సమయంలో వారు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా గుండె కు సంబంధించిన పరీక్ష లు తప్పకచేసుకోవాలన్నారు. జర్నలిస్టులు ప్రజల కోసం సేవ చేయాలంటే ముందు వారికి ఆరోగ్యమే ప్రధానం అన్నారు. శిబిరాన్ని సద్విని యోగం చేసుకొని జర్నలిస్టు లు నికార్సైన వార్తలు ఇవ్వా లని తెలిపారు. పోర్ట్ ఎస్టేట్ లో శాసన సభ, కార్య నిర్వాహక శాఖ, న్యాయ వ్యవస్థ) మీడియా నాలుగ వది అని ఆమె గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జర్నలిజం అనేది చాలా బాధ్యతతో చేసే పని అన్నారు. పోర్ట్ ఎస్టేట్ గా పిలువబడే మీడియా మిగతా మూడు వ్యవస్థలు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అని చూస్తుందన్నారు. జర్నలిస్టు లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపా లని, ఏదైనా రుగ్మత వచ్చిన ప్పుడే హాస్పిటల్ కు వెళ్తారని, కానీ అలా కాకుండా ఆరు నెలలు,లేదా సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్,



ఎస్పీలతోపాటు మిగతా ముఖ్యులను యూని యన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. చివరగా కలె క్టర్, ఎస్పీ కలిసి శిబిరంలో ఏర్పాటుచేసిన ఈసీజీ టుడి ఇకో పరీక్షల కేంద్రాన్ని ప్రారం భించి, శిబిరంలో ఉన్న మిగతా అన్ని వైద్య పరీక్షల కేంద్రా లను వారు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎంఏ రషీద్, టి యు డబ్ల్యు జె ఐజే యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోయిలకొండ నారాయణరెడ్డి, శివశంకర్, యూనియన్ వైద్య విభాగ కన్వీనర్ గద్వాల సంజీవ్ కుమార్, సభ్యులు నక్క శ్రీనివాస్, గణప రఘు, రాజేష్ కుమార్, సులిగం సురేష్ కుమార్ తో పాటు యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలి

- కలెక్టర్ ఎం. హనుమంతరావు

భువనగిరి, ఆగస్టు 30 (జనం సాక్షి) : మహిళలందరికి పని ప్రదేశంలో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని, మహిళలు, పిల్లలు, కార్మికులు ప్రజలందరి ప్రయోజనార్థమే ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయని అంతటి గొప్ప చట్టాలు మనకు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగం చేయరాదని జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు అన్నారు. ఆక్షన్ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో జరిగిన ఇంటర్ఫేస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలందరికి రక్షణ కోసం, అభివృద్ధి, సాధికారత కోసం అనేక చట్టాలు పాలసీలు ఉన్నాయని వీటన్నింటి పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోష్ చట్టం 2013 క్యాంపెన్ లో భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన కార్యక్రమాలు మనజిల్లాలో జరుగుతుండటం ఇందుకోసం ఆక్షన్ఎయిడ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. పోష్ చట్టం నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేస్తున్నమని ఇందులో ఇప్పటికే సుమారు నూటయాభైకి పైగా కమిటీలు పూర్తి అయ్యాయని అన్నారు. ఆశా



వర్కర్లందరు గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్య సేవలు పొందేలా చూడాలన్నారు. జిల్లాలలో ఆపరేషన్లు లేకుండా నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నుండి మొదలు జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు లేకుండా చూడాలని ఇందుకోసం అంతర్గత మరియు స్థానిక కమిటీలు బలోపేతానికి కృషిచేస్తామని అన్నారు.

ఈ అవగాహన కార్యక్రమంలో ఆక్షన్ఎయిడ్ అంతర్గత కమిటీ సభ్యురాలు, వందన మాట్లాడుతూ దేశవ్యాప్త ప్రచారోద్యమంలో భాగంగా ఆక్షన్ఎయిడ్ వంద మిలియన్ మహిళలకు ఈచట్టం పట్ల అవగాహన కల్పిస్తున్నదని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా అసంఘటిత రంగ మహిళా కార్మికుల సంక్షేమం, సాధికారత, అభివృద్ధి మరియు రక్షణను కాంక్షిస్తూ ఆక్షన్ఎయిడ్ పని చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆక్షన్ఎయిడ్ కమ్యూనిటీ ట్రైనర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం అధ్యక్షత వహించగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ యశోద, ఆశా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వీణ, సిడిపిఓ లు శైలజ, జ్యోస్నా, స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ ప్రమీల, డీ ఎల్ ఎస్ ఏ అద్వకేట్స్ రాజశేఖర్ ప్రసంగించగా ఆక్షన్ ఎయిడ్ ప్రతినిధులు రమేష్, భూమిక, మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి యశోద, హర్ష, సఖి సెంటర్ ప్రతినిధులు మరియు వివిధ శాఖల అంతర్గత కమిటీ సభ్యులు పిలుపు జనార్ధన్ సామాజిక సంఘాల నాయకులు ఇటుకల దేవేందర్, రమేష్ కోటి, అందే సాయి పాల్గొన్నారు.

## ప్రతి మనిషికి సమాన హక్కులు కల్పించాలి

- కలెక్టర్ హనుమంతరావు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) : ప్రతి మనిషికి సమాన హక్కులు, స్వేచ్ఛను అనుభవించేందుకు అవకాశం కల్పించే రోజే సివిల్స్ రైట్స్ డే అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం గాయరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.జాతి, వర్ణ, మతం,లింగ భేదాలకతీతంగా అందరూ సమానులే అన్నారు. మానవ విలువలను గుర్తు చేసుకొని వివక్షరహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామంలో అందరూ పిల్లలు విద్య అభ్యసించే విధంగా చూడాలన్నారు. గ్రామంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించినారు, అలాగే గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే వారిని సన్మానించారు.గ్రామ ప్రజలు వారి సమస్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. గ్రామానికి వచ్చే కరెంటు లైన్ ఫీడర్ మార్చాలని,ఎస్సీ లకు ఇచ్చిన సీలింగ్ భూమి ని కొంత మంది వ్యక్తులు కబ్జా చేసుకొని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ కి వినత పత్రాన్ని సమర్పించారు. గ్రామంలో మురుగునీరు వ్యవస్థ సరిగా లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీని తదుపరి మండల స్థాయి అధికారులు గ్రామ ప్రజలతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో బ్రెసుదర్శన్ జిల్లా ఎస్ సి .ఎస్ టి. డి వి ఎమ్ సి సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుసాక ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థిపై దాడి

- మద్యం సేవించి తోటి విద్యార్థిపై దాడికి పాల్పడిన వైనం

బూర్గంపహాడ్ ఆగష్టు 30 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఉప్పుసాక ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థిపై దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జూలూరుపాడు మండలం పాపకొల్లుకు చెందిన విద్యార్థిపై సారపాకకు చెందిన మరో విద్యార్థి మద్యం సేవించి వచ్చి దాడికి పాల్పడ్డాడు. ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్లు విద్యార్థుల పట్ల అశ్రద్ధ చూపడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఈ సంఘటన చోటుచేసుకుందని మరోపక్క విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్రమ నిర్వాహకుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో గణేష్ మండపం ఏర్పాటు చేసుకోగా దానికి సంబంధించిన పూజా సామాగ్రి నిమిత్తం పాఠశాల కంప్యూటర్ ఆపరేటర్ తో పాటు 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను శుక్రవారం సాయంత్రం హెచ్ఎం అనుమతితో బయటకు పంపడంతో కంప్యూటర్ ఆపరేటర్ వారితో కలిసి పాల్వంచ వెళ్లి పూజా సామాగ్రి తీసుకున్నాక ఆ ఇద్దరు టాయిలెట్ కు వెళ్లాలని చెప్పి ఆయన కళ్లుగప్పి మద్యం బాటిల్ కొనుగోలు చేసి పూజా సామాగ్రి కవర్లో పెట్టి తిరిగి హాస్టల్ కు చేరుకున్నారు. అయితే రాత్రి సమయంలో గణేష్ మండపం వద్ద అప్పటికే మద్యం సేవించి ఉన్న విద్యార్థి తోటి విద్యార్థి అక్కడకు చద్దర్(దుప్పటి) కోసం రావడంతో ఏమీ అనకుండానే అతని మెడ, ముఖంపై దాడిచేశాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థి వార్డెన్‌కు




చెప్పడంతో ఆమె హెచ్ఎంకు సమాచారం అందించింది. ఆ విద్యార్థి నేను హాస్టల్ లో ఉండను ఇంటికి వెళతానని చెప్పగా హెచ్ఎం రాత్రి సమయంలో ఎందుకు... ఉదయం పాఠశాలకు వచ్చాక నేను మాట్లాడి పంపుతానని చెప్పడంతో ఆ విద్యార్థి వసతిగృహంలోనే ఉండి తనపై దాడి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. శనివారం ఉదయం దాడికి గురైన విద్యార్థి మేనమామ వసతి గృహం వద్దకు చేరుకోగా అప్పటికే పాఠశాలలో దాడిచేసిన విద్యార్థి తల్లిదండ్రులను పాఠశాలకు హెచ్ఎం పిలిపించినట్లు తెలిసింది. అయితే ఈ దాడి సంఘటన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకుల పనితీరును ప్రశ్నించేలా ఉంది. తమ పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకుంటారని వసతి గృహం, పాఠశాలకు పంపితే బయటకు అనుమతి లేకపోయినా ఎలా వెళుతున్నారని, వారికేమైనా జరిగితే బాధ్యత ఎవరిదని మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఇదే ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన గొడవ కారణంగా టీసీ ఇచ్చి పంపిన సంఘటన సైతం ఈ ఆశ్రమ పాఠశాలలో నిర్వాహకుల పనితీరును ఎత్తిచూపుతోంది.

## మణుగూరు ఏరియాలో ఆగష్టు నెలలో 77 శాతం ఉత్పత్తి



మణుగూరు, ఆగష్టు 30 (జనంసాక్షి) : వర్షాల కారణంగా ఆగష్టు నెలలో అనుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించలేదని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు శనివారం జిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... ఆగష్టు నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7 లక్షల 58 వేల 500 టన్నులకు గాను 5 లక్షల 58 వేల 755 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమైనది. ఆగష్టు నెలలో సాదించిన బొగ్గు ఉత్పత్తి 77 శాతం. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 30 ఆగష్టు, 2025 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 44 లక్షల 18 వేల టన్నుల లక్ష్యానికి గాను 45 లక్షల 32 వేల 786 టన్నులు సాధించింది అనగా 103 శాతం సాధించిందన్నారు. ఆగష్టు నెలలో 5 లక్షల 82 వేల 755 టన్నుల బొగ్గును రవాణా చేయగా 01 ఏప్రిల్, 2025 నుండి 30 ఆగష్టు 2025 వరకు ప్రొగ్రెస్సివ్ గా 45 లక్షల 19 వేల 605 టన్నులు రవాణా చేశారన్నారు. ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 12 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 76 శాతం తో 9 లక్షల 10 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. పదవి విరమణ,మెడికల్ , కొత్తగా జాయిన్ అయిన ఉద్యోగులు ఇతర చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. రాబోయే నాలుగు నెలలు అధికారులు ఎక్కువ పని గంటలు పనిచేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారుఈ కార్యక్రమంలో ఏజెంట్ కొండాపురం వీరభద్ర రావు , ప్రాజెక్టు అధికారి మణుగూరు ఓసీ చంద్రశేఖర్, ఏరియా రక్షణ అధికారి వెంకట రామరావు, ఏజిఎం (ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్, డిజిఎం(సివిల్) శివ ప్రసాద్, డివై. సిఎంఓ జ్యోతిర్మై, పర్యావరణ అధికారి టి. శ్రీనివాస రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కె. స్వప్న , డివై. ఎఫ్ఎం పి.రమేష్ , సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలి



గద్వాల నడిగడ్డ, ఆగష్టు 30 (జనం సాక్షి) : విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం జమ్మిచేడు వద్ద గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి తరగతి గదులు,డార్మటరీ, మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుతున్నారని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యంగా చరణ్ విద్యార్థితో స్నేహపూర్వకంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చరణ్ తన తల్లిదండ్రులు కొన్ని నెలల క్రితం చనిపోయారని,రైల్వే స్టేషన్‌లో ఉన్నప్పుడు అధికారులు రెస్క్యూ చేసే పాఠశాలకు తీసుకువచ్చారని వివరించాడు.కలెక్టర్ చరణ్‌తో మాట్లాడుతూ, "నువ్వు ఇక్కడ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని,నీకు అన్ని విధాలుగా ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం మౌలిక వసతులు కల్పిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు లేని ప్రతి పిల్లలకి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పరిశుభ్రమైన భోజనాన్ని వడ్డించాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను వెంటనే సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టి విద్యార్థులు సీజనల్ రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాఠశాల ఆవరణలో నీరు చేరి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకును ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి శుభ్రపరుస్తూ కలుషితం కాని తాగునీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎస్తార్ రాణి,స్పెషల్ ఆఫీసర్ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలు నాయక్

కొండమల్లేపల్లి, ఆగష్టు 30 (జనంసాక్షి) : కొండమల్లేపల్లి మండల ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న బాలరాజు రెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసిన ఎంపిడిఓ బాలరాజు రెడ్డికు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బందిల ఆధ్వర్యంలో విష్ణు షాపింగ్ మాల్, బ్యాంకట్ హాల్ లో ఆత్మీయ అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం అని అన్నారు. బాలరాజు రెడ్డి ఎంపిడిఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా, టిజీఓ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ గత 39 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం అనేది చాలా గొప్ప విషయం అని ఆమె అన్నారు. కొండమల్లేపల్లి మండలంలో ప్రభుత్వం



ప్రవేశపెట్టిన పథకాలను ఎంపిడిఓ బాలరాజు రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా సాధించారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పాలసీలో వారు చేసిన సేవలు అమోఘం అని అన్నారు. అనంతరం వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ఎంపిడిఓ బాలరాజు రెడ్డి నూతనంగా ఏర్పడిన కొండమల్లేపల్లి మండల అభివృద్ధికి చాలా కృషి చేశారన్నారు. ఉద్యోగులను సమన్వయ పరుస్తూ అన్ని గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వారికి కావాల్సిన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశారన్నారు. గత 39 సంవత్సరాలుగా ఉద్యోగ భారాన్ని మోస్తూ ప్రజలందరి మన్ననలు పొందారన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడు వారికి సంపూర్ణ శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ వారి దంపతులకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపిడిఓ దంపతులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, జడ్పీ సీఈఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ పిడి శేఖర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ విజయేందర్ రెడ్డి, తహసిల్దార్ నరేందర్, డిటి ప్రశాంత్, టిజీఓ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ నేనావత్ రాంబాబు నాయక్, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ కార్యదర్శి సంఘం అధ్యక్షుడు కాశీం, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, మాజీ జడ్పీటీసీ మారుపాకుల సురేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, ఉట్కూరి వేమన్ రెడ్డి, కుంభం శ్రీనివాస్ గౌడ్, పసునూరి యుగేందర్ రెడ్డి, వివిధ శాఖల మండల అధికారులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిలేర్‌లో యూరియా పంపిణీని పరిశీలించిన ఎస్పీ



నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం మధ్యాహ్నం మరి కల్ మండలం తిలేరు గ్రామం లోనీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం వద్దకు చేరుకొని యూరియా పంపిణీ పరిస్థితిని సమక్షిం చారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉదయం నుండి యూరియా కోసం రైతులు వేచి చూస్తూ యూరియా దొరకదనే ఉద్దేశంతో గుంపుగా అందరూ ఒకే సారి రావడం వల్ల రైతు లు క్యూలైన్ లో ఉండి యూరి యా తీసుకోవాలని వారిని కంట్రోల్ చేయడంలో మరికల్ ఎస్సై ఒకరిపై చేతులు లేప డం జరిగిందన్నారు. ప్రస్తుతం పోలీస్ బందోబస్తుతో యూరి యా పంపిణీ సజావుగా జరుగుతుందని, మరికల్ ఎస్సై రాము పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగు తుందని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బందికి యూరియా తీసు కోవడానికి వచ్చే రైతులతో దురుసుగా ప్రవర్తించరాదని, సహనంతో ఉండాలని, యూరియా పంపిణీ కేంద్రాల వద్ద ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

### భారత్‌లో విదేశీ పెట్టుబడుల జోరు

# ఎఫ్‌డిఐ 20% పెరిగింది




**హైదరాబాద్, (జనంసాక్షి) :** భారత ఆర్థిక వ్యవస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) జోరు కొనసాగుతోంది. జూలై-ఆగస్టు 2025 కాలంలో దేశంలో ఎఫ్‌డిఐ 2.5 లక్షల కోట్లకు చేరుకుంది, ఇది గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 20% వృద్ధిని సూచిస్తోంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం భారత్‌లోని ఫార్మాస్యూటికల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), రియల్ ఎస్టేట్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలు విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తుండటమే. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఈ ఎఫ్‌డిఐ ఆకర్షణలో ముందు వరుసలో నిలిచాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మా, ఐటి సెక్టార్లు విదేశీ పెట్టుబడులకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఫార్మా సిటీ, ఐటి హబ్‌లు అంతర్జాతీయ కంపెనీల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సమీపంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఫార్మా పార్క్ ప్రాజెక్టుకు డాలర్లు500 మిలియన్ (సుమారు రూ.4,200 కోట్లు) పెట్టుబడి రానుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడనున్నాయి, అలాగే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఫార్మా, ఐటి సెక్టార్ల ఆధిపత్యం**

భారత్‌లో ఎఫ్‌డిఐ వృద్ధికి ఫార్మా, ఐటిరంగాలు ముఖ్యమైన డ్రైవర్లుగా నిలిచాయి. హైదరాబాద్‌లో ఫార్మా సిటీలో అనేక అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు తమ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. అదే సమయంలో, ఐటి రంగంలో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తూ విదేశీ ఇన్వెస్టర్ల నమ్మకాన్ని పెంచుతున్నాయి. విజయవాడ, విశాఖపట్నంలో ఐటి ఎక్స్‌పోర్ట్ యూనిట్ల సంఖ్య పెరుగుతోంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యాపార-సానుకూల విధానాలు ఎఫ్‌డిఐ వృద్ధికి దోహదం చేస్తున్నాయి. సింగిల్ విండో క్లియరెన్స్, టాక్స్ రిఫార్మ్స్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి సంస్కరణలు విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నాయి. తెలంగాణలో 'టిఎస్ ఐపాస్, ఆంధ్రప్రదేశ్‌లో ఎపిఈడిబి వంటి విధానాలు విదేశీ కంపెనీలకు సులభతరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గ్రీన్ ఎనర్జీ సెక్టార్ కూడా ఎఫ్‌డిఐ ఆకర్షిస్తోంది. సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం జపాన్, జర్మనీ నుంచి పెట్టుబడులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సోలార్ పార్క్‌లు విస్తరణలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలను సాధించడంలో దోహదపడతాయి.

**స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఎఫ్‌డిఐ స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ఉపాధి అవకాశాలతో పాటు, స్థానిక వ్యాపారాలకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లో లాజిస్టిక్స్, రిటైల్ సెక్టార్లు కూడా ఈ పెట్టుబడుల వల్ల బూస్ట్ అవుతున్నాయి. అంతర్జాతీయ కంపెనీలు స్థానిక స్టార్టప్‌లతో భాగస్వామ్యం చేయడం వల్ల ఆవిష్కరణలు, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ కూడా పెరుగుతోంది ఆర్థిక శాఖ వర్గాల సమాచారం ప్రకారం, 2025 చివరి నాటికి ఎఫ్‌డిఐ మరింత పెరిగే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, డిజిటల్ ఎకానమీకి సంబంధించిన పెట్టుబడులు మరింత ఆకర్షిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ ఇన్వెస్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ, కొత్త ప్రాజెక్టులకు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నాయి. ఈ ఎఫ్‌డిఐ వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరిన్ని వివరాల కోసం ఆర్థిక శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

### అమెరికా సుంకాల నేపథ్యంలో

## భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు



**దిల్లీ, ఆగస్టు 30 (జనం సాక్షి) :** అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్ చర్చలు జరుపుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50% సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం చూపవని ఆయన స్పష్టం చేశారు. "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ఎవరైనా ముందుకొస్తే మేం సిద్ధంగా ఉన్నాం. అయితే, వివక్ష చూపితే తలవంచం, బలహీనపడం. అందరం కలిసి ముందుకు సాగుదాం" అని ఆయన ఒక పరిశ్రమ కార్యక్రమంలో పేర్కొన్నారు. ఎగుమతు లు మరియు దేశీయ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇతర దేశాల ఏకపక్ష నిర్ణయాల వల్ల దేశీయ పరిశ్రమలపై పడే ప్రతికూల ప్రభావాన్ని నివారించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆగస్టు 27 నుంచి భారత ఉత్పత్తులపై అమెరికా 50% సుంకాలను అమలు చేయడం ప్రారంభించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు గమనార్హం. రొయ్యలు, రసాయనాలు, తోలు, పాదరక్షల వంటి కార్మిక ఆధారిత రంగాల ఎగుమతులపై ఈ సుంకాల ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని ఎగుమతిదారులు అభిప్రాయపడుతున్నారు.

అంతర్జాతీయ అనిశ్చితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎగుమతిదారులకు పూర్తి సహకారం అందిస్తుందని గోయల్ హామీ ఇచ్చారు. సుంకాల ప్రభావం ఏ రంగాలపై పడవచ్చు, ప్రత్యామ్నాయ విపణులు ఏవి అనే వివరాలను పరిశ్రమ ప్రతినిధులు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. "ప్రత్యామ్నాయ విపణుల్లోని అవకాశాలను వాణిజ్య శాఖ ద్వారా అన్వేషిస్తున్నాం. అలాగే, దేశీయ వినియోగాన్ని పెంచడంపై కూడా దృష్టి సారిస్తున్నాం" అని గోయల్ వెల్లడించారు.

## ముంబై స్టాక్ ఎక్స్చేంజ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముందడుగు

**హైదరాబాద్,(జనం సాక్షి) :** ముంబై స్టాక్ ఎక్స్చేంజ్ (బిఎస్ఈ)లో ఈ రోజు సెన్సెక్స్ 82,500 పాయింట్లకు చేరుకుని 0.5% లాభాన్ని నమోదు చేసింది. అదే విధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో నిఫ్టీ 25,200 పాయింట్ల వద్ద 0.4% పెరుగుదల సాధించింది. ఈ రోజు మార్కెట్‌లో ఐటీ, బ్యాంకింగ్ సెక్టార్లు ఆధిపత్యం చెలాయించాయి, ఇవి సూచీల ఈ లాభాలకు ప్రధాన కారణంగా నిలిచాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీల షేర్లు 2% కంటే ఎక్కువ పెరిగాయి, ఇది ఇన్వెస్టర్లలో ఆశావాదాన్ని పెంచింది. శనివారం మార్కెట్‌లో ఐటీ సెక్టార్ అత్యంత బలమైన ప్రదర్శన కనబరిచింది. టిసిఎస్ షేర్లు 2.3% పెరిగి రూ.4,800 స్థాయికి చేరగా, ఇన్ఫోసిస్ షేర్లు 2.1% లాభంతో రూ.1,950 వద్ద ట్రేడ్ అయ్యాయి. ఈ రెండు కంపెనీలు గ్లోబల్ డిమాండ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టుల ద్వారా బలమైన ఆర్థిక ఫలితాలను చూపడం వల్ల ఇన్వెస్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాయి. బ్యాంకింగ్ సెక్టార్‌లో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 1.5% నుంచి 2% వరకు లాభాలు సాధించాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్ల స్థిరత, ఆర్థిక సంస్కరణలు బ్యాంకింగ్ రంగానికి సానుకూల వాతావరణాన్ని కల్పించాయి.




శనివారం సెన్సెక్స్, నిఫ్టీ లాభాలకు అంతర్జాతీయ, దేశీయ కారణాలు దోహదపడ్డాయి. అంతర్జాతీయంగా డాలర్ బలహీనత, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు భారత మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. దేశీయంగా, ఫార్మా, ఐటీ రంగాల్లో విదేశీ పెట్టుబడుల పెరుగుదల, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల విస్తరణ మార్కెట్‌కు ఊతమిచ్చాయి. హైదరాబాద్, బెంగళూరులో ఐటీ కంపెనీలు కొత్త ప్రాజెక్టులను చేపట్టడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతోంది.

## టాటా మోటార్స్ కొత్త నెక్సాన్ ఈవి లాంచ్

హైదరాబాద్, ఆగస్టు 30: టాటా మోటార్స్ ఈ రోజు హైదరాబాద్‌లో తమ కొత్త ఎలక్ట్రిక్ వాహనం 'నెక్సాన్ ఈవి'ను ఆవిష్కరించింది. ఈ వాహనం ధర రూ.15 లక్షల నుంచి ప్రారంభం, ఒక్కసారి ఛార్జ్‌తో 400 కి.మీ. ప్రయాణ సామర్థ్యం ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 1,000 యూనిట్ల అమ్మకాల లక్ష్యంతో ఈ మోడల్ మార్కెట్‌లోకి వచ్చింది. పర్యావరణ హిత రవాణాకు ఊతమిచ్చే ఈ వాహనం గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. హైదరాబాద్, విజయవాడలో ఛార్జింగ్ స్టేషన్ల విస్తరణతో ఈ ఈవి ఆకర్షణీయంగా నిలిచింది. టాటా మోటార్స్ ఈ-మొబిలిటీని పరిపుష్టం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

## ప్రకృతి వనాలు, మెడికల్ సిటీ

### నీతా అంబానీ కీలక ప్రకటన



**ముంబయి, (జనంసాక్షి) :** రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్పర్సన్ నీతా అంబానీ ముంబయి ప్రజల కోసం అత్యాధునిక మెడికల్ సిటీతో పాటు కోస్టల్ గార్డెన్స్ నిర్మాణ ప్రణాళికను ప్రకటించారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టులను త్వరలో అమలులోకి తీసుకురానున్నట్లు ఆమె వెల్లడించారు. ముంబయిలో స్వచ్ఛమైన వాతావరణం, ప్రకృతి సౌందర్యాన్ని భావితరాలకు అందించేందుకు 130 ఎకరాల విస్తీర్ణంలో కోస్టల్ రోడ్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నామని నీతా అంబానీ తెలిపారు. ఈ ఉద్యానవనంలో చెట్లు, పూలమొక్కలు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతో అందమైన వాతావరణాన్ని సృష్టిస్తామన్నారు. ఈ గార్డెన్స్ ద్వారా ముంబయి ప్రజలు సముద్రతీరంలో సూర్యోదయాల సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చని, పర్యావరణం-అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించేలా ఈ ప్రాజెక్ట్ ముంబయికి తలమానికంగా నిలుస్తుందని ఆమె ఆకాంక్షించారు. అంతేకాకుండా, ముంబయి మధ్యలో 2,000 పడకలతో అత్యాధునిక మెడికల్ సిటీని నిర్మించనున్నట్లు నీతా అంబానీ ప్రకటించారు. ఇది కేవలం ఆసుపత్రి మాత్రమే కాకుండా, ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్స్ సెంటర్లు, అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన సదుపాయాలను కలిగి ఉంటుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన అనుభవజ్ఞులైన వైద్యులు ఇక్కడ సేవలు అందిస్తారని తెలిపారు. ముంబయిని అభివృద్ధి చేయడం, అక్కడి ప్రజలకు అత్యున్నత వైద్య సేవలను అందించడమే ఈ ప్రాజెక్టుల లక్ష్యమని నీతా అంబానీ స్పష్టం చేశారు.

నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్
హైదరాబాద్ ₹ 510 ₹ 61.2
వరంగల్ ₹ 507 ₹60.8

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్
₹1,03,310 (24 క్యారెట్లు)
₹ 94,700 (22 క్యారెట్లు)

చెన్నై
₹ 94,700 (22 క్యారెట్లు)
₹1,03,310 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹1,19,000

## ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ

**హైదరాబాద్, (జనంసాక్షి) :** డయాలసిస్ సేవలు అందించే హైదరాబాద్‌కు చెందిన నెఫ్రోప్లస్ కంపెనీ ఫిలిప్పీన్స్‌లో మరింత విస్తరిస్తోంది. కొత్తగా ఆ దేశంలో 5 డయాలసిస్ క్లినిక్‌లను సొంతం చేసుకున్నట్లు నెఫ్రోప్లస్ ప్రకటించింది. దీంతో ఫిలిప్పీన్స్‌లో ఈ సంస్థకు మొత్తం 39 డయాలసిస్ కేంద్రాలు ఏర్పడతాయి. 2020 నుంచి విదేశీ దేశాల్లో విస్తరణపై దృష్టి సారించిన నెఫ్రోప్లస్ ప్రస్తుతం ప్రతి నెల 22,000కు పైగా డయాలసిస్ చికిత్సలు నిర్వహిస్తోంది. భారతదేశంతో పాటు ఫిలిప్పీన్స్, నేపాల్, ఉజ్బెకిస్తాన్‌లలో ఈ సంస్థకు డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. త్వరలో తొలి పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేస్తున్న నెఫ్రోప్లస్, దీనికి సంబంధించి సెబీ వద్ద దరఖాస్తు దాఖలు చేసింది.




### ఎల్ఐసీ రూ.7,324.34 కోట్ల డివిడెండ్‌ను

## కేంద్ర ప్రభుత్వానికి అందజేత

**ఢిల్లీ,:** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7,324.34 కోట్ల డివిడెండ్ ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. ఈ డివిడెండ్ చెక్కును ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ సీఈఓ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. దొరైస్వామి అందజేశా రు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం. నాగరాజు, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్, ఎల్ఐసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2025 ఆగస్టు 26న జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో ఈ డివిడెండ్‌కు ఎల్ఐసీ ఆమోదం తెలిపింది. 2025 మార్చి 31 నాటికి ఎల్ఐసీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.56.23 లక్షల కోట్లుగా ఉంది. దేశీయ జీవిత బీమా విపణిలో ఎల్ఐసీ అగ్రగామిగా కొనసాగుతోందని సంస్థ తెలిపింది.

### అరాజెన్ లైఫ్ సైన్సెస్‌లో క్వాడ్రియా

## కేపిటల్ 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి

**హైదరాబాద్, ఆగస్టు 30, (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ మరియు మ్యానుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ కంపెనీ అరాజెన్ లైఫ్ సైన్సెస్‌లో హెల్త్‌కేర్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ క్వాడ్రియా కేపిటల్ 100 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 880 కోట్లు) పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడి ద్వారా అరాజెన్ లైఫ్ సైన్సెస్‌కు 1.4 బిలియన్ డాలర్ల సంస్థాగత విలువ నిర్ణయించబడింది. ఈ ఫండ్స్‌తో అమెరికా, ఐరోపా దేశాల్లోని క్లయింట్లకు సేవలు విస్తరించడానికి అవసరమైన సదుపాయాలను అరాజెన్ సమకూర్చుకుంటుంది. క్వాడ్రియా కేపిటల్ పెట్టుబడిని అరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ మన్ని కంటిపూడి స్వాగతించారు. ఈ పెట్టుబడి కంపెనీ మలిదశ విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని ఆయన తెలిపారు. అరాజెన్ లైఫ్ సైన్సెస్‌ను జీవీకే గ్రూపు ప్రమోటర్లలో ఒకరైన జీవీ సంజయ్ రెడ్డి మరియు ఇతరులు కలిసి 20 సంవత్సరాల క్రితం స్థాపించారు. ఫార్మాసూటికల్ ఔట్‌సోర్సింగ్ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో అరాజెన్‌లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించామని క్వాడ్రియా కేపిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ అమిత్ వర్మ వివరించారు.

## అమెరికా నుంచి భారీ చమురు కొనుగోళ్లు

### భారత్ రిఫైనరీలు అవకాశాలను పట్టుకున్నాయి

**హైదరాబాద్, ఆగస్టు 30, (జనంసాక్షి) :** ఆకర్షణీయమైన ధరల కారణంగా ఈ నెలలో భారతదేశ సంస్థలు అమెరికా నుంచి పెద్ద ఎత్తున చమురు కొనుగోళ్లు చేపట్టినట్లు తెలుస్తోంది. వాణిజ్య యుద్ధాలు, టారిఫ్‌ల నేపథ్యంలో ఈ లోటును తగ్గించుకోవడానికి ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అమెరికాలోని WTI క్రూడ్ ఆయిల్‌ను 5 మిలియన్ బ్యారెళ్ల మేరకు కొనుగోలు చేసేందుకు ఆర్డర్ పెట్టింది. దీని డెలివరీలు అక్టోబర్, నవంబర్‌లలో రానున్నాయి. ఇప్పటికే భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ 2 మిలియన్ బ్యారెళ్ల WTI చమురును కొనుగోలు చేసింది, మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో 2 మిలియన్ బ్యారెళ్లకు ఆర్డర్ పెట్టింది. భారత రిఫైనరీలతో పాటు ఆసియా దేశాల్లోని కంపెనీలు WTI చమురును తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉన్నందున ఈ ఆర్డర్లు ఇచ్చాయి. అమెరికా భారత్‌పై ఎక్కువ చమురు కొనుగోళ్లు చేయాలని చాలా కాలంగా ఒత్తిడి తెస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల విధానం ఈ ఒత్తిడిని మరింత పెంచింది.

## రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి

**కరీంనగర్ బిజెపి జిల్లా శాఖ, అసెంబ్లీ శాఖ నేతల డిమాండ్**


**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో పాల్గొన్న సభా వేదికపై నుంచి ప్రధాని మోదీ మాతృమూర్తిని దూషిస్తూ, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కారానికి నిదర్శనమని బీజేపీ నేతలు మండిపడ్డారు. ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి జిల్లా శాఖ, కరీంనగర్ అసెంబ్లీ శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ, ప్రధాని మోదీ తల్లి గురించి అసభ్యకర వ్యాఖ్యలు, దూషణలతో కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాల స్థాయికి చేరుకుందని విమర్శించారు. ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న పనికిమాలిన రాజకీయాలను చూసి దేశవ్యాప్తంగా ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మోడీ తల్లి పై రాహుల్ గాంధీ బీహార్లో నిర్వహించిన సభా వేదికగా ప్రధాని మోదీ తల్లిపై దూషణలు తలెత్తినందున ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ తల్లి పేదరికంలో నుంచి వచ్చిన విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారన్నారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. మోడీ తల్లిని దూషిస్తూ , కాంగ్రెస్ నేతలు చేసిన అసభ్యకర భాషను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఈ సందర్భంగా కోరారు.

ప్రధాని మోదీ మాతృమూర్తి పై అసభ్యకర భాష, దూషణల పై కొత్తపల్లి బిజెపి రూరల్ శాఖ భగ్గుమంది. మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుంట తిరుపతి మాట్లాడుతూ, ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. మోడీ తల్లిని దూషిస్తూ, కాంగ్రెస్ నేతలు చేసిన అసభ్యకర భాషను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, సోమినేని కరుణాకర్, బోనాల నరేష్, బైరెడ్డి వంశీ, ఇల్లెందుల ఆనంద్, కట్ల శ్రీనివాస్, బోయిన మహేష్, మెరుగు మల్లేశం, రాచకొండ అనిల్, విలాసగరం రామచంద్రం, మల్లెం నాగరాజు, బోనాల అంజన్న తదితరులతోపాటు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## మన ట్రస్ట్ తనిఖీ



**హైదరాబాద్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మధ్యాహ్న భోజనం సరఫరా చేసే మన ట్రస్ట్‌ను చైల్డ్ రైట్స్ కమిషన్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. మన ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 970కు పైగా ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. కమిషన్ ప్రధానంగా ఆహారం తయారీ, వంటగది, దాని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేకపోతే అన్నదానిపై తనిఖీ చేసింది. అలాగే, వంట పాత్రలు ఎలా కడుకుతున్నారో, రైస్ స్టోరేజ్ మరియు సరుకుల స్టోరేజ్‌ను ప్రాపర్‌గా నిర్వహిస్తున్నారో లేదా అన్నదీ తనిఖీ చేశారు. రికార్డులు ప్రతిరోజూ నిర్వహించబడుతున్నాయా లేదా అన్న అంశం కూడా పరిశీలించారు. మిగిలిపోయిన ఆహారాన్ని మరియు వెస్ట్ ఆహారాన్ని ట్రాక్ చేయడం ఎలా జరుగుతోందో, పెస్ట్ కంట్రోల్ ఎన్ని రోజులకో ఒకసారి జరుగుతుందో, ఆహారం రవాణా ఎలా జరుగుతుందో, ఆహారం పెట్టె పాత్రల శుభ్రత ఏమిటి అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. అలాగే, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహారం ఉండే ప్రదేశాలు, ఆహారాన్ని వాహనాల్లో ఎక్కించేటప్పుడు వ్యక్తిగత శుభ్రత పాటిస్తున్నారా లేదా అన్న అంశం కూడా పరిశీలించబడింది. సరుకుల నిల్వ చేసే గోదాములు శుభ్రంగా ఉన్నాయా లేదా, సరుకుల క్వాలిటీ పరిశీలన కూడా జరిగింది. వంటకు ఉపయోగించే నీరు శుద్ధి చేసినదా, ఆర్ఓ లేదా బోరువెల్ నీరు వాడుతున్నామా అన్నది కూడా తనిఖీ చేశారు.

తాజా కూరగాయలు వాడుతున్నారా లేదా, అలాగే కూరగాయలను యంత్రాల ద్వారా కట్ చేస్తున్నారా అన్నది కూడా పరిశీలించారు. మన ట్రస్ట్‌ను పరిశీలించిన కమిషన్, అక్కడ పూర్తిగా పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం ఉండడం లేదని, ప్రాపర్ రికార్డులు నిర్వహించడం లేదని, మైనర్ బాలలను పనికి నియమించుకున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడతామని కమిషన్ తెలియజేసింది.

### ఆస్తి తగాదాలతో చిన్నమ్మను

# హతమార్చిన తనయుడు

## మృతురాలు ఏడు నెలల గర్భవతి

- ఇల్లంతకుంట మండలం టేకుర్తిలో ఘటన





**ఇల్లందకుంట, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఆస్తి తగాదాతో తన తండ్రి చేసుకున్న రెండో భార్యను మొదటి భార్య కుమారుడు విచక్షణారహితంగా కత్తితో గొంతు కోసి హత్య చేసిన సంఘటన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు ముద్రబోయిన రాములుకు రేణుకతో వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు కుమారులు. ఇద్దరి మధ్యన మనస్పర్థలు వచ్చాయి. దీంతో రాములు సైదాపూర్ మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తిరుమల (29) నీ రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటినుండి కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు జరుగుతుండడంతో ఇద్దరితో వేరువేరుగా కాపురం పెట్టాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భవతి .ఇటీవల కాలంలో రెండవ భార్య పేరిట రాములు ఆస్థిరాస్తాడని తెలియడంతో మొదటి భార్య తన ఇద్దరు కుమారులతో కలిసి పంచాయితీ పెట్టింది. పలుమార్లు కుటుంబ సభ్యులకు సంబంధించిన పంచాయతీ విషయం పోలీస్ స్టేషన్కు సైతం చేరింది. ఆస్తి రెండో భార్య పేరిట తన తండ్రి రాస్తాడని భావించిన మొదటి భార్య రెండో కొడుకు బన్నీ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి ఇంటిలో ఒంటరిగా ఉన్న తిరుమల గొంతు కోసి పరారయ్యాడు. ఆస్తి కోసం 7 నెలల గర్భవతిని విచక్షణారహితంగా గొంతు కోయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఇల్లంద కుంట ఎస్సై క్రాంతి కుమార్ లు సంఘటనా స్థలానికి చేరుకొని గర్భవతి అయిన తిరుమల మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య చేసిన బన్నీ పరారీలో ఉండడంతో మృతురాలి భర్త రాములు ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బన్నీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నామని జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఆది గోద్రేజ్ గ్రూప్‌కు కొత్త సీఈఓ

**హైదరాబాద్ :** ఆది గోద్రేజ్ గ్రూప్‌కు కొత్త సీఈఓగా విజయ్ కుమార్ నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను విస్తరించేందుకు ఆయన రూ. 5,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికను ప్రకటించారు. హైదరాబాద్, విజయవాడలలో ఈ ప్రాజెక్టులు ప్రధానంగా అమలు కానున్నాయి. ఈ విస్తరణ ద్వారా గణనీయమైన ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని గోద్రేజ్ గ్రూప్ అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులు గోద్రేజ్ ప్రాపర్టీస్ ఆధ్వర్యంలో అత్యాధునిక రెసిడెన్షియల్ మరియు కమర్షియల్ సముదాయాలను నిర్మించడంపై దృష్టి సారిస్తాయి. హైదరాబాద్‌లో ఇటీవల 7.825 ఎకరాల భూమిని కుకట్‌పల్లి లో రూ. 547.75 కోట్లతో సొంతం చేసుకున్న గోద్రేజ్ ప్రాపర్టీస్, ఈ ప్రాంతంలో రూ. 3,800 కోట్ల ఆదాయ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులను అభివృద్ధి చేయనుంది.




## ప్రేమకూ ఓ ఇల్లు ఇవ్వండి

### ఇండీ కుక్కపిల్లల దత్తతకు జీహెచ్ఎంసి పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ప్రేమతో నిండిన ఒక చిన్న ప్రాణానికి మీరు ఓ ఇల్లు ఇస్తారా? అంటూ ఇండీ కుక్కపిల్లల దత్తతకు జీహెచ్ఎంసి వినూత్న రీతిలో ఆహ్వానం పలుకుతుంది. బిఎ హీరో ,దత్తత తీసుకోండి, షాపింగ్ వద్దు (Be a Hero. Adopt, Don`t Shop) నినాదంతో బంజారా హిల్స్ కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కులో ఈ నెల 31 న ఉదయం 7:00 గంటల నుండి 10:00 గంటల వరకు ఇండీ కుక్కపిల్లల ప్రత్యేక దత్తత మేళా జీహెచ్ఎంసి నిర్వహిస్తుంది. దత్తత కోసం వచ్చే పప్పీ డాగ్ లవర్స్ కోసం డివార్మింగ్ చేసి, టీకాలు వేసిన, ఆరోగ్యకరం, నమ్మకమైన ఫ్రెండ్లీ కుక్క పిల్లలను మేళా లో ప్రదర్శనగా ఉంచుతారు. వీటి సంరక్షణ కూడా సులభమే. మేళాలో ఉంచే అందమైన ఫ్రెండ్లీ పప్పిలు దత్తత తీసుకున్న వ్యక్తులనే కాకుండా వారి కుటుంబానికి మంచి స్నేహితులుగా మారతారు. "దత్తత పూర్తిగా ఉచితం - కావలసింది మీ ప్రేమ మాత్రమే "…. అంటూ జీహెచ్ఎంసి పిలునిస్తుంది. జీహెచ్ఎంసి తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ మేళా ప్రకటన పోస్ట్ చేయగా పప్పి లవర్స్ ను విశేషంగా ఆకట్టుకుంటుంది.

# ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సేవలు భేష్

- ప్రశంసించిన నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో నిజామాబాద్ జిల్లాలో వరద ప్రభావానికి లోనైన ప్రాంతాలలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందించిన సేవలు ప్రశంసనీయమని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు కనబరిచిన తెగువ, కృషి కారణంగా జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నివారించగలిగామని అన్నారు. వరదల వల్ల జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విపత్తు ప్రతిస్పందన దళాలు సాహసోపేతమైన కృషిని కనబర్చాయని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం గంటతో సమన్వయం చేసుకుంటూ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఆధునిక పరికరాలతో రక్షణ చర్యలు చేపట్టాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బోట్ల సహాయంతో పాటు ట్రాక్టర్లు, జేసీబీల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విపత్తు ప్రతిస్పందన దళాలు ఎంతో గొప్పగా సేవలు అందించాయని అన్నారు. ఎగువ ప్రాంతాల నుండి వరద పోటెత్తడంతో నిజామాబాద్ జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు తెగిపోయి వరద నీరు గ్రామాలలోకి వచ్చి చేరుతున్న క్రమంలో జిల్లా యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై విపత్తు ప్రతిస్పందన దళాల సేవలను వినియోగించుకుందని కలెక్టర్ తెలిపారు. సమాచారం అందించిన వెంటనే విపత్తు ప్రతిస్పందన దళాలు వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని తక్షణ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని అన్నారు. బోధన్ మండలం హంగర్గ గ్రామంలో వరదల్లో చిక్కుకున్న సుమారు 480 మందిని



ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ చేశాయని అన్నారు. అదేవిధంగా రెంజల్ మండలం కందకుర్తి వద్ద సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమంలో వరదలో చిక్కుకున్న 8 మంది విపత్తు సహాయక బృందాలు ప్రాణాలకు తెగించి కాపాడారని, ఆశ్రమంలోని మూగ జీవాలకు కూడా అవసరమైన మేత, నీటి వసతిని సమకూర్చారని కలెక్టర్ వివరించారు. సాలూరా మండలంలోని మందర్న, హున్సా, ఖాజాపూర్ గ్రామాలలో జలదిగ్బంధంలో చిక్కుకున్న 120 మందిని బోట్ల ద్వారా ఎస్డీఆర్ఎఫ్ 7వ పోలీస్ బెటాలియన్ బృందాలు రక్షించాయని తెలిపారు. సుమారు 12 అడుగుల ఎత్తులో కొనసాగిన వరద ప్రవాహ ఉధృతిని దాటుకుని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారని అన్నారు. ముత్యాల చెరువు తెగడంతో దర్పల్లి మండలం వాడి గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టగా, ఎస్డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన చేరుకొని సహాయక చర్యలు కొనసాగించిందని తెలిపారు. ఇదే రీతిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వరదలలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సాహసోపేతమైన కృషిని కొనసాగించాయని కలెక్టర్ అభినందించారు.



## ర్యాగింగ్ రక్కసిని అరికట్టాలి

**అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు**

**గోదావరిఖని, జనంసాక్షి :** విద్యా సంస్థల్లో ర్యాగింగ్ రక్కసిని అరికట్టాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు పాటుపడాలని ఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ర్యాగింగ్ పేరుతో జూనియర్లను సీనియర్లను వేధించటం రాక్షసత్వమన్నారు. ర్యాగింగ్ పాల్పడితే జైలు శిక్షతో పాటు, విద్యాసంస్థ నుంచి సస్పెండ్ తప్పదన్నారు. అదేవిధంగా విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు,ఎంచుకున్న లక్ష్యం కోసం కృషి చేయాలన్నారు. ఇక్కడ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవీందర్, ఉపన్యాసకులు మంతెన శ్రీనివాస్, న్యాయవాది ఎండి.ఉమర్ ఉన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గానికి
# ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇవ్వండి

**ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు**



**నాగిరెడ్డిపేట్, ఆగస్టు 30 జనంసాక్షి :** అసెంబ్లీ సమావేశాలు ప్రారంభము కానున్న సందర్భంలో భాగంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు.ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షాలు,వరదల వల్ల నష్టం గురించి ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించారు. వరదల వల్ల రైతులకు వచ్చిన పంట నష్టం వివరించి, నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. రోడ్లు, బ్రిడ్జిలు చెరువులు ధ్వంసమైన ప్రాంతాలకు పునర్నిర్మాణ పనుల కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే నాగిరెడ్డిపేట్ మండలంలోని 103 సంవత్సరాల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం తగిన నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ధ్వంసమైన గృహాలకు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నూతన గృహాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కోరడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వరదల వల్ల ఎదురైన పరిస్థితులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందిస్తుందని అవసరమైన నిధులను త్వరితగతిన విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తెలిపారు. వర్షాలు, వరదల పరిస్థితుల్లో ఎల్లారెడ్డి ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అధికారులు, సహాయ బృందాలతో సమన్వయం కొనసాగించిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కృషిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. వరదల్లో ఇరుక్కున్న ప్రజలను సురక్షితంగా బయటకు రప్పించడంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాత్ర కీలకమైందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో ప్రజలతో పాటు నిలిచిన ప్రభుత్వ అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారని ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పేర్కొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం.. అల్వాల్ వైద్యాధికారి సస్పెన్షన్

**సెలవు లేకుండా గైర్హాజరు.. కలెక్టర్ ఆదేశాలపై వేటు**

**అల్వాల్:** విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్వేతపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 26న జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించిన ఆయన, సీజనల్ వ్యాధు లు విస్తరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో డాక్టర్ శ్వేత విధుల్లో గైర్హాజరుగా ఉన్నట్టు తేలడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలవు లేకుండా గైర్హాజరు కావడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్, విధులపట్ల వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్ఓ ఉమాగౌరీ ఆదేశాల మేరకు డాక్టర్ శ్వేతను సస్పెండ్ చేశారు.

# ప్రభుత్వం ద్వారా ఆదుకుంటాం

**నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి**



**నిజామాబాద్ బ్యూరో, (జనంసాక్షి) :** బాన్సువాడ నియోజకవర్గంలో భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల పరిధిలోని చింతలపేట తండా, సిద్ధాపూర్, పులి క్యాంప్, జలాల్ పూర్, గ్రామాలలో దెబ్బ తిన్న రహదారులను, కల్వర్టులను, వరద నీరు ఇళ్లలోకి చేరడంతో బాధితుల ఇళ్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి అయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా ఉంటామని అయన తెలియజేశారు. మండలంలోని పులి క్యాంప్ లో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో బాధితుల ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. పెద్దగుట్ట-వర్ని రహదారి జలాల్ పూర్ వద్ద దెబ్బతిన్న రహదారిని పరిశీలించా రు. సిద్ధాపూర్ గ్రామంలో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నిర్మాణంలో ఉన్న సిద్ధాపూర్ రిజర్వాయర్ ఆనకట్టను పరిశీలించి అనంతరం భారీ వర్షానికి పూర్తిగా కూలిపోయిన ఇండ్లను పరిశీలించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. చింతల్ పేట్ తండా రోడ్డుపై వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. అయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గణపతి నిమర్జనానికి పకడ్బంది ఏర్పాట్లు

**ఎల్లమ్మ గుండం చెరువు కట్ట వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

- నిమర్జనానికి ప్రజలందరూ సహకరించాలి : ఎమ్మెల్యే విజయరమణరావు



**పెద్దపల్లి,ఆగస్టు 30(జనంసాక్షి) :** ఎంతో నిష్ఠతో నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుని నిరమర్జనానికి పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, పోలీస్ యంత్రాంగంతో మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు అందుకున్న గణపతి నిమర్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లను చేస్తున్నామని అన్నారు. పెద్దపల్లి ప్రాంత ప్రజలు సకాలంలో ఒక క్రమ పద్ధతి పద్ధతి పాటించి నిమర్జన ప్రక్రియను పూర్తి చేసుకుంటూ అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛ సంఘటనలకు తావివ్వకుండా భక్తి శ్రద్ధలతో నిమర్జనం జరుపుకోవాలని తెలిపారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గణేష్ నిమర్జనం సాఫీగా సాగే విధంగా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎ.సి.పి గజ్జి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎ.ఈ సతీష్, సి.ఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై లక్ష్మణ్ రావు, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండపాకలో పౌరహక్కుల దినోత్సవం




**వీణవంక ఆగస్టు30 (జనం సాక్షి) :** వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో దళిత వాడలో మండల తహశీల్దార్ ఆదేశానుసారం మండల అన్ని శాఖల అధికారుల సమక్షంలో శనివారం రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అది కారులు దళితులతో మాట్లాడుతూ దేవాలయాల్లో ప్రవేశ నిరాకరణ,హొటళ్లలో రెండు గ్లాస్ ల పద్ధతి,దళితుల పై దౌర్జన్యాలు,కులం పేరుతో దూషించినట్లయితే తెలపాలని కోరగా,వారు పై అంశాల లో ఏ ఒక్క సమస్యపై ఇబ్బంది జరుగలేదని,దళితులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సమావేశములో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవీందర్,ఏ ఎస్ఐ వెంకట్ రెడ్డి,పంచాయితీ కార్యదర్శి హాజరయ్యారు.మిగతా శాఖల అధికారులు కొంతమంది గైర్హాజరయ్యారు.

# దళారులను నమ్మి ఎవరు డబ్బులు చెల్లించవద్దు

- రోడ్డుకు ఇరు వైపులా ఎత్తైన మొక్కలను నాటాలి
- 7 రోజులలో 40 వేల మొక్కల అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలి
- వనమహోత్సవం కార్యక్రమంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం
- ప్రస్తుతం ఎటువంటి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ చేయడం లేదు
- సెప్టెంబర్ 7 లోపు వివిధ శాఖల సంపూర్ణ సమాచారం అందించాలి
- ఆర్చరీ క్రీడాకారిణిని సన్మానించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి జిల్లాలో వనమహోత్సవం, ఉద్యోగ మోసాల నివారణ, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డిఎంఎఫ్టీ) బేస్‌లైన్ సర్వే, మరియు ఆర్చరీ క్రీడలో అంతర్జాతీయ విజయం సాధించిన కార్యక్రమాలపై సమావేశాలు మరియు కార్యక్రమాలు జరిగాయి. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రీనరీ పెంచేందుకు రోడ్లకు ఇరువైపులా 40 వేల ఎత్తైన మొక్కలను రాబోయే 7 రోజుల్లో నాటి అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆదేశించారు. మొక్కల సంరక్షణ కోసం సహాయ కర్రలు, టీ గార్డ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, రెగ్యులర్ నీటి సరఫరా నిర్వహించాలని సూచించారు. మొక్కలు ఎండిపోతే వెంటనే రీప్లేస్ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా అటవీ అధికారి శివయ్య, డిపిఓ వీర బుచ్చయ్య, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి జరిగే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఏ ప్రభుత్వ శాఖలోనూ ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని స్పష్టం చేశారు. అవసరమైతే, కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా అర్హతల పరిశీలనతో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. కొంత మంది దళారులు అమాయకుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందినందున, నియామకాల్లో డబ్బులకు లేదా సిఫార్సులకు ఆస్కారం లేదని, ప్రజలు దళారులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు.

డిఎంఎఫ్టీ బేస్‌లైన్ సర్వేలో భాగంగా విద్యాశాఖ, ప్రణాళిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా ఆసుపత్రి, వ్యవసాయ శాఖ, హౌసింగ్, పశు సంవర్ధక శాఖ పరిధిలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని సెప్టెంబర్ 7 లోపు అందించి బుక్‌లెట్ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో ఇంట్రా గంగాధర శ్రీనివాస్, డిడబ్ల్యూఓ వేణుగోపాల్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఇతర అధికారు లు పాల్గొన్నారు. విలువిద్య క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితను కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సన్మానిం చారు. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల తానిపర్తి చికిత కెనడాలో జరిగిన విన్నిపెగ్ 2025 వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్ ఆర్చరీ పోటీల్లో అండర్-21 మహిళల కాంపౌండ్ విభాగంలో అగ్రశ్రేణి క్రీడాకారులను ఓడించి స్వర్ణం సాధించి, భారతదేశ మొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా చరిత్ర సృష్టించా రని కలెక్టర్ ప్రశంసించారు. ఈ విజయం జిల్లా యువ క్రీడాకా రులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో రాణించి భారతదేశం, పెద్దపల్లి జిల్లాకు కీర్తి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ అమెరిశెట్టి తిరుపతి, కుమార్, సుల్తాన్‌పూర్ గ్రామస్తులు ఇతరులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక చేయూత

## క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం

- ఇద్దరికి కలిపి రూ. 1,75,000 అందజేత
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి) :** చిన్నారి వైద్యానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థికంగా చేయూతను అందించారు. సిరిసిల్లలోని శివనగర్‌కు చెందిన వేముల మధు దంపతులకు కవలలు (కొడుకు, కూతురు) జన్మించారు. అనారోగ్య సమస్యతో కూతురు ఆసుపత్రిలో మరణించారు. కొడుకు హైదరాబాద్ లోని దవాఖాన లో చికిత్స పొందుతున్నాడు. తమ కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వేముల మధు కలెక్టర్ కు విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.చిన్నారి వైద్యానికి రూ. 50 వేల చెక్కును జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేశారు. చిన్నారి చికిత్సకు భరోసా ఇచ్చారు.

**క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం :**

సిరిసిల్ల పట్టణానికి చెందిన బోనాల వెంకటేష్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. తన వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వెంకటేష్ విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ బోనాల వెంకటేష్ వైద్యానికి రూ. 1,25,000 ఆర్థిక సహాయం అందజేశారు. తమ బాధను అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు చిన్నారి, క్యాన్సర్ రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వృద్ధులకు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలి

- వయోవృద్ధుల పోషణకు ట్రిబ్యునల్ ఉత్తర్వుల అమలును పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**

వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అనుసరించి ట్రిబ్యునల్ ఇస్తున్న ఉత్తర్వులను పాటిస్తున్నది లేనిది పర్యవేక్షించాలని, తద్వారా వృద్ధులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం 2007 అమలు తీరు, ట్రిబ్యునల్ ఉత్తర్వులు, అమలుపై వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు, అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లిదండ్రుల బాగోగులు చూడడం లేదని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని బలవంతంగా ఆస్తి పత్రాలపై సంతకాలు చేయించుకుంటున్నారని రెవెన్యూ డివిజనల్ అధికారి ట్రిబ్యునల్‌కు చాలా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. వాదోప వాదాల తర్వాత వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమానికి మెయింటెనెన్స్ సొమ్ము ఇవ్వాల్సిందిగా ట్రిబ్యునల్ ఉత్తర్వులు వెలువరిస్తుందని తెలిపారు. అయితే ఈ తీర్పులను ఒకటి, రెండు నెలలు అమలు చేసి తరువాత బేఖాతరు చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. అందువల్ల తల్లిదండ్రులు, వయోవృద్ధులు కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. వృద్ధుల ఇబ్బందులు తొలగించేందుకు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, రెవిన్యూ, పోలీస్, సఖి కేంద్రాల నుంచి ఒక్కో అధికారి బృందంగా ఏర్పడి ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలు జరుగుతున్నది లేనిది క్షేత్రస్థాయిలో విచారించాలని అన్నారు. ఫిర్యాదు చేసిన వయోవృద్ధుల యోగక్షేమాలను ఈ బృందం పర్యవేక్షించి నివేదిక సమర్పించాలని, అంతిమంగా అధికారులు వయోవృద్ధులకు న్యాయం చేయాలని తెలిపారు. వయోవృద్ధుల కేసులకు సంబంధించి ఆర్డిఓ ఆధ్వర్యంలోని ట్రిబ్యునల్‌లో ప్రతి శనివారం నిర్వహించే విచారణ సమయంలో ఒక పోలీస్ అధికారికి విధులు కేటాయించాలని సీపీకి సూచించారు. ట్రిబ్యునల్ జారీచేసిన విధంగా మెయింటెనెన్స్ సొమ్మును తల్లిదండ్రులకు ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఈ ఆదేశాలపై వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపి గౌస్ ఆలం, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్, డీసీహెచ్ఎస్ కృష్ణ ప్రసాద్, అడిషనల్ డిఆర్డిఓ రవి కిరణ్, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, జనార్దన్ రావు, రామేశం, రాధ పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం




**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**

విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పోటీతత్వాన్ని అలవర్చాలని, వివిధ రకాల పోటీ పరీక్షలలో పాల్గొనేదందుకు ప్రోత్సాహం అందించడంతోపాటు సంబంధించినటువంటి వనరులను, సమాచారాన్ని అందించినట్లయితే వారు తప్పనిసరిగా విజయం సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభా పాటవ పోటిలను నిర్వహించాలని, నేటి సమాజంలో విద్యార్థులు పోటితత్వాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవడమే కాకుండా పోటీ పరీక్షలలో పాల్గొని వివిధ ప్రతిభా ఆధారిత కార్యక్రమాలలో పాల్గొని పై చెయి నిరూపించాలని వారు సూచించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత పెంపొందించడం లక్ష్యంగా ప్రముఖ సైకిల్ కంపెనీ బిఎస్ఏ హర్కులేస్ వారి సౌజన్యంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఈ వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ వ్యాసాలను రూపొందించిన ఎం.ఆరాధ్యల, బి.అక్షిత్ ప్రథమ, ద్వితీయ స్థానాలను నిలవడమే కాకుండా సైకిల్స్ గెలుచుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు. సుమారు 20 మంది పైగా విద్యార్థులు చాలా చక్కటి వ్యాసాలను రూపొందించి ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. చాలా చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు బిఎస్ఏ హర్కులెస్ కంపెనీ వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, హర్క్యెస్ కంపెనీ ప్రతినిధులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినంగా జరపాలి



**ఖమ్మం, (జనం సాక్షి):** సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా జరపాలని టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని టీఎన్జీవో భవన్లో టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర టీజీఈ జెఏసి పిలుపుమేరకు సెప్టెంబర్ 1 ఉదయం ఖమ్మం లోని ఐడిఓసి కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు, నల్ల దుస్తులు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 18వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే బస్సు యాత్రలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అక్టోబర్ 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో సకల ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్సీ అభివృద్ధి శాఖ ఉపసంచాలకులుగా పనిచేసే పదవి విరమణ చేయనున్న టీజీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు ఆయుష్ ప్రకాష్‌ను సన్మానించారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, కేంద్ర సంఘం కార్యదర్శులు జెడ్ ఎస్ జైపాల్, విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, కోశాధికారి వెంకన్న, తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, జిల్లా కార్య వర్గం, యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా విభాగం కార్యవర్గం పాల్గొన్నారు.

## యూరియా కోసం తండ్లాట, రోడ్డెక్కిన రైతన్నలు



**గూడూరు, (జనంసాక్షి):** యూరియా దొరకక రైతులు శనివారం ఉదయాన్నే నేషనల్ హైవే 365 రోడ్డుపై యూరియా వెంటనే అందించాలని గంట పాటు ధర్నా,రాస్తారోకో నిర్వహించారు. గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రైతులకు యూరియాను అందిం చటంలో కేంద్ర,రాష్ట్ర,ప్రభుత్వాలు విఫలం చెందాయని రైతులు ఆరోపిస్తూ,సకాలంలో యూరియా అందాకా రైతులు వేసుకున్న పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని,రైతులు బిక్కు బిక్కుమంటూ, యూరియా కోసం ఎదురు చూస్తున్నారని,రైతులకు సరిపడు యూరియాను అందించి,రైతుల కష్టాలను తీర్చాలని నేషనల్ హైవే 365రోడ్డుపైన ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్నారని విషయాన్నీ తెలుసుకున్న గూడూరు సీఐ సూర్య ప్రకాష్,మండల వ్యవసాయ అధికారి ఎండీ అబ్దుల్ మాలిక్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడినారు. యూరియాను తెప్పిస్తామని టోకెండ్లు ఇచ్చిన వారికీ ముందుగా యూరియాను అందిస్తామని,తరువాత దశల వారికీ ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా,రాస్తారోకోను విరమింప చేశారు.

### మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో..
## వందే భారత్ రైలు స్టాప్‌కు అనుమతి

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కృషి
- మంచిర్యాల జిల్లాలో సంబరాలు




**మంచిర్యాల ప్రతినిధి ఆగస్ట్ 30 (జనంసాక్షి) :** గత సంవత్సరం నుండి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ , రైల్వే మంత్రివర్యులు శ్రీ అశ్విని వైష్ణవ్ ను, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, రైల్వే బోర్డు చైర్మన్‌లను పలుమార్లు కలసి వినతులు అందజేయడం మూలంగానే మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలు స్టాప్ కు అనుమతి వచ్చిందని కాంగ్రెస్ నాయకులు సుదమల్ల హరికృష్ణ పేర్కొన్నారు.
శనివారంనాడు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హరికృష్ణ నేతృత్వంలో కేక్ కట్ చేసి ప్రయాణికులకు మిఠాయి పంచుతూ సంబరాలు చేసుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పెద్దపల్లి ఎంపి వంశీ కృష్ణ పట్టుదలతోనే మంచిర్యాల ప్రజల దీర్ఘకాలిక కల నెరవేరిందని పేర్కొన్నారు. వందే భారత్ ట్రైన్ ఆగడానికి అనుమతి లభించడం వల్ల స్థానిక ప్రజలకు, విద్యార్థులకు, కార్మిక వర్గాలకు, పరిశ్రమలకు ప్రయాణ సౌలభ్యం పెరగనుందని అన్నారు. ప్రజల ఆశయాలను సాధించడంలో ఎంపి కృషి చరిత్రలో నిలిచిపోతుందని, ప్రజల అవసరాలను కేంద్రానికి వినిపించి విజయవంతం చేసిన ఎంపీ వంశీకృష్ణ కు మంచిర్యాల ప్రజల తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.వి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### మంచిర్యాలకు 1000 మెట్రిక్ టన్నులు
## యూరియా కేటాయించాలి

బిజెపి రాష్ట్ర నాయకులు రఘునాథ్



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 30 జనంసాక్షి :** దళారులు కృత్రిమంగా సృష్టించిన యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు రఘునాథ్ కోరారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి వ్యవసాయ అధికారి ఛత్రూ నాయక్ ను రైతులతో కలిసి యూరియా సమస్యను వివరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యవసాయ అధికారుల సమన్వయం లోపం వల్లన జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు వచ్చాయని అన్నారు. రైతులకు యూరియా దొరకక కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు దళారులతో కుమ్మక్కై కృత్రిమంగా యూరియా కొరత సృష్టిస్తున్నారని అన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి తక్షణమే 1000 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. కృతిమ కొరత సృష్టించిన దళారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఎనగందుల కృష్ణ మూర్తి, మాధవరపు వెంకట రమణ రావు, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీష్ రావు, గడ్డం స్వామి రెడ్డి, అమిరిశెట్టి రాజ్ కుమార్, బొలిశెట్టి అశ్విన్, కుర్రె చక్రి, కొట్టే ప్రశాంత్, బొడ్డు తిరుపతి రైతులు పాల్గొన్నారు

## మురుగు నీటి కుంటల్లో గంబూషియా చేప పిల్లలు

**కోల్ సిటీ :** రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే.అరుణశ్రీ ఆదేశాల మేరకు శనివారం దోమల లార్వా తినే గంబూషియా చేప పిల్లలను మున్సిపల్ సిబ్బంది మురుగు నీటి కుంటల్లో వదిలారు. మత్స్యశాఖ సహకారంతో మొదటి దఫాలో 5 వేల గంబూషియా చేప పిల్లలను కరీంనగర్ నుంచి తెప్పించి నగరంలోని పలు మురికి వాడలను గుర్తించి కుంటలు, నీరు ఎక్కువగా నిలిచి ఉండే ప్రాంతాల్లో ఈ చేప పిల్లలను వదిలినట్లు కమిషనర్ తెలిపారు.

## యూరియా బస్తాల కోసం రైతుల తిప్పలు

- కడెం పిఎసిఎస్ వద్ద బారులు తీరిన రైతులు



**కడెం, ఆగస్టు 30(జనం సాక్షి) :** కడెం మండల కేంద్రంలోని పిఎసిఎస్ గోదాం వద్ద శనివారం రోజున యూరియా బస్తాల కోసం మండలంలోని పలు గ్రామాల రైతులు బారులు కట్టారు. గత 10 రోజుల నుండి మండల కేంద్రానికి యూరియా బస్తాలు రాకపోవడంతో శనివారం రోజున వచ్చిన యూరియా బస్తాల కోసం రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వచ్చిన యూరియా కొంతమంది రైతులకే అందడంతో మిగతా రైతులు నిరాశతో వెనుతిరిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పంట పండించాల్సిన రైతుకి సమయానికి కావలసిన ఎరువులు లేకుంటే రైతు ఎలా పంట పండిస్తాడంటూ, భూమిని నమ్ముకుని వాననక ఎండనక కష్టపడుతున్న రైతుకు సమయానికి ఎరువులు లేకుంటే సరైన దిగుబడి ఎలా వస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరతపై సీఈఓ రాజేందర్ ను జంసాక్షి వివరణ కోరగా. మరో రెండు లారీలలో 900 బ్యాగులు ఈరోజు సాయంత్రం లేదా రేపటి వరకు వచ్చే అవకాశం ఉందని, మా వంతు మేము క్షయశక్తుల ప్రయత్నం చేస్తున్నామని, ప్రతి రైతుకి యూరియా బస్తాలు అందేలా చూస్తామని తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

## మహిళల సంరక్షణలో షీ టీమ్స్ పాత్ర ప్రశంసనీయం


### ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ విభాగం సైబరాబాద్ డిసిపి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి):**
నగరం పరిధిలోని మహిళల సంరక్షణ విషయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు షీ టీమ్స్ పాత్ర ప్రశంసనీయమని సైబరాబాద్ మహిళా శిశు సంక్షేమ విభాగం డిసిపి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో డిసిపి మాట్లాడుతూ ఈనెల 24 నుండి 30వ తేదీ వరకు వారం రోజులుగా సైబరాబాద్ పరిధి షీ టీమ్స్ విభాగం అధికారులు నిర్వహించిన ప్రత్యేక డెకాయ్ ఆపరేషన్లలో భాగంగా 152 ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని, ఈ క్రమంలో 45 మందిని మహిళలపై వేధింపుల కేసులో అసుబులోకి తీసుకోవడం జరిగిందన్నారు. సదరు వ్యక్తులపై ప్రెటీ కేసుల నమోదు చేయడం జరిగిందని, వారందరికీ దశలవారీగా కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ పద్ధతులలో మహిళల నుండి 15 ఫిర్యాదులను అందుకోవడం జరిగిందని, ఈ వారం రోజులలో 69 అవగాహన కార్యక్రమాలను వివిధ ప్రాంతాలలో నిర్వహించడంతోపాటు నాలుగు కౌన్సిలింగ్ సెక్షన్లను సైతం ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ సైబరాబాద్ విభాగం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాలలో దాదాపు 23 కుటుంబాలకు కౌన్సిలింగ్ ను అందించడం జరిగిందని తద్వారా వారు తిరిగి తమ జీవితాలను కలిసి కొనసాగించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇక అక్రమ మహిళల రవాణా గురించి నిర్వహించిన కార్యక్రమాలలో గతవారం 125 మంది పాల్గొనడం జరిగిందని, వారికి మహిళల అక్రమ రవాణా విషయంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మికులు, భిక్షాటన, సైబర్ బుల్లింగ్, సైబర్ నేరాల వంటి విషయాలలో 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాలకు సంబంధించి 1930 అందుబాటులో ఉన్నాయని, గతవారం షీ టీమ్స్ ఆధ్వర్యంలో రాత్రి సమయంలో రైడింగ్లను నిర్వహించడంకూడా జరిగిందన్నారు. వ్యభిచారం విషయంలో 13 మంది ట్రాన్స్ జెండర్స్, 2 మహిళలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. సురక్ష కవచ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థినులకు ఫిజికల్ సేఫ్టీ, సేఫ్టీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సేఫ్టీ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ విభాగం డిసిపి సృజన నేతృత్వంలో లింగంపల్లి లో ఎస్ఎస్సి స్కూల్ అసోసియేషన్ పరిధికి సంబంధించిన 100 పాఠశాలల యాజమాన్యంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

## ఖాజీపూర్ వక్ఫ్ భూమి స్వాధీనమయ్యేలా చొరవ తీసుకోండి

- మైనార్టీ కమిషన్ చైర్మన్‌కు ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ వినతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**
కొత్తపల్లి హావేలి మండలంలోని ఖాజీపూర్ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన, కోట్లాది రూపాయల విలువ చేసే 55ఎకరాల భూమిని, కబ్జాదారుల నుండి వక్ఫ్ బోర్డు వశమయ్యేలా చొరవ తీసుకోవాలని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీకి విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్ పర్యటనకు వచ్చిన మైనారిటీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీనీ ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ... అన్యాక్రాంతం అయిన ఖాజీపూర్ వక్ఫ్ భూమిని విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని, లెటర్ ఇచ్చిన నేపథ్యంలో, విచారణ పూర్తయినప్పటికీ అట్టి భూమి స్వాధీనాన్ని ఆచరణలో అమలు చేయాలని కోరారు. వక్ఫ్ యాక్ట్ 1990 గెజిట్ ప్రకారం ఖాజీపూర్ రెవెన్యూ పరిధిలోని 122, 126, 129, 154, 171 సర్వే నెంబర్లలో 55ఎకరాల 22గుంటల భూమి వక్ఫ్ బోర్డ్ దేనని తేలిందన్నారు. ఈవక్ఫ్ భూమిలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, దర్జాగా ఫామ్ హౌస్ నిర్మించుకొని వక్ఫ్ భూమిని అనుభవిస్తున్నారని వివరించారు. వక్ఫ్ భూమిని ఆధీనంలో ఉంచుకోవడమే కాకుండా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ అదే ప్రభుత్వం మీద హైకోర్టులో కేసు వేసిన చరిత్ర గంగుల కమలాకర్ దేనన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కరీంనగర్ ముస్లిం సమాజానికి పూర్తిస్థాయిలో మేలు జరగాలంటే ఖాజీపూర్ వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వక్ఫ్ భూమిని రిజిస్ట్రేషన్లు రద్దు చేసేట్లు జిల్లా కలెక్టర్కు ఆదేశాలు జారీ చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్సారీ ఖాజీపూర్ వక్ఫ్ భూమి అంశంలో రిజిస్ట్రేషన్లు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిపారు.

## యూరియా కోసం అధికారులపై రైతుల ఆగ్రహం

- టోకెన్ ఇచ్చి యూరియా రాదని మాయా మచ్చింద్రం
- రైతుల రాస్తారోకో



**శివ్వంపేట ఆగస్ట్ 30 జనంసాక్షి:** యూరియా టోకెన్లు ఇచ్చి రైతులను మాయ మచ్చింద్రం ( మభ్యపెట్టి )చివరికి యూరియా రాదని తెలపడంతో వ్యవసాయ అధికారిని లావణ్య తో పాటుగా సొసైటీ సీఈఓ మధుల పై రైతులు ఆగ్రహం చేశారు. యూరియా కోసం మండల కేంద్రమైన శివంపేటకు వచ్చిన రైతులకు తీవ్ర నిరాశ ఎదురయింది. దీంతో శనివారం సాయంత్రం వరకు వేచి చూసిన రైతులు అధికారుల తీరును నిరసిస్తూ, శివంపేటలోని తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. శివ్వంపేట మండలలోని పలు గ్రామాల నుంచి యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి రైతు వేదిక వద్ద టోకెన్లు తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సొసైటీ వద్ద ఉదయం నుంచి గంటల కొద్ది సమయం కేటాయించి, క్యూ లైన్ లో నిలుచు న్నారు. దీంతో అధికారులు యూరియా రావడం లేదని తెలపడంతో రైతు వేదిక వద్దకు రైతులు చేరుకొని వ్యవసాయ అధికారిని లావణ్య ను రైతులు నిలదీసి, ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులకు 450 టోకెన్లు మాత్రమే ఇచ్చారు. మిగతా రైతులు నిరాశతో వెనుక తిరిగారు. ఈ విషయంపై ఫ్యాక్స్ సీఈవో మధు మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల యూరియా లారీ రాలేదని అన్నారు. టోకెన్లు ఇచ్చిన 450 మంది రైతులకు ఆదివారం యూరియా అందజేస్తామని తెలిపారు.

## మీను సింగ్ గ్రేహ్లక్ష్మి మిసెస్ ఇండియా 2025

**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన ఇంజనీ ర్, సామాజిక కార్యకర్త, మోడల్ మీను సింగ్ న్యూఢిల్లీలోని మయూర్ విహార్‌లోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఒక అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో గ్రేహ్లక్ష్మి మిసెస్ ఇండియా 2025 కిరీటాన్ని పొందారు. ఈ ప్రతిష్టాత్మక పోటీని భారతదేశంలోని ప్రముఖ మహిళా పత్రిక గ్రేహ్లక్ష్మి నిర్వహించింది. ఇది 35 సంవత్సరాల స్త్రీత్వాన్ని జరుపుకునే వారసత్వాన్ని కలిగి ఉంది. కిరీటంతో పాటు, మీను రెండు ప్రత్యేక బిరుదులను కూడా గెలుచుకుంది. లా పింక్ నేచురల్ స్కిన్‌కేర్ సమర్పించిన “రేడియంట్ స్కిన్” “బెస్ట్ డ్రెస్డ్”. తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మీను సింగ్ ఇలా అన్నారు. “ఈ కిరీటాన్ని ధరించడం నాకు చాలా గౌరవంగా, కృతజ్ఞతగా అనిపిస్తుంది. నాకు, ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు, స్ఫూర్తినిచ్చే, సాధికారత కల్పించే బాధ్యత. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి, మహిళా సాధికారతకు దోహదపడటానికి నేను ఈ వేదికను ఉపయోగించాలనుకుంటున్నాను”

## మురుగు పొంగొద్దు.. నీట మునగొద్దు





- సిల్ట్ రిమూవల్ పనుల్లో హైడ్రా తలమునకలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్
- కృష్ణానగర్ నివాసితులతో త్వరలో సమావేశం


**హైదరాబాద్, ఆగస్టు 30 జనంసాక్షి:**
అమీర్‌పేట్ వద్ద వరద ముప్పు నివారణకు హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయి. సంబంధిత శాఖల సహకారంతో పెద్దమొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతాల్లో పర్యటించి సమస్య పరిష్కారానికి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమీర్‌పేట్‌తో పాటు కృష్ణానగర్‌లోని వరద ముప్పు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం మరోసారి పర్యటించారు. వర్షాల సమయంలో వరద, నిత్యం మురుగు ముంచెత్తే ప్రాంతాలను కలియ దిరిగారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నాలాలను పరిశీలించారు. ఈ నెల 26న పర్యటించి నాలాల్లో పూడిక తీతకు ఆదేశించిన తర్వాత, ఆ ప్రాంతాల్లో పనులను పర్యవేక్షించారు. స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఉన్న అవకాశాలను చర్చించారు.
హైడ్రా వచ్చి పూడిక తీత పనులను చేపట్టాక పరిస్థితి కొంతమేర మెరుగైందని, ఈ పనులు కొనసాగించాలని స్థానికులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. త్వరలో అందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు. సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేసి, వారి సహకారంతో వరద ముంచెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మురుగు ముంచెత్తే రహదారుల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. పూడిక తీత పనులకు సహకరించిన స్థానికులను కమిషనర్ అభినందించారు.

**అమీర్‌పేట్‌లో పెద్దమొత్తంలో పూడిక తీత**

భారీ వర్షం పడినప్పుడల్లా నడుంలోతు వరద నీరు నిలవడానికి అమీర్‌పేట్‌లోని మైత్రినగర్ (అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ కింద) చౌరస్తాలో భూగర్భ బాక్సు డ్రైన్లు పూడుకుపోవడమే కారణమని కమిషనర్ రంగనాథ్ గమనించారు. జూబ్లీహిల్స్, గాయత్రి హిల్స్, కృష్ణానగర్ ప్రాంతాల నుంచి సారథీ స్టూడియో పక్కనుంచి వచ్చే కాలువతో పాటు, యూసుఫ్‌గూడ, మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి వచ్చే వరద కాలువలు కలిసి అమీర్‌పేట్ వద్ద రోడ్డు దాటుతున్నప్పుడు ఇబ్బందులను కూడా పరిశీలించారు. ఎగువ నుంచి భారీమొత్తంలో చెత్త కొట్టుకొచ్చి, ఇక్కడ భూగర్భ బాక్సు డ్రైన్లు మూడుంటే రెండు పాక్షికంగా, మూడోది మొత్తం పూడుకుపోవడాన్ని గమనించారు. శ్రీనివాస్ నగర్ వెస్ట్‌లో బాక్సు డ్రైన్లను ఓపెన్ చేసి, భారీ మొత్తంలో జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. డ్రైన్ లైన్లకు అడ్డుపడిన పరుపులు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించారు. అమీర్‌పేట్ ప్రధాన రహదారి కింద ఉన్న బాక్సు డ్రైన్లలో పూర్తిగా పూడుకుపోయిన లైనును క్లియర్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.

**జూబ్లీహిల్స్ నుంచి అమీర్‌పేట్ వరకు పర్యటన**

జూబ్లీహిల్స్, వెంకటగిరి, కృష్ణానగర్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, మధురా నగర్, శ్రీనివాస్ నగర్, శ్రీనగర్ కాలనీల మీదుగా సంచరించే వరద, మురుగు నీటి కాలువలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. కొన్ని చోట్ల 8 మీటర్ల లోతున్న కాలువలు ఆరేడు అడుగుల మేర పూడుకుపోవడాన్ని గమనించారు. కృష్ణానగర్‌లో ప్రగతినగర్ వద్ద వరద కాలువలను పూడ్చేసి జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. పైన పేర్కొన్న ప్రాంతాల్లో వరద నీరు నిలవకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. పూడికను పూర్తిగా తొలగించిన తర్వాత వరద సమస్య చాలావరకు తగ్గుతుందని, లేనిపక్షంలో అన్ని శాఖలతో సమావేశం నిర్వహించి, స్థానికులను భాగస్వామ్యం చేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. కృష్ణకాంత్ పార్క్‌లోని చెరువులను విస్తరించి, వరదను నిలువరించే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వందేళ్ల వరకూ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ పర్యటన సమయంలో స్థానికులు వెంట ఉండి సమస్యలను వివరించారు. ఈ ప్రాంతాల్లో పలుమార్లు కమిషనర్ పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ముస్తాబాద్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో వాగులు వంకలు పొంగిపోతున్నాయి గతంలో ఏనాడు లేని విధంగా ఎక్కువ మానేరు వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో అన్నదాతలకు కష్టాలు నష్టాలను మిగిల్చింది. మండలంలో కొండాపూర్, ఆవునూర్, తుర్క పల్లి, గ్రామాలకు పక్కకు ఉన్న వాగు పొలాల పైనుంచి పెద్ద ఎత్తున వరద వెళ్లడంతో పంటలు కనుమరుగయ్యాయని బాధ్యత రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వేల పెట్టుబడి పెట్టి నష్టం వాటిల్లింది కోటుక పోయిన వరి పంటను మండల వ్యవసాయ అధికారులు సర్వే చేసి పంట నష్టం పై ప్రభుత్వానికి నివేదిక అందజేసి బాధ్యత రైతులను ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
**ముస్తాబాద్ (జనం సాక్షి):**

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
31 ఆగస్టు 2025

# రైతులపై స్పందన లేని సీఎం రేవంత్

- బిజెఎల్‌పి నేత ఏలేటి విమర్శలు



హైదరాబాద్, ఆగస్ట్30 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటర్‌లో తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల పెద్దఎత్తున పంట నష్టం జరిగిందని చెప్పారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులను కాపాడాలన్న కనీస ఇంకిత జ్ఞానం ముంఖ్యమంత్రికి లేదన్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టం, ప్రాణ నష్టం జరిగిందని, రైతులు నష్ట పోయారని చెప్పారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం సోయి లేకుండా అందాల పోటీ-ల మీద, మూసీ నదిపై రివ్యూలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో చర్చకు రావాల్సిన అనేక సమస్యలు ఉన్నాయని, మూడు రోజులు మాత్రమే సభను నడపాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. సీఎం చర్చలకు భయపడుతున్నారా అని ప్రశ్నించారు. భేషరతుగా 4 వారాలపాటు అసెంబ్లీ నిర్వహించాలని, ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం లేక తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు.

# రైతుల కంటతడికి కాంగ్రెస్ సమాధానం చెప్పాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పత్తిపంట పీకేసిన రైతు కుటుంబానికి పరామర్శ**



పర్వతగిరి (జనంసాక్షి) : యూరియా దొరక్కపోవడంతో ఏడెకరాల్లో పత్తి చేను పీకేసి నిరసన తెలిపిన వరంగల్ జిల్లా ఉట్టి తండాకు చెందిన రైతు భూక్యా బాలునాయక్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. శనివారం ఉదయం పర్వతగిరి మండలం ఏపీ తండా శివారులోని ఉట్టి తండాకు చేరుకున్న ఎర్రబెల్లి.. పత్తి పంటను పీకేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతు బాలు నాయక్ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే రైతాంగానికి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.

**అసలేం జరిగిందంటే..**

రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. బాగుపడ్డట్టు చరిత్రలో లేదనేది అక్షర సత్యం. కానీ, తన పాలనలో రైతులను అరిగోస పెడుతూ కాంగ్రెస్ పాలకులు ఆ నానుడిని నిజం చేస్తున్నారనేది నేటి నిజం. యూరియా సరఫరాలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంపై భూక్యా బాలునాయక్ కుటుంబంతో కలిసి వినూత్న నిరసన తెలిపాడు. యూరియా దొరకక విసుగుచెందిన బాలునాయక్ ఏడెకరాలలోని పత్తి చేనును పీకేశాడు. కాంగ్రెస్ పాలనతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. యూరియా దొరక్క పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంగాక కడుపుమండి పత్తి చేనును పీకేసినట్టు రైతు బాలు కన్నీటి పర్యంతమయ్యాడు. గతంలో సీఎం కేసీఆర్ సారు రైతాంగానికి అన్ని విధాలుగా అండగా నిలిచారని గుర్తుచేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కంట కన్నీటికి కారణమయ్యాడని, దగా చేశాడని మండిపడ్డారు. బాలునాయక్ కుటుంబం నిరసన విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకులు వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు.

# సీఎం సహాయ నిధికి బాలకృష్ణ రూ.50లక్షల ఆర్థిక సాయం



హైదరాబాద్ (జనంసాక్షి) : సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గొప్ప మనసు చాటుకున్నాడు. ఇటీవల తెలంగాణలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. కామారెడ్డితో పాటు పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. ముఖ్యంగా కామారెడ్డిలో వరదలు విధ్వంసం సృష్టించాయి. ఈ క్రమంలో బాలకృష్ణ మంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థిక సాయం ప్రకటించారు. కన్నీళ్లను ఎవరూ తుడవలేమన్న ఆయన.. తన వంతుగా సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాలు కురవడంతో వరదలు పోటెత్తి భారీ నష్టాన్ని మిగిల్చాయన్నారు. రైతులతో పాటు ప్రజలు చాలా నష్టపోయారని తెలుసుకొని చింతిస్తున్నానని.. వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు.

# మాగంటి గోపీనాథ్ ప్రజల మనిషి

- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం
- సంతాప చర్చలో కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్30 (జనంసాక్షి) : జీవించినంత కాలం మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్, డైనమిక్ లీడర్‌గా పని చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. శాసనసభలో మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంతకాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. గుమ్మనంగా ఉంటూ తన వ్యక్తిగతమైన ఆరోగ్య విషయాలను చాలా రహస్యంగా ఉంచారు. కానీ పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో గోపీనాథ్ జన్మించారు. ఇక్కడే చదవుకుని ఉస్మానియాలో డిగ్రీ చేశారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టీడీపీలో అడుగుపెట్టారు. బషీర్‌బాగ్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నివాసం ఉండేది మేం. ప్రస్తుతం ఉన్న అమర జ్యోతి ముందు ఓ కటౌట్ కనబడేది.. నిలువెత్తు కృష్ణుడు, రాముడు రూపంలో ఎన్టీఆర్ కటౌట్ ఉండేది.. దాని కింద మాగంటి గోపీనాథ్ అని రాసి ఉండేది. అప్పటినుంచే తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్నారు గోపీనాథ్ అని కేటీఆర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి క్రియాశీలంగా రాజకీయాల్లో ఉన్నారు గోపీనాథ్. ఒక పార్టీని, నాయకుడిని నమ్ముకుంటే.. ఎన్టీఆర్ నాయకత్వంలో.. కేసీఆర్ నాయకత్వంలో కష్టమొచ్చినా నష్టమొచ్చినా పని చేశారు. ఎమ్మెల్యేగా సేవలందించారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. గోపీనాథ్ ఎప్పుడూ కూడా గుమ్మనంగా ఉండేవారు. ముగ్గురు పిల్లలు 21 ఏండ్ల లోపే. ఎవరూ సెటిల్ కాలేదు పెళ్లిల్లు కాలేదు. ఆయన ఇల్లు చూసి బాధపడ్డాం. బతుకమ్మ చీరలను ప్రారంభించే కంటే ముందు.. తన నియోజకవర్గంలో బతుకమ్మ పండుగకు చీర పెట్టే సంస్కృతి తీసుకొచ్చారు గోపీనాథ్. నియోజకవర్గంలో గోపన్న అని పిలుచుకుంటారు. ప్రజలతో నిత్యం మమేకమయ్యేవారు గోపీనాథ్ అని కేటీఆర్ గుర్తు చేశారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఓ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే.. దాన్ని అడ్డుకుని పిల్లలకు గ్రౌండ్‌గా తీర్చిదిద్దారు. బతుకమ్మ వేడుకలు, రంజాన్, క్రిస్మస్ వేడుకలను ఆ గ్రౌండ్‌లో నిర్వహించారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ గోపీనాథ్‌కు. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు-. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రజాతప్పిదం వల్లే కామారెడ్డిలో వరదలు

- కామారెడ్డి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



కామారెడ్డి(జనంసాక్షి) : వరదలపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అతి విశ్వాసంతోనే ప్రజలు వరదల్లో చిక్కుకున్నారని అన్నారు. విపత్తుల సమయంలో ప్రభుత్వం, నేతలు ఏమీ చేయలేరని.. ప్రజలే అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు. వరద తక్కువగా ఉన్నప్పుడు బయటికి వస్తే బాగుండేదని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి తెలిపారు. ప్రజాతప్పిదం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. ఆక్రమణలు కూడా ఇందుకు కారణమే అని చెప్పారు. అధికారులు, ఎమ్మెల్యే కనబడటం లేదని.. ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. ఓటు వేసినందుకు ముద్ది కడగాలంటే కుదరదని ఘాటుగా విమర్శించారు. వరదల్లో అన్ని ప్రాంతాల్లో పర్యటించానని.. కానీ ఫొటోలకు పోజులు ఇవ్వలేదని వెంకటరమణ రెడ్డి తెలిపారు. కామారెడ్డిలో మూడు గంటల్లో కుండపోత వర్షం కురిసిందని, జల విలయం సంభవించిందని చెప్పారు. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కామారెడ్డి చుట్టుపక్కల చెరువులు అలుగు పారాయని, కట్టలు తెగిపోయాయని అన్నారు. ఊహించని నష్టం వాటిల్లిందని తెలిపారు. వర్షాల్లో అధికారులతో కష్టపడి పనిచేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ కొంతమంది సోషల్‌మీడియాలో ఘోరమైన కామెంట్లు పెడుతున్నారని మండిపడ్డారు. విపత్కర పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా ఉండాలి తప్ప.. ఇలాంటి పిచ్చి కామెంట్లు పెట్టడం సరికాదని హితవు పలికారు. వరదల్లో నేను ఏం చేశానో బాధితులకు తెలుసని వ్యాఖ్యానించారు.

# కోటంరెడ్డి హత్యకు కుట్ర

**లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

నెల్లూరు, ఆగస్ట్30 (జనంసాక్షి) : ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిపై దాడి చేసేందుకు జరిగిన కుట్ర వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ కుట్ర చేసిందెవరు? ఆ కుట్ర వెనుక ఉన్నది ఎవరు? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. కోటంరెడ్డి హత్య కుట్ర వీడియోపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వీడియోలో ఉన్న వారిలో ఒకరు ప్రస్తుతం జైలులో ఉండగా.. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకి కుట్రపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. వీడియోలో ఉన్నది రౌడీషీటర్ శ్రీకాంత్ ముఖ్య అనుచరుడు జగదీశ్, మహేశ్, వినీత్, జకీర్, రాజశేఖర్ రెడ్డిగా గుర్తించారు. వారంతా పాత నేరస్థులు అని నిర్ధారించారు. గతంలో పలు నేరాలకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. జగదీశ్ ఇటీవల అరెస్ట్ అయ్యి, గంజాయి కేసులో రిమాండ్‌లో ఉన్నాడు. మిగిలిన నలుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో ఉన్న అంశం, కుట్ర వెనుక ఎవరున్నారనే వాటిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ వీడియో వైరల్ అవడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. హోంమంత్రి అనిత వెంటనే ఎమ్మెల్యే కోటంరెడ్డికి ఫోన్ చేశారు. ప్రభుత్వం మొత్తం అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

# రాయలసీమను రతనాల సీమగా మారుస్తా

- ప్రతి చెరువును నీటితో నింపే ప్రయత్నం చేస్తా
- అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపాకు అడ్డుకట్ట వేస్తాం
- పరమసముద్రం సభలో చంద్రబాబునాయుడు



కుప్పం, ఆగస్ట్30 (జనంసాక్షి) : రాయలసీమను రతనాలసీమగా చేసే బాధ్యత తనదని ముందే చెప్పానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉంది. కుప్పంలో 520 చెరువులు ఉన్నాయి. గొలుసుకట్టు- చెరువులు ఉన్నాయి. చెక్‌డ్యామ్‌ల ద్వారా నీళ్లిచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలను 730 కిలోమీటర్లు తీసుకొచ్చిన ఘనత తెదేపాది. ముఠా రాజకీయాలు లేకుండా చేసిన పార్టీ తెదేపా. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల 6 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. 33 లక్షల మందికి తాగునీరు అందుబాటు-లో ఉంటు-ంది. పరిశ్రమలకు కూడా నీళ్లొస్తాయి. ఇప్పుడు కుప్పానికి నీళ్లొచ్చాయి. రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లిచ్చే బాధ్యత నాది. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వగలిగితే నా జన్మ సార్థకమవుతుందన్నారు. 2014-2019 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టు కోసం రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. కానీ, వైకాపా పాలనలో కేవలం రూ.2 వేల కోట్లు-ఖర్చుపెట్టారని విమర్శించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. పరమసముద్రం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గేట్లతో సెట్టింగ్‌లు వేసి నీళ్లు కూడా బయటి నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు చూశాం. విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులు చూశాం. అసత్యాలు చెప్పడంలో వైకాపా దిట్ట. అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఎన్డీయే లక్ష్యం అన్నారు. నీళ్లు వచ్చేసరికి వైకాపా నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. మల్యాలలో ప్రారంభించి కుప్పం పరమసముద్రానికి నీళ్లు తీసుకొచ్చాం. 27 లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి ఎక్కడికక్కడ నీళ్లు తరలిస్తున్నాం. కుప్పానికి రెండేళ్ల కంటే ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. గతంలో రాయలసీమలో కరవు వస్తే.. పశువుల కోసం రైలులో నీళ్లు తెప్పించి కాపాడుకున్నాం. నేను ఏ పని చేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా. పవిత్రమైన సంకల్పం ఉంటే ఏ పనైనా జయప్రదమవుతుందన్నారు. పోలవరం-బనకచర్ల పూర్తయి వంశధార నుంచి పెన్నానది వరకు అనుసంధానం చేయగలిగితే కరవనేదే ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని తెలంగాణ నేతలు తెలుసుకోవాలి. నీళ్లు సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచిస్తున్నా. నీళ్లు లేనప్పుడే వాటి విలువ తెలుస్తుంది. జలాశయాల్లో నీటి నిల్వ ఎంత ముఖ్యమో, భూమినే జలాశయంగా తయారు చేసుకోవడం అంతకంటే ముఖ్యం. ఒక యజ్ఞం ద్వారా అభివృద్ధి కోసం ముందుకెళున్నాం. దానిని భగ్నం చేసేందుకు వైకాపా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. మీకు చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడండని పిలుపునిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. వైకాపా ఒక విషవృక్షంగా తయారైంది. మనం ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మరోమారు బంగారం, వెండి ధరల పరుగు

న్యూఢిల్లీ, ఆగస్ట్30 (జనంసాక్షి) : దాదాపు ఆగస్టు నెల చివరికి వచ్చినప్పటికీ బంగారం, వెండి రేట్లలో ర్యాలీ కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ, ట్రంప్ దూకుడు చర్యలతో పాటు ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నా యి. దీనికి తోడు సెప్టెంబర్ ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఊహాగానాలు గోల్డ్ వంటి సేఫ్ హెవెన్ దిశగా పెట్టుబడిదారులు మారేలా చేస్తోందని రేట్ల పెరుగుదల గురించి బులి యన్ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. 24 క్యారెట్ల బంగారం రేటు ఆగస్టు 29తో పోల్చితే 10 గ్రాములకు ఆగస్టు 30న రూ.1640 పెరిగింది. అంటే గ్రాముకు రేటు రూ.164 పెరగటంతో కొనుగోలు దారులకు ధరలుచుక్కలు చూపిస్తున్నాయి. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు ఆగస్టు 29తో పోల్చితే శనివారం అంటే ఆగస్టు 30న 10 గ్రాములకు రూ.150 పెరుగుదలను చూసింది. బంగారం రేట్లతో పాటు మరోపక్క వెండి కూడా తమ ర్యాలీని వారాంతంలో కొనసాగిస్తోంది. ఆగస్టు 30న కేజీకి వెండి ఆగస్టు 29తో పోల్చితే రూ.11 వందలు పెరగటంతో తెలుగు రాష్ట్రాల్లో స్వచ్ఛమైన సిల్వర్ రేటు కేజీకి రూ.లక్ష 31వేలకు చేరుకుంది. అంటే గ్రాము వెండి రేటు రూ.131 వద్ద విక్రయాలు జరగుతున్నాయి.

# గుండెపోటుతో కార్డియాలజీ వైద్యుడు మృతి

**విధుల్లో ఉండగానే కుప్పకూలిన వైనం**

చెన్నై, ఆగస్ట్30 (జనంసాక్షి) : విధుల్లో ఉండగానే తమిళనాడుకు చెందిన కార్డియాక్ సర్జన్ డా.గ్రాడ్లిన్ రాయ్ (39) గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డా. గ్రాడ్లిన్ రాయ్ బుధవారం విధుల్లో భాగంగా ఆసుపత్రి వార్డుల్లో రౌండ్స్‌లో ఉండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అతడిని కాపాడడానికి సహోద్యోగులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని.. గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు పేర్కొన్నారు. కార్డియాలజీపై అవగాహన ఉండి.. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకునే కార్డియాక్ సర్జన్ గుండె పోటుతో మరణించడం ఆందోళనకరమైన విషయమని సహచర డాక్టర్లు పేర్కొన్నారు. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవన్నారు. యువతలో హఠాత్తుగా సంభవిస్తున్న గుండెపోటు మరణాలకు ఒత్తిడి, దీర్ఘకాలిక పని గంటలే కారణమని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వైద్యులు రోజుకు 12-18 గంటలు పనిచేయాల్సి వస్తుందని.. కొన్నిసార్లు ఒకే షిఫ్ట్‌లో 24 గంటలు కూడా విధుల్లో ఉండాల్సి వస్తుందన్నారు. అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. మరికొందరిలో అనారోగ్యకరమైన జీవనశైలి, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అనేక కారణాలు కూడా ఉండొచ్చని తెలిపారు.



# గోదావరికి పోటెత్తిన వరద

**నీట మునిగిన బాసర వీధులు**

ఆదిలాబాద్, ఆగస్ట్30 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జిలు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ-చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు-ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370